సాహిత్య

# ప్రస్థానం

డిసెంబర్ 2014

వెల రూ. 10



సాహితీస్రవంతి



సాహిత్య
ప్రస్థానం
డిసెంబర్ 2014
సంపుటి : 13    సంచిక : 12

# సంస్మరణ, అనుసరణ

ఈ ఏడాడి నవంబరు 30 నుంచి మహాకవి గురజాడ అప్పారావు శతవర్థంతి ప్రారంభమవుతున్నది. సాహితీ మిత్రులు ఇప్పటికే వివిధ కార్యక్రమాలు రూపకల్పన చేశారు. గురజాడను సంస్మరించుకోవడానికి ఆయన ప్రబోధించిన సంస్కారాన్ని సంస్కరణలనూ అనుసరించడానికి దీక్ష బూనే తరుణమిది. సాహిత్య ప్రస్థానం ఈ సందర్భంలో ఆయనకు శతాధిక నివాళులర్పిస్తుంది. వచ్చే ఏడాది ఆయనపై సమగ్ర ప్రత్యేక సంచిక వెలువరించేందుకు కృషి జరుగుతుంది. దీనిపై పాఠకులు రచయితల నుంచి సూచనలు రచనలు ఆహ్వానిస్తున్నాం. అందులోనూ నిరంతరం చెప్పుకునే అంశాలతో పాటు నూతన కోణాలను ఆవిష్కరించే అరుదైన సమాచారం అందించే రచనలకు ప్రత్యేక ప్రాధాన్యత వుంటుంది.

తెలంగాణా ప్రజా రచయిత, ఉద్యమ కారుడు వట్టికోట ఆళ్వారు స్వామి శతజయంతి కూడా ఇప్పుడు జరుగుతున్నది. ప్రజల మనిషి రచనతో తెలంగాణా సాయుధ పోరాట సాహిత్యానికి అంకురార్పణ చేసిన వ్యక్తి ఆళ్వారు స్వామి. అనేక కష్టనష్టాల మధ్య అభ్యుదయ ప్రజా సాహిత్యానికి అంకితమైన దీక్షా దక్షుడు.తను రాయడమే గాక ఎందరో రచయితలను ప్రోత్సహించాడు. గత ఏడాది కాళోజీ నారాయణ రావు శతజయంతి ఉత్సవాలు జరిగితే ఈ ఏడాది వట్టికోట వేడుకలు వచ్చాయి. ప్రజలతో మమేకమైన ఈ రచయితల ఆదర్శం అందరికీ శిరోధార్యం.

.........

కార్మికులు ఉద్యోగులు ఎంతగానో పోరాడి సాధించుకున్న హక్కులపై దాడులు తీవ్రమవుతున్నాయి. కార్మికుల సదుపాయాలు హక్కులు పర్యవేక్షించేందుకు ఉద్దేశించిన తనిఖీ వ్యవస్థను గణనీయంగా కుదించే బిల్లును నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆమోదిస్తున్నది. ధనస్వాములకు పన్ను రాయితీలు విదేశీ కంపెనీలకు ఆహ్వానాలు జోరుగా సాగుతున్నాయి గాని కార్మికులు ఉద్యోగులు పేదల జీవితాలపై మాత్రం ప్రైవేటు తీవ్రమవుతున్నది. ఆర్థిక మంత్రి నేరుగా బడా బాబుల తరపున వకాల్తా తీసుకున్నట్టు మాట్లాడుతున్నారు. ప్రజల తరపున నిలిచే రచయితలు వారిపై భారాలు మోపి రక్షణలు తొలగించే ఇలాటి చర్యలను తప్పక నిరసించవలసి వుంటుంది.

బొమ్మలు : తుంబలి శివాజి, జె.వెంకటేష్, భాస్కర్

## ఈ సంచికలో ...

కవిత ........................ 4
అంకురం (కథ) ........................ 5
కవిత ........................ 9
మహనీయ మార్గదర్శి ........................ 10
కవిత ........................ 13
అక్షరాల్ని ఆయుధాలుగా ప్రయోగించిన దార్శనికుడు ........................ 14
కవిత ........................ 17
తాత్త్విక పరిశోధన పునాదిపై పాపినేని కవితా నిర్మాణం ........................ 18
కవిత ........................ 22
మచ్చలేని చందమామ (కథ) ........................ 23
కవిత ........................ 28
అమెరికా తెలుగు కథకు 50 ఏళ్ళు ........................ 29
కవిత ........................ 34
మరపురాని మంచి కల ........................ 35
కవిత! ........................ 38
ఆమె తల్లి (కథ) ........................ 39
కవిత ........................ 43
స్వీకారం ........................ 44
డైరీ ........................ 46

సంపాదకవర్గం

తెలకపల్లి రవి (సంపాదకుడు)
కె.ఆనందాచారి
వొరప్రసాద్
వల్లభాపురం జనార్దన
కె.లక్ష్మయ్య, మేనేజర్

చిరునామా
సాహిత్య ప్రస్థానం
ఎం.హెచ్‌భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్
ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర,
హైదరాబాద్ - 500 020,
ఫోన్ : 27660013, 9490099059
ఫ్యాక్స్, 040ῖ27635136,
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com
www.prasthanam.com

## కవిత

# గవాక్షవీక్షణం

– డా॥ సోమసుందర్ ఆవంత్స
9347848905

అక్షర గవాక్షంలోంచి
కనిపిస్తున్న పామరుడు – నేటికీ వామనుడే!
జ్ఞాన కాంతీ కర్మణ్య శక్తీ అందుకుని –
చేస్తాడా విశ్వరూప ప్రదర్శనం!

ఒక పాదం భూతల అసమానతలపైనా
వేరొక అడుగు ఆకాశపు అత్తగారి ఆరళ్ళపైనా
ఉంచి ప్రశ్నిస్తాడా? తప్పదు కదా!
గగన గవాక్షంలో మార్తాండునిగా....
తాపజ్వాలలో స్వార్థ మత్త శిరస్సులుడికించి,
పాతాళ గభీరత్వాలకు పంపక తప్పదు కదా!

అందుకే పురాణ మిత్యేవ నసాధుసర్వం
అన్నాడు కవికుల గురువు!

గవాక్ష వీక్షణం లోంచి అక్షర సాక్షిని అడిగితే–
సత్యం నీళ్ళకుండల కావడి కాదని,
పాలకోసం వేరొక చేరులో రాళ్ళు మోయదనీ
కాళింది మడుగుగా మారిన లోకంలో
అరిషడ్వర్గాల ఆరు పడగలపైనా
బరువు పాదాలు నిలిపి అణచక తప్పదనీ,
అశరీణ వాణి అద్భుతగానం చేసింది..

నేటివరకూ అద్భుతాలు చెప్పిన పండితులకు
రౌరవాది నరకాలలో విశ్రాంతికి విడిది!
వారి నేత్రాలెంత విశాలమో, వీక్షణ కాంతులు పరిమితమే!
రజోగుణ రజ్జువును సర్పభ్రాంతితో....
ఆరాధించిన పిరికి వాళ్ళకదే సముచిత నివాసం!
వారి విభ్రాంత హృదయ ఢమరుకం!



వీరణంగా మ్రోగక తప్పదు!
నిబద్ధత గురించి ఉపదేశించిన
అబద్ధీకుల అసవర్గమే జీవన్నరకం!

అక్షర గవాక్షం వీక్షింపచేసే దృశ్యంలా
శబ్దాలా, ఆలాపాలా అసంఖ్యాకం!
వృథా వాగ్దానాలు, మృషా సాహసాలూ
అతకరించబడ్డ, జీవన రథ్యలు....
నేటి రథీ సారథీ పామరుడే
సకల జ్ఞాన సుమనుపై అమర్త్యుపై
అందుకుంటాడు కనకాభిషేకాలు!

అక్షరాలకు శీర్షికలతో పనిలేదు.
వివక్షకు అక్షియుగ్మం అవసరమే కదా!
బిగ్‌బోయ్ అని నామకరణం చేసినా
లిటిల్ ఫెలో అని ఈసడించినా,
విపత్కర శక్తి లక్షలాది ప్రజలను స్వాహాచేయక
మానదు.
విధ్వంసాన్ని తథాగతుని దరహాసమని
పిలిచినా, మానవ కళ్యాణం సిద్ధించదు
హాస్యమూ, అపహాస్యమూ, ప్రాణమూ, మరణమూ
పేరులోనే ఉంది. చూడని మనసుకు రెక్క
తొడుగుతుంది.
విశ్వామిత్రుని నిశ్శబ్ద సంయోజనాశక్తి
సాధారణా న్వయాల కందదు.
నిరంతరం కవి చేసే అక్షర తపసు!
అనిమిష మనస్కులకే అవగత మతుంది!

---

## నవంబర్ నెల పురస్కారాలు



**భైరవుడి ఊరేగింపు**

కథకు: రూ.700/-

రచయిత : **శ్రీనాగాస్త్ర**

**అంకురమై....**

కవితకు : రూ .500/-

రచయిత : **మెరాజ్ ఫాతిమా**



*సినీ రచయిత జనార్దన మహర్షి అందిస్తున్న పురస్కార చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*

పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు.
సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే
ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు.

**- ఎడిటర్**

కథ

# అంకురం



- శాంతిశ్రీ
9866371283

***'శ్రీ నీ ఫోనే రింగవుతోంది చూడు!' అంటూ వంటింట్లోంచి కేకేసింది అమృత.***

***ఆమె చెప్పడం శ్రీ ఫోన్ ఎత్తడం ఒకేసారి జరిగాయి.***

***'హలో! ఏంటప్పా ! ఈ రోజు పొలం వెళ్లలేదా?'***

'లేదురా శీనా! మధ్యానం వెళతా. అమ్మోళ్ల గేదె ఈనిందిరా. ఈనితే ఫోన్ చేయమన్నావంటగా! మరి ఈ రాత్రికి బయల్దేరి వస్తావా? జున్నుపాలు అట్టేపెట్టమంటావా?' అడిగింది అటువైపు నుండి శివమ్మ.

'పాలు తీసి మీ ఫ్రిజ్‌లో ఉంచప్పా! ఈ రాత్రికి వీలుకాకపోయినా రేపు రాత్రికి అయినా బయల్దేరతాం!' అన్నాడు శ్రీనాథ్.

'ఇంకా ఏంటి సంగతులు? ఇంతకీ పుట్టింది పెయ్యా? కోడిదూడా?'

'కోడిదూడేరా!'

'అయ్యో! మరి నాన్నేమంటున్నాడు?'

'ఏమనదేముంది? బతికితే కొన్నాళ్లుంచి, ఆ తర్వాత లంకకి తోలతానంటున్నాడు.'

'అయ్యో! సరే మరి ఉంటా!' అంటూ ఫోన్ పెట్టేశాడు శ్రీ.

అప్పుడే వంటగదిలో నుండి వస్తూ 'ఏంటండీ వదిన ఏమంటోంది?' అడిగింది అమృత.

'ఏమీలేదు. గేదె ఈనిందంట. మొన్నెళ్లినప్పుడు అమ్మకు చెప్పాలే. ఈనితే ఫోన్ చేయించమని. జున్ను తిని చాలా రోజులైందిగా..! అందుకే మా అప్ప ఫోన్ చేసింది. అయితే కోడిదూడ పుట్టిందంట! ఇక అది లంకకు పోవాల్సిందే.

'సీతమ్మవారిని రావణాసురుడి లంకకు తీసికెళ్లినట్లు, లంకకా? ఏ లంకకు?' ఆశ్చర్యంగా అడిగింది అమృత.

'గేదెకు పెయ్యిదూడ పుడితే అది పాడిగేదె అవుతుంది. అదే కోడిదూడ అయితే దున్నపోతవుతుంది. దానివల్ల ప్రయోజనమేముంది? ఇదివరకైతే దున్నపోతులతోనూ వ్యవసాయం చేసేవారు. ఇప్పుడు ట్రాక్టర్లు వచ్చాక ఎద్దులతో కూడా అవసరం లేకుండా పోయింది. ఇక ఆ కోడిదూడ బతుకు లంకకే. మా ఊళ్లో లంక అని కొండకు దిగువున లోయలా ఉంటుంది. ఇక అందులో వదిలిపెడితే బయటికి రావడానికి ఉండదు. అయితే మేత మాత్రం పుష్కలంగా దొరుకుతుంది. కొన్నాళ్లు వాటిని అక్కడ వదిలేస్తారు. అవి బాగా బలిసి, పెద్దయ్యాక కోతకు తోలేస్తారు' అనగానే

'కోతకా? కోతకంటే ఏంటి శ్రీ?' మరింత ఆశ్చర్యంగా తన విశాలమైన నేత్రాల్ని మరింత విప్పార్చి అడిగింది అమృత.

'కటింగ్‌కు.. అదే కబేళాకు' అంటూ చాలా మామూలుగా చెప్పాడు శ్రీ.

ఆ మాట వినగానే ఒక్కసారి చిగురుటాకులా వణికినట్లయ్యింది అమృత.

◆◆◆

పద్మ ప్రసవానికని పుట్టింటికి వచ్చింది.

అప్పటికి వచ్చి వారం దాటింది.

ఆమెను చూడాలని చీకటి పడుతుండగా పద్మ భర్త రంగారావు వచ్చాడు.

అల్లుడు వచ్చాడని నీళ్ల కాగు పొయ్యి మీద వేసింది పార్వతమ్మ.

'కొంచెం నేను మోయలేనిగానయ్యా! బకెట్లోకి వేణ్ణీళ్ళు తోడాను, చన్నీళ్లు దొడ్డి దగ్గర ఉన్నాయి. ఆ బక్కెట్లోవన్నీ ఇప్పుడు పంపొస్తే పైపుతో పట్టినవే! వాటిల్లోవి పోసుకో' అంటూ రంగారావు దగ్గరకు వచ్చి చెప్పింది పార్వతమ్మ.

'అట్టాగే అత్తయ్య. నే పట్టికెళ్తాలే!' అంటూ రంగా లేవగానే.

'అమ్మాయి పద్మా! రంగాకు టవల్ ఇవ్వు!' అంది పార్వతమ్మ. పద్మ టవల్ ఇవ్వగానే అందుకుని స్నానానికి వెళ్లాడు రంగ.

స్నానం చేసి వచ్చేలోగా అల్లుడికి వేడి వేడి పప్పుచారులోకి ఉప్పుచేప వేపి పెట్టింది పార్వతమ్మ.



ఆ వాసనకే రంగాకు ఆకలి గుర్తుకొచ్చింది. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే అన్నం తినడానికి కూర్చున్నాడు. 'అమ్మాయి పద్మా! పెందరాళే నువ్వూ ఓ ముద్ద తినేయమ్మా!' అంటూ పద్మకు కూడా అన్నం పళ్లెంలో పెట్టుకొచ్చింది పార్వతమ్మ.

ఆ తర్వాత భర్త రాఘవయ్యకూ అన్నం పెట్టి, తానూ పెట్టుకుని, తింది పార్వతమ్మ.

అందరవీ భోజనాలు అయ్యాక వసార్లోనే పార్వతమ్మ నులక మంచం వాల్చుకుంటే, రాఘవయ్య మడతమంచం వేసుకున్నాడు.

పద్మ ఇంట్లో నవ్వారు మంచం మీద పక్కేసింది.

'ఏంటే పద్మా! అట్టా దూరంగా నుంచున్నా, ఇలా రా దగ్గరకు!' అంటూ రంగా పిలిచిన పిలుపులో ఆప్యాయత కన్నా గద్దింపే ఎక్కువ వినపడింది పద్మకు.

అందుకే ఉలిక్కిపడినట్లు అయ్యి మెల్లగా వెళ్లి మంచం పట్టీ మీద కూర్చొంది.

'ఏంటా కూర్చోటం వయ్యారంగా! అసలే నీళ్లోసుకున్నావు, సరిగ్గా కూర్చోకపోతే పడిపోగలవు' అన్నాడు రంగా.

మౌనంగానే కొంచెం వెనక్కి జరిగి, కూర్చొంది పద్మ.

ఇంతలో 'అమ్మా! టైమెంతైంది? అందరూ అన్నాలు తినేశారా ఏంది? అప్పుడే పడకలు ఏసేశారు? పద్మ అప్పుడే పడుకుందా ఏంది?' అంటూ ఆదర బాదరాగా అడుగుతూనే వచ్చింది శివమ్మ.

'ఆ.. తిన్నామమ్మాయి! రంగా వచ్చాడు. ఇప్పుడే వాళ్లు లోనికి వెళ్లారు. ఇంకా పడుకోలేదల్లే ఉంది' అంది పార్వతమ్మ.

'సరేలే పడుకోనీ. నాయుళ్ల బజార్లోని సీతారావమ్మ అక్కాయికి మొన్న పొలానికెళతా కొంచెం చింతకాయ పచ్చడి ఉంటే పద్మ కోసం పెట్టమన్నా. ఇంటికెళ్లేప్పుడు ఎత్తికెళ్తానని చెప్పా. పెట్టిచ్చింది. కింద అందరికీ రేపు పొలం సంగతి చెప్పుకుంటా వచ్చేసరికి ఈ వర్రైంది (సమయమైంది). రేపు కాసింత ఎండిమిరగాయలు ఏపి, దానికి కాస్త నూరిపెట్టు. కాసింత నెయ్యేసుకుని ఏడేడి అన్నంలో నాలుగు ముద్దలు కమ్మగా తింటది. ఇంటికాడ అన్నం వండారో లేదో? నువ్వేం వండా?' అంటూ ఆ తెచ్చిన డబ్బాను గూట్లో పెట్టింది శివమ్మ.

'పప్పుచారు కాసానమ్మాయి. కాసిన్ని పట్టికెళతావా?' అంటూ 'నేను లెగలేనులే గానీ, అక్కడ చట్టిలో వాన్నాయి, కాసిన్ని పోసుకెళ్లు!' అంది పార్వతమ్మ.

లోపల నుండి ఇవన్నీ వింటున్న పద్మ బయటకు రావాలని మంచం మీద నుంచి లేచిందిగానీ, భర్త 'ఎక్కడికి వెళ్లేది, కూర్చో' అన్నట్లు కళ్లతోనే మిర్రున చూసేసరికి, కూర్చుండిపోయింది.

'ఇదిగో నీకే చెప్తున్నా. ఈసారి ఆడపిల్ల పుట్టిందా? ఇక్కడే ఉంటావు. మగ పిల్లాడు పుడితేనే నేనైనా, నువ్వైనా గర్వంగా తలెత్తుకుని తిరిగేది. నీకు మరీ మరీ చెప్తున్నా' అంటూ రంగారావు అదేదో అంతా పద్మ చేతుల్లోనే ఉన్నట్లు చెప్పుకొస్తున్నాడు.

'బావా! నీకు నేను నీళ్లోసుకున్నప్పటి నుంచి చెప్తున్నా. ఆడ అయినా, మగ అయినా మన చేతుల్లో ఉండదు అని. ఎవరు పుట్టినా మన పిల్లలే. మన పిల్లల్ని మనం పారేసుకుంటామా?' అంటూ కాస్త గట్టిగానే చెప్పాననుకున్నా పద్మ గొంతు అతన్ని బతిమిలాడుతున్నట్లే ఉంది.

'అదే, ఇలాంటి కథలే నాకు చెప్పొద్దని చెప్పా. ఇవన్నీ వినీ వినీ నా చెవులు తుప్పట్టిపోయాయే. ఏదో ఎక్స్ అంటావు, వై అంటావు. అసలు ఇవన్నీ నీకెవరు చెప్తున్నారే?' అంటూ గదిమాడు.

'అదిగో అట్టాగే గదమొద్దనేది. రేపు బెంగళూరు నుండి అన్నయ్యా, వదినా వస్తున్నారు. వదిన బాగా చదువుకుంది. నువ్వు కూడా ఉండు. నేను నీకు అర్థమయ్యేలా, కోపం రాకుండా చెప్పలేకపోతున్నా. వదినైతే నీకు అర్థమయ్యేలా చక్కగా వివరించి చెప్తుంది' అంది పద్మ.

'అక్కాయి చెప్పినా, ఎవరు చెప్పినా, నాకు మాత్రం మగపిల్లాడే కావాలి. అట్టాగైతేనే నువ్వు ఇంటికొచ్చేది. లేకపోతే పెద్దపిల్లను కూడా తెచ్చేసుకుని, ఇక్కడే పడుండు' అంటూ టవల్ విసురుగా విదిల్చి, తలకింద పెట్టుకుని అటుతిరిగి పడుకున్నాడు రంగా.

పద్మ కళ్లన్నీ నీళ్లతో నిండిపోయి బటబటా కారడం మొదలైంది. అలాగే ఏడుస్తూ ఆలోచిస్తోంది...

"బావను వచ్చిన దగ్గర నుండి చూస్తున్నా.. 'ఎట్టా ఉన్నావు పద్మా? మందులు ఉన్నాయా? టైమ్‌కి వేసుకుంటున్నావా? డాక్టర్

దగ్గరకు వెళ్లావా?' అన్న ఊసు లేదు. 'ఇంటిదగ్గర పిల్ల ఎట్లా ౼ాందని?' అడగబోతే అదేదో అంత అవసరమైంది కాదన్నట్లు వేరే విషయంలోకి వెళ్లిపోతున్నాడు. తింటానికి కాసిన్ని కాయలన్నా తేలేదు. నాకు హల్వా అంటే ఇష్టం. అదన్నా తెస్తాడనుకున్నా. ఊహూ ఆ ధ్యాసేమీ లేనట్లుంది. మగపిల్లాడు కావాలనే రంది బాగా ఉంది. ఇవన్నీ వదిలి, మన సోయిలోకి ఎప్పుడొస్తాడో ఏందో?' అని నిట్టూరుస్తూ నిద్రలోకి జారుకుంది పద్మ.

◆◆◆

చీకటి ఇంకా తొలగలేదు. పార్వతమ్మ చీపురుతో వాకిలి ఊడుస్తోంది. రాఘవయ్య గేదెల దగ్గర శుభ్రం చేస్తున్నాడు. వాకిట్లో ఆటో ఆగిన శబ్ధం. 'బెంగళూరు నుండి శ్రీనాథ్, అమృత అనుకుంటా' అని అనుకుంటూనే 'ఏంట్రా నడిపోడా! ఎన్ని గంటల బస్సుకు బయల్దేరారు?' అంటూ పార్వతమ్మ ఊడుస్తున్న చీపురు అక్కడ పడేసి అడుగుతూనే గబగబా అడుగులేస్తోంది. కానీ ఆమె అడుగులు సరిగా పడటం లేదు. ఎప్పటి నుంచో ఆమె కుడి మోకాలు ఓ పక్కకు తిరిగిపోయి నడవలేకపోతోంది. అయినా ఆగకుండా కొడుకును కళ్లతో చూడాలని ఆత్రంగా ముందుకు అడుగులేసింది పార్వతమ్మ.



'ఏమే నీదంతా హడావుడీ కాకపోతే, వాకిట్లోదాకా వచ్చినోళ్లు ఇంటోకి రారేమే!' పకపకా నవ్వాడు రాఘవయ్య. ఆయన బోసి నోరు చూసి పార్వతమ్మ కూడా మురిసిపోయి, తన ఆత్రాన్ని ఎగతాళి చేస్తున్న ముసలాయిన్ని 'చాల్లే సంబడం' అంటూ చేతులుజావి తిప్పుకుంటూనే కొడుక్కి ఎదురెళ్లింది.

శ్రీనాథ్ తల్లిని ఓ చేత్తో చుట్టి పట్టుకుని, మరో చేత్తో బ్యాగ్‌తో మెల్లగా వసారా వరకూ నడిపించాడు.

'నీ కొడుక్కి జున్నుపాలు తాగే యోగం ఉందే. అందుకే వెంటనే బయల్దేరి వచ్చాడు' అన్నాడు రాఘవయ్య.

'ఆడెప్పుడూ అదృష్టవంతుడేనయ్యా! ఆడి పుటకే అదృష్టం. అమావాస్య రోజు కాకుండా ఆ తెల్లారి పుట్టాడు మరి. ఏమనుకున్నావో?' అంటూ రాఘవయ్యకు సవాల్ విసిరినట్లు చెప్పింది సమాధానం.

'అమావాస్య తెల్లారి పుడితే ఏంటే గొప్పా? ఏదో పుడుతూ మణులు, మాణిక్యాలేవో తెచ్చిచ్చినట్లు, ఓ సంబరపడిపోతున్నావు?' అంటూ పార్వతమ్మను ఉడికించాడు రాఘవయ్య.

వాళ్లిద్దరికీ డెబ్బైలు దాటినా పనులు చేసుకోగలుగుతున్నారు. అలాగే ఒకరిపై ఒకరు చతుర్లాడటమూ మానుకోలేదు. వాళ్ల అన్యోన్యతను, కల్మషంలేని మనస్తత్వాలకి ఎంతో ముచ్చటపడిపోయింది అమృత.

'నీ కొడుకును ఎంతసేపు చూస్తావులేగానీ, ఆ వాకిలి ఊడ్చే పని పూర్తిచేయి. నేను పాలు తీయగానే కాస్త టీ పోద్దువు. నేను పొలం వెళ్లాలి. ఆనక తీరిగ్గా నువ్వూ నీ కొడుకు ఎదురుబదురూ కూర్చొని గంటలు గంటలు చూసుకుందురుగానీ!' అన్నాడు రాఘవయ్య.

'ఆ పనులన్నీ నే చేయకపోతే నువ్వు చేస్తావా? ఆళ్లిప్పుడే కదా వచ్చింది. కాసేపలా కూర్చున్నానో లేదో అన్నేసి మాటలు అనాలా?' అంటూ విసురుగా వెళ్లి చీపురుపట్టుకుని ఊడ్వడం మొదలుపెట్టింది పార్వతమ్మ.

'ఓసోసి ఇంతలోనే ఎంత కోపమే నీకు. ఏవైనా అరేయ్ మీ అమ్మ కోపంలో మహా అందంగా ఉంటుంది" అంటూ నవ్వాడు రాఘవయ్య.

పార్వతమ్మకు మాత్రం కోపం మరింత పెరిగి.. 'నీకు వయస్సు పెరుగుతోందిగానీ, బుద్ధి పెరగడంలేదు..' అంటూ మరింత విసురుగా ఊడుస్తూ అంది.

అందరూ పకపకా నవ్వారు.

కాసేపటికి పద్మ, రంగా కూడా లేచారు. అందరివీ టీలు, టిఫిన్‌లు అయ్యాక తీరిగ్గా కూర్చున్నారు.

◆◆◆

'ఏంటి పద్మా! ఈ సమయంలో హుషారుగా ఉండాల్సింది, అలా దిగులుగా ఉన్నావు? వంట్లో తేలిగ్గా లేదా?' అడిగింది ఉదయం నుండి పద్మనే గమనిస్తున్న అమృత.

'అదేం లేదు వదినా' అంటూ ముభావంగా ఉండి పోయింది పద్మ.

'ఏమీ లేకపోవడమేమిటి? ఈసారి అమ్మాయిని కనకపోతే పద్మను తీసికెళ్లను. అదే విషయం రాత్రి చెప్పా. ఇక అప్పటి నుండి అలా ఉన్నట్లుంది. మరి మళ్లీ అమ్మాయిని కంటే నా గతేం కావాలక్కా! ఇప్పటికే మాకో అమ్మాయి. మళ్లీ అమ్మాయిని తెచ్చి నెత్తిమీద పెడితే వాళ్లకు కట్నాలు ఎక్కడ నుంచి తేవాలి? నావల్ల కాదు. అయినా వంశాన్ని నిలబెట్టేవాడు ఒక్కడైనా ఉంటేనేగా పరువు, మర్యాద..గౌర..'ఇలా సాగిపోతోంది రంగా మాటల ధోరణి.

'అమ్మాయినో, అబ్బాయినో ఎవర్నో ఒకర్ని కంటుందిలే. అదేమన్నా ఆ అమ్మాయి చేతిలో ఉందా? ఆ పిల్లని కనేదాకా కాస్త ప్రశాంతంగా ఉండనీ రంగా!' కొంచెం గట్టిగానే రంగా మాటల్ని మధ్యలో అడ్డుకుంది పార్వతమ్మ.

అమృత కలగజేసుకుంటూ.. 'తమ్ముడూ! ఆడపిల్ల అయినా, మగపిల్లవాడైనా పుట్టడంలో ఆడవాళ్లు ఏమీ చేయలేరు. ఆ లింగ నిర్ధారణ మీవల్లే. మీలోనే అబ్బాయి, అమ్మాయికి సంబంధించిన క్రోమోజోములు ఉంటాయి. ఆడవాళ్లల్లో కేవలం అమ్మాయిలకు సంబంధించిన క్రోమోజోములే ఉంటాయి. మీలోని అబ్బాయి క్రోమోజోము కలిస్తేనే అబ్బాయి పుట్టేది. అమ్మాయి క్రోమోజోము కలిస్తే అమ్మాయి పుడుతుంది. అంటే

అబ్బాయైనా, అమ్మాయైనా మీ వల్లే" అంటూ వివరంగా బొమ్మలు గీసి మరీ వివరించింది.

అప్పటికి మౌనంగా విన్న రంగా 'అయితే ఈసారి అమ్మాయి పుడితే ఎవరికైనా ఇచ్చేస్తా!' అన్నాడు.

అది విన్న అందరూ మౌనంగా అయిపోయారు. పద్మ ఏడ్వడం మొదలుపెట్టింది.

ముందు పార్వతమ్మే తేరుకుని, 'ఇదిగో రంగా నీకు దండం పెడతా! అసలు ఎవరో ఒకర్ని ముందు పుట్టనీవయ్యా! ఈ లోపే నీ మాటలతో ఈ పిల్లని చంపేసేటట్లున్నావు' అంది.

'మొన్న మన గేదె కోడిదూడను ఈనిందా? ఆ కోడిదూడని లంకలో వదిలేయాలని నువ్వూ, మామయ్యా అనుకోవడం లేదు. ఇది కూడా అంతే. లాభం లేకుండా నష్టపోయేటట్టు ఉంటే అది పశువు అయితే ఏంటి, మనిషి అయితే ఏంటి?" అన్నాడు.

అంతే, రంగా మాటలకు అందరూ నిర్ఘాంత పోయారు. కాసేపు మౌనంగా ఉండిపోయారు. ఇక ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

◆◆◆

శ్రీనాథ్, అమృత సాయంత్రం శివమ్మ ఇంటికి వెళ్లారు. ఆ మాటా ఈ మాటా మాట్లాడాక ఉదయం జరిగిన సంభాషణ ప్రస్తావనకు తెచ్చింది అమృత.



'ఏమిటోనమ్మా! మా అమ్మ ముగ్గురు ఆడపిల్లల్ని కన్నది. మా నాన్నగానీ, అమ్మగానీ ఆడపిల్లలు బరువని ఏనాడూ అనలేదు. ఎంతమంది పిల్లలైతే అంత మంచిదనే ఆరోజు అనుకున్నారు. మా దగ్గరకు వచ్చేసరికి ఇద్దరు లేదా ముగ్గుర్ని కనడం వచ్చింది. అంతేగానీ ఆడపిల్లలా, మగపిల్లలా అనేది రాలేదు. ఇక మీ తరం వచ్చేసరికి ఇదిగో ఇలా అమ్మాయి వద్దంటే వద్దనే పరిస్థితికి వచ్చింది. ఇక ఈ రంగా నాలుగు ఆకులు ఎక్కువ నమిలినట్లున్నాడు. ఏకంగా ఆడపిల్ల పుడితే, ఎవరికో ఇచ్చేస్తానంటున్నాడు. అలా మన కడుపున పుట్టిన బిడ్డని వేరే ఎవరికో ఇవ్వడానికి మనసెట్టా ఒప్పుతుందో అర్థంకాడం లేదు. అసలు పద్మని ప్రసవించనీ, ఇప్పటినుండే ఈ మాటలన్నీ ఎందుకులే..' అంటూ శివమ్మ ఆ సంభాషణకు అక్కడితో తెర వేసేసింది.

రాత్రి పడుకుందన్న మాటేగానీ అమృతకు ఒక పట్టాన నిద్ర పట్టడం లేదు. పద్మ పరిస్థితి కూడా అంతే. వదినా, మరదళ్లు ఇద్దరూ పక్కపక్కనే నవ్వారు మంచంపై పడుకున్నారు. ఇంకో మంచం లేకపోవడంతో శ్రీనాథ్ చాపమీద బొంతేసుకుని కింద పడుకున్నాడు.

'రంగా అన్నాడని కాదుగానీ పద్మా! పశువు అయినా, మనిషి అయినా, ఆర్థికంగా లాభముంటేనేనా? అనిపిస్తుంది. నిజంగా మగపుట్టుక పుట్టడం దూడకు తెలియదు. నీకు పుట్టేది ఆడపిల్ల అయితే ఆ బిడ్డకు తెలియదు. పాపం! ఏమీ ఎరుగని ఆ దూడ అయినా, ఆడపిల్ల అయినా ఎంత ఘోరంగా నష్టపోతున్నట్లు. మానవుడు ఎంత దారుణంగా ఆలోచిస్తున్నాడు? మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అంటే ఏంటో అనుకున్నా. ఈ రోజు అది ఎంత నిజమో తెలిసొచ్చింది. అందుకే రేపు మామయ్యను బతిమిలాడి దూడను లంకకు తోలకుండా ఆపుదాం. నీకు ఆడపిల్ల పుట్టినా నిన్ను అక్కున చేర్చుకునేలా రంగాకు నేను బుద్ధి చెప్తాగా! ఇప్పటి నుండే బాధపడి ప్రయోజనం లేదు. ఏమైనా ఎప్పటికీ చెట్టుకు కాయ బరువు కాదు, ధైర్యంగా ఉండు. అన్నీ నేను చూసుకుంటాగా!' అంటూ పద్మ నుదురుపై చేయి వేసి, నిమిరింది అమృత.

అమృత ఇచ్చిన భరోసాతోనే ఏమో పద్మ నిద్రలోకి జారుకుంది. అమృత కూడా నిశ్చింతగా పడుకున్న పద్మ ముఖాన్నే చూస్తూ, కాసేపటికీ తనూ నిద్రపోయింది.

◆◆◆

తెల్లారింది... అందరూ పొద్దున్నే టీలు తాగుతూ కూర్చున్నారు. ముందు అమృతానే నోరు విప్పింది.

'మామయ్యా! ఆ దూడను లంకలో వదలొద్దు. మనమే పెంచుకుందాం.!' అంది.

'భలేదానివే అమ్మాయి. ఉన్నాటికే మేత తేలేక మీ మామయ్య చానా యాతన పడుతున్నాడు. దీన్ని మేపితే మనకొచ్చే లాభం ఏముంది?' అంది పార్వతమ్మ తనూ గ్లాసుతో టీ తెచ్చుకుంటూ.

'నేను చెప్పినా, మీ అత్తయ్య చెప్పినా అదే మాట అమ్మాయి. మీ అత్తయ్య చెప్పింది ఓసారి ఆలోచించు...' అంటూ లేచి, కండవా దులుపుకుని భుజాన వేసుకున్నాడు రాఘవయ్య.

'అదికాదు మామయ్యా! పద్మకు ఆడపిల్ల పుడితే ఎవరికైనా ఇచ్చేద్దామంటున్నాడు రంగా. మరి అదెలా కరెక్టుకాదో, ఇదీ కరెక్టు కాదని నా అభిప్రాయం. మీరే ఓసారి ఆలోచించండి!' అంది అమృత.

ఇదంతా మౌనంగా వింటున్నాడు రంగా.

మళ్లీ అమృతే మాట్లాడుతూ 'అయినా జంతువుల్లో మగపుట్టుక అయితే కబేళాకు పోవడం, మనుషుల్లో ఆడపుట్టుక అయితే గర్భంలోనో, పుట్టాకో వదిలించుకోవాలనుకోవడం విచిత్రంగా లేదు మామయ్యా!' అంటూ మామగారికి సైగ చేసింది.

'అంతే అమ్మాయి. ఇప్పుడు రంగా అయినా పశువుల్లో పుట్టుంటే కబేళాకు పోయేవాడే! అదేలే.. అది నేనైనా, మా నడిపోడైనా.. ఎవరైనా అంతేగా.!!' అన్నాడు అమృత మనసెరిగిన రాఘవయ్య.

## కవిత

# అనుకుంటే

**– డా॥సి. నారాయణరెడ్డి**

**కూ**చోవాలనుకుంటే
ఇలాగే కూచుంటాను.
మనసు కందిన సృష్టినంతటినీ
నాలో నింపుకుని
దాని చరాచర స్థితిని
అంచనా వేసుకుంటాను.
కూచోవడమంటే
అలసత్వమనుకోరాదు.
అది సమాలోచనలకు కూడలిగా వున్న
న్యాయస్థానం.

నడవాలనుకుంటే
నడిచిపోతుంటాను.
ఎక్కడికక్కడే
దూరాల ద్వారాలను తెరుచుకుంటూ
ఎదురైన విభిన్న దృశ్యాలను
ఎద తెర పైన పదిలపరుచుకుంటాను.

నడిచి పోవడమంటే
వాహ్యాళి అనుకోరాదు.
అది వినూత్న సమాచార సమీకరణకు
సమర్థవాహిక.

ఎగరాలనుకుంటే
ఎగిసిపోతుంటాను.
ఆకాశాన్ని అన్నివైపుల నుంచి
వీక్షిస్తూ సమీక్షిస్తూ
నీలిమలేవో ధవళిమలేవో
నిగ్గు తేలుస్తుంటాను.
ఎగిసిపోవడమంటే
తప్పించుకుపోవడం కాదు.
నేల అందుకోలేని నిజాలను శోధించే
సాధన గుణం.



కూచోవాలనుకున్నా
నడవాలనుకున్నా
ఎగరాలనుకున్నా
చైతన్య పార్శ్వాలన్నింటినీ
సంపుటీకరించుకున్న మేధ
నిరంతర చలనశీలి.

---

రాఘవయ్య అలా అంటుంటే ఒక్కసారి రంగాకు వీపుమీద చర్నాకోలుతో కొట్టినట్లైంది. మొహమంతా కందగడ్డల ఎర్రగా అయిపోయింది.

'అయినా ఇవాళా రేపూ ఆడపిల్లలేంటీ, మగపిల్లలేంటీ అందరూ బాగా చదువుతున్నారు. ఇంకా చెప్పాలంటే ఆడపిల్లలే ఒకడుగు ముందున్నారని చెప్పాలి' అని అమృత అనగానే, 'ఏంటో బావ ఒకటే బాధపడుతున్నాడుగానీ, ఆడపిల్ల ఉన్నోళ్లే అదృష్టవంతులు. అమ్మాయి మనదైతే మనల్ని కడుపులో పెట్టుకుంటుంది. అయినా ఆడపిల్లలు ఇప్పుడు దేంట్లో తక్కువ? ఆలోచించుకో బావ !' అన్నాడు అంతా గమనిస్తూ కూర్చున్న శ్రీనాథ్.

ఈ మాటలన్నింటితో ఆలోచనలోపడ్డాడు రంగా.

రాఘవయ్య కూడా ఒక నిర్ణయానికి వచ్చి తన ఆకు చెప్పులు తొడుక్కుంటూనే, ఊగులాడుతున్న సైకిల్ స్టాండ్ తీసి, 'పొలం వెళ్లస్తా. అమ్మాయి అమృతా! నువ్వో బాధపడబోమాకా. నువ్వు చెప్పినట్టే చేద్దాములే...!' అంటూ పొలం వెళ్లిపోయాడు రాఘవయ్య.

రాఘవయ్య మాటలు విన్న పద్మ ముఖం పద్మంలా వికసించింది.

'వదినా! నాన్న ఏమన్నాడో విన్నావా? నువ్వన్నట్లే దూడను ఇక్కడే ఉంచుతాడన్నమాట!' అంటూ అరిచినంత పనిచేసింది పద్మ.

'నాకు కూడా తెలిసొచ్చిందే పద్మా! మనకు ఆడపిల్ల పుట్టినా అది మన బిడ్డేనే!' అంటూ 'నేనేనా ఇంత ఘోరంగా ఆలోచించింది అనిపిస్తోందే!' అంటూ తలదించుకున్నాడు రంగా.

రంగ, పద్మ మాటలు విన్న అమృత సంతోషంతో పరుగున వచ్చి పార్వతమ్మను చుట్టేసి, పద్మ దగ్గర కూర్చొని, ఆమె చుట్టూ చేతులు వేసి, ఆమె నుదుటిపై ముద్దు పెట్టుకుంది.

'పద్మా! నే చెప్పలా నీకు అమ్మాయి పుట్టినా, రంగా నిన్ను అక్కున చేర్చుకుంటాడనీ, ఇప్పటికే మన దేశంలో ఆడపిల్లల సంఖ్య తగ్గిపోయింది. ముమ్ముందు అమ్మాయిలదే హవా! నువ్వేం దిగులు పడకు. మన కుటుంబంలో మన ఇంటి నుండే ఇలాంటి మంచిపనులకు అంకురార్పణ జరుగుతోంది. ఎంత ఆనందంగా ఉందో!' అంటూ శ్రీనాథ్ చెంతకు చేరి అతని చేతిని చుట్టుకుని కూర్చొంది అమృత.

ఆమె పరవశాన్ని చూసిన శ్రీనాథ్ ఆమె వీపు చుట్టూ చేతులేసి దగ్గరకు తీసుకుంటూ 'నువ్వు నిజంగా అసాధ్యురాలివే' అమృతను ఉద్దేశిస్తూ అన్నాడు.

'నేను అసాధ్యురాలినే కాదు.. సుసాధ్యురాలిని!' అంటూ అమృత దిగ్గున శ్రీనాథ్ పక్క నుండి లేచి, నాటకపక్కీలో చేతులు పిడికిలి బిగించి, కిందికి పెట్టి అడుగులేస్తూ అంటుంటే, అందరూ ఫక్కున నవ్వారు.



# మహనీయ మార్గదర్శి

తెలకపల్లి రవి

***దేశం అంటే నదులూ కొండలూ పర్వతాలూ, రాజులూ చక్రవర్తులూ కాదు. దేశమంటే మనుషులన్నాడు. తిండి కలిగితే కండ కలదోయ్, కండ కలవాడేను మనిషోయ్ అని ఆ మనుషులెలా వుండాలో కూడా విశదపర్చాడు. 'మనిషి చేసిన రాతి బొమ్మకు మహిమ కలదని సాగి మొక్కుతు మనుషులంటే రాయి రప్పల కన్నా కనిష్టంగా చూస్తావేల ' అని ప్రశ్నించాడు.***

తెలుగు సాహిత్యంలో నూతన యుగావిర్భావాన్ని సూచించే వేగుచుక్క గురజాడ అప్పారావు. విజయనగరం జిల్లా రాయవరంలో 1862 సెప్టెంబరు 21న గురజాడ వెంకట రామదాసు, కౌసల్యమ్మల సంతానంగా పుట్టిన ఈ పంథొమ్మిదో శతాబ్దపు వ్యక్తి ఇరవై ఒకటో శతాబ్దంలోనూ సజీవ స్ఫూర్తిగా ప్రకాశిస్తున్నాడంటే ఆయన పురోగామి దృక్పథం ప్రజాస్వామిక లక్షణాలు కారణం.

పెరిగి విరిగితి/విరిగి పెరిగితి/కష్టసుఖముల/సారమెరిగితి/.....కొత్తమిన్కుల/తెలివిపటిమను/మంచి చెడ్డల/మార్చితిన్! అని చెప్పుకున్న గురజాడ సమాజంలో తరతరాలుగా వేళ్లుతన్నిన మూఢత్వాన్ని, మిథ్యా విలువలను చీల్చిచెండాడాడు. సనాతన కుటుంబంలో పుట్టినా మానవతా చైతన్యాన్ని ప్రబోధించాడు. తండ్రి వారసత్వంగా ఆనందగజపతి రాజుగారి కొలువు చేసినా రాజభక్తిని మించిన దేశభక్తిని చాటి చెప్పాడు.

దేశం అంటే నదులూ కొండలూ పర్వతాలూ, రాజులూ చక్రవర్తులూ కాదు. దేశమంటే మనుషులన్నాడు. తిండి కలిగితే కండ కలదోయ్, కండ కలవాడేను మనిషోయ్ అని ఆ మనుషులెలా వుండాలో కూడా విశదపర్చాడు. 'మనిషి చేసిన రాతి బొమ్మకు మహిమ కలదని సాగి మొక్కుతు మనుషులంటే రాయి రప్పల కన్నా కనిష్టంగా చూస్తావేల ' అని ప్రశ్నించాడు.

ఒక వైపున వలస దేశాలను కొల్లగొట్టడమే కాక మరోవైపున వాటికి నాగరికత నేర్పడం తమ తెల్లవాళ్ళపై పడిన భారమని గొప్పలుపోయిన బ్రిటిష్ పాలకులకు నిరసనగా మాకూ చరిత్ర వుందని చెప్పే క్రమంలో కొంతమంది జాతీయ వాదులలో వెనక్కు చూసే తత్వం ప్రబలింది. కాని గురజాడ 'వెనకచూసిన కార్యమేమోయ్, మంచి గతమున కొంచెమేనోయ్' అనగలిగినవాడు. 'కొత్త పాతల మేలు కలయిక' కావాలని చెప్పగలిగినవాడు. జాతీయోద్యమం అస్పృశ్యతా నివారణను చేపట్టకముందే గురజాడ కుల వివక్షపై నిప్పులు చెరిగాడు. 'మంచి చెడ్డలు ఎంచి చూడగ మనుజులందున రెండె కులములు, మంచి యన్నది మాలయైతే మాలనే అగుదున్' అని ప్రకటించాడు. మరోచోట 'మలిన దేహులు మాలలనుచును, మలిన చిత్తుల కధిక కులముల, నెల నొసంగిన వర్ణ ధర్మమ, ధర్మ ధర్మంబే' అని అసమానతల కుల వ్యవస్థను, నిర్ద్వంద్వంగా తిరస్కరించాడు.

ఆయన కన్యాశుల్కం నాటకం ఒక సామాజిక విప్లవం అనాలి. నూటముప్పయేళ్ల తర్వాతా ఈ నాటకం సజీవంగా వుందంటే అందుకు రచనా శిల్పం మాత్రమే కారణం కాదు – సామాజిక సారాంశం కూడా. నాయికా నాయకులంటే కులీన వర్గాలకు, పై కులాలకే చెంది వుండాలనే సూత్రాలన్నిటినీ ధ్వంసం చేసి వేశ్యాకులంలోని మధురవాణి ద్వారా ఆచార పరాయణులమనేవారి బూటకత్వాన్ని ఎండగట్టారు. మరోవైపు ఉన్నత కులం నుంచే వచ్చిన గిరీశంను అవలక్షణాల పుట్టగా మోసపూరితమవుతున్న సామాజిక దృశ్యానికి సంకేతంగా ప్రాణ ప్రతిష్ట చేశాడు. ఆధునిక స్త్రీ కొత్త చరిత్ర సృష్టిస్తుంది అన్న గురజాడ అగ్నిహోత్రావధాన్ల భార్య వెంకమ్మ వంటి సనాతన పాత్రలతో కూడా తిరుగుబాటు మాటలనిపించడం చూస్తాం. బాల వితంతువు బుచ్చమ్మ తన చెల్లెలి పెళ్ళికోసమే గిరీశంతో వెళ్ళిపోవడానికి సిద్ధమవడంలోనూ సాహసం, త్యాగం చూస్తాం. పూటకూళ్ళమ్మ చీపురుతో బాదినా, మీనాక్షి శాపనార్థాలు పెట్టినా అన్నిటా స్త్రీ నిరసన తొలి సంకేతాలు అగుపిస్తాయి.

ఆయనకు ముందు తెలుగు సాహిత్యంలో దాదాపుగా

అప్సరసలు, పతివ్రతలు మాత్రమే వున్నారు. గురజాడ మొదటిసారిగా రక్తమాంసాలున్న స్త్రీలను ప్రవేశపెట్టాడు. భర్త పాదసేవ తప్ప భార్యకు మరో స్థానం లేదన్న మాటలను తోసిపుచ్చుతూ 'మగడు వేల్పన పాత మాటది, ప్రాణమిత్రుడ నీకు' అని భార్యకు చెప్పే భర్తను సృష్టించాడు. స్త్రీ పురుషుల మధ్య పరిణితమైన ప్రేమ భావనను తొలిగా అక్షరీకరించింది గురజాడే. మాయ మర్మము లేని నేస్తము మగువలకు మగవారికొక్కటే అని సమధర్మం చెప్పాడు.

అన్నీ వేదాల్లో వున్నాయష అనే అగ్నిహోతావధాన్లు విశ్వ విద్యాలయాల్లో జ్యోతిష్య పాఠాలు ప్రవేశపెట్టే నేటి పాలకులకు పూర్వ రూపమే. పుస్తకములలోని మాటలు/ విస్తరించుచు ననుభవమ్ముల/తత్వమెరుగక, శుకములగుదురు వట్టి శాస్త్రజ్ఞుల్' అని ఆయన చేసిన విమర్శ ఉపగ్రహ నమూనాలను దైవ సన్నిధిలో వుంచి ప్రార్థించే ఇస్రో నిపుణులకు మహబాగా వర్తిస్తుంది.ఇలాటి దేశంలో వందేళ్లకు పూర్వమే' అంత సాహసోపేతమైన భావాలు వినిపించడంలో గురజాడ ఔన్నత్యం కనిపిస్తుంది. గ్రహణాలు తోక చుక్కలు అంటే ఇప్పటికీ తలుపులు బిడాయించుకునే చోట- తోక చుక్కను ఆయన సంఘ సంస్కరణ పతాకగా తలచాడు.

***భర్త పాదసేవ తప్ప భార్యకు మరో స్థానం లేదన్న మాటలను తోసిపుచ్చుతూ 'మగడు వేల్పన పాత మాటది, ప్రాణమిత్రుడ నీకు' అని భార్యకు చెప్పే భర్తను సృష్టించాడు. స్త్రీ పురుషుల మధ్య పరిణితమైన ప్రేమ భావనను తొలిగా అక్షరీకరించింది గురజాడే.***

1892లో కన్యాశుల్కం తొలి కూర్పు వెలువరించిన గురజాడ అప్పారావు 1910లో ముత్యాల సరాలు సృజించడం ద్వారా కవిత్వం వైపు మరలడం, పద్యాల నుంచి సూత్రబద్ధ ఛందస్సుల వైపు మొగ్గడం సామాజిక దృష్టి ఫలితమే. రాజకీయాలలో కోరుకునే ప్రజాస్వామ్యం భాషా సాహిత్యాలలోనూ రావాలని ఆయన ఆకాంక్ష.

గురజాడ మానవతా దృష్టి, ఇతివృత్త చిత్రణ తారాస్థాయికి చేరిన రచన 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ'.

'కన్నుల కాంతులు/ కలువల చేరెను/మేలిమి చేరెను/మేనిపసల్/ నడకల బెళుగులు/హంసల చేరెను/దుర్గను చేరెను/పూర్ణమ్మ' అంటూ కరుణరసాత్మకమైన ముగింపు నివ్వడంలో శిల్పం, విషయం కూడా హృదయాలను తాకుతాయి. దుర్గను అంత భక్తిగా కొలచిన పూర్ణమ్మ చివరకు ఆమెనే చేరిందని రాయడంలో వున్న ధిక్కారం దాచినా దాగదు. లవణరాజు కల, దమను పితియసు,కాసులు వంటి గేయాలన్నీ సార్థక సందేశాలే.దించు లంగరు, లంగరెత్తుము వంటివి ఆయన వ్యక్తిగత భావనలను కూడా ప్రతిబింబిస్తాయి.

తెలుగు కథ కు ఆద్యుడనదగిన గురజాడ అప్పారావు కథలన్ని సామాజిక సమస్యలను స్పృశించినవే. ఇప్పుడు తీవ్రంగా వినిపించే చాలా అంశాలు ఆయన నాడే ప్రస్తావించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. దిద్దుబాటు కథలో వేశ్యాలోలుడైన భర్త కళ్ళు తెరిపించడం సుమతీ సావిత్రి కథలు చదివిన దేశానికి కొత్త అనుభవమే. మనుషుల్లారా మీ పేరేమిటి, పెద్ద మసీదు కథలలో మూఢాచారాలను, మతపరమైన విద్వేషాలను, ఆధిపత్యాలను ,అనివార్యమైన సహజీవనాన్ని చిత్రించారు. హిందూ ముస్లిం నినాదాలు కూడా చిత్రించిన తీరులో ఆయన నేటి భారతాన్ని ప్రత్యక్షంగా చూశాడా అనేంత సందేహం కలుగుతుంది. అన్నదమ్ముల వలెను జాతులు మతములన్నియు మెలగాలని కవితలో చెప్పిన గురజాడ ఈ కథలలోనూ ప్రత్యక్షమవుతాడు.

ఇక వ్యవహారిక భాషోద్యమంలో గిడుగుకు తోడునీడగా చేసిన సేవ తెలుగు జాతి మరచిపోకూడనిది. "తెలుగు సాహిత్యాన్ని సంకెళ్ళు వేసి కడుపు మాడ్చడమా లేక దానికి జవసత్వాలిచ్చి దాన్ని ఒక గొప్ప నాగరిక శక్తిగా చేయడమా అనేది మనపై ఆధారపడి వుంది" అని ఆయన **అసమ్మతి పత్రం** లో హెచ్చరించారు.

చదువులు పై వర్గాలకే పరిమితమైనప్పుడు అర్థం కాని సంస్కృతంలో బోధించినా చెల్లిందని, ఇప్పుడు అత్యధికజనం చదువుకోవాలంటే మాత్రం వారికి తెలిసిన భాషలో చెప్పాలని గురజాడ అంటారు. సామాజిక దొంతరలను స్పష్టంగా చెబుతూ అగ్రవర్ణ బ్రాహ్మణులకు మాత్రమే పరిమితమైన దశ దాటిపోయాక అప్పటి సంస్కృత ప్రధానమైన భాషా శాస్త్ర నియమాలను పట్టుకుని కూచోవడం వల్ల ఫలమేమిటని ప్రశ్నిస్తాడు. నిత్య జీవితంలో మాట్లాడుకునే భాషకు దగ్గరగా వుంటేనే జ్ఞాన సముపార్జన సులభతరమవుతుందని నిరూపిస్తాడు.

వాస్తవానికి గురజాడ స్వతహాగా సంప్రదాయక శైలిలో పద్యాలు రాసి మెప్పించిన వాడు. ఆయన రచనలలో ఇంగ్లీషులో రాసినవే ఎక్కువ. వీటిని ఇంగ్లీషు పత్రికలలో విమర్శకులు బాగా అభినందించారు కూడా. ఆ విధంగా ఆంగ్లంలోనూ, సంప్రదాయ సాహిత్యంలోనూ మంచి పట్టున్నా ఆ రెంటినీ వదలి ప్రజల భాష వైపు రావడానికి కారణం ఆయన ప్రజాస్వామిక దృష్టి, శాస్త్రీయ అవగాహనలే. ఆయన విస్తారంగా చదివాడు. రవీంద్రనాథ టాగోరుతో సహా బెంగాలీ పునర్వికాస పురుషులతో అయనకు సంబంధం వుంది.

గురజాడ ఎంతటి భావుకుడైనా అంతే వాస్తవిక వాది కూడా. దేశం అభివృద్ధి చెందాలంటే ఏం చేయాలో ఆయనకు బాగా తెలుసు. అప్పుడప్పుడే ఉద్భవిస్తున్న పెట్టుబడిదారీ సమాజ స్వభావాన్ని ప్రతిబింబిస్తూ 'అన్ని దేశాల్ క్రమ్మవలెనోయ్ దేశి సరుకులు నమ్మవలెనోయ్' అంటూ దేశీయ ఉత్పత్తి పెరగాలని చెబుతారు.. అవసరం లేని వాటికి కూడా విదేశీ సరుకుల కోసం, పెట్టుబడుల కోసం ఎగబడటం చూస్తుంటే గురజాడ సందేశం కొత్త అర్థం సంతరించుకుంటుంది.

ఇంతకూ ఆయన రచనలకే పరిమితమైన మనిషి కాదు. గొప్ప వ్యవహార దక్షుడు. విజయనగరం రాజు ఆస్థానంలో పత్రికలు చదివి వినిపించేవాడు. గజపతి, తర్వాత రేవారాణి హయాంలో లీగల్

వ్యవహారాలు చూసేవాడు. పుట్టుకతోనే అనారోగ్యం పాలైన గురజాడకు ఎప్పుడూ ఉబ్బసం వ్యాధి వెంటాడింది. జీవితమంతా అనేక ప్రతికూల పరిస్థితుల మధ్య పెనుగులాడుతూ, అభివృద్ధి నిరోధకుల దాడులను తట్టుకుంటూ ఎదుర్కొంటూ సాహిత్య రచనలోనూ, సామాజిక చింతనలోనూ వైతాళిక పాత్ర పోషించారు. అనారోగ్యానికి తోడు ఈ కార్య భారాల వల్ల చిన్న వయస్సులోనే 1915 నవంబరు 30న కన్నుమూశారు. ఆయన డైరీలు లేఖలు వంటివి చూస్తే విస్తారమైన సామాజిక పరిశీలనాంశాలు, రచనా ప్రణాళికలు కనిపిస్తాయి. బిల్హణీయము అన్న నాటకం అర్థంతరంగానే ముగించారు.

ఆయన తర్వాత కాలంలో వెనువెంటనే జాతీయోద్యమ కవిత్వం వచ్చినా ఆపైన భావ కవిత్వంపై చేయి సాధించింది. ప్రజాకవులు, మరీ ముఖ్యంగా మహాకవి శ్రీశ్రీ రంగం మీదకు వచ్చిన తర్వాత కొన్నాళ్ళకు గురజాడ వారసత్వానికి సముచితమైన కొనసాగింపు లభించింది. తెలుగు జాతి సాంస్కృతిక పునర్వికాసంలో కందుకూరి వీరేశలింగం, గురజాడ, గిడుగుల మహత్తర సేవను గుర్తించిన కమ్యూనిస్టులు వారికి సంబంధిచిన రచనలను డైరీలు వగైరాలను బయిటకు తీసి ప్రచురించి ప్రాచుర్యంలోకి తెచ్చారు. ఇది సహించలేని వారు కామ్రేడ్ గురజాడ అని ఎగతాళి చేస్తూ ఒక విధంగా మరణానంతరం కూడా ఆయనపై దాడి చేశారు. ఆ ప్రచారాలన్ని పటాపంచలు కాకతప్పలేదు. ఈ సంస్కర్తలు స్వాతంత్ర్య పోరాటం పట్ల అనుసరించిన వైఖరిపై సందేహాలకు కూడా చారిత్రిక నేపథ్యంలో సమాధానం లభించింది. అప్పటి వరకూ వున్న ఛాందసాలనుంచి బయిటపడాలన్న భావనే ఈ సంస్కర్తలపై ప్రధానంగా ప్రభావం చూపింది. అప్పటికి కాంగ్రెస్ ఇంకా రాజుగారికి మహజర్లు సమర్పించే స్థితిలో వుండటంతో గురజాడ 'పాడకోయి కవీ కాంగ్రెస్ వట్టి భజన సమాజం మాత్రమేనని' అని హాస్యంగా రాశారు. ప్రతినిధులంతా నిద్రపోవడాన్ని ప్రస్తావించడం చూస్తే ఇప్పుడు కనిపించే ఫోటోలు గుర్తుకు వస్తాయి! అప్పటికింకా గాంధీజీ ప్రధాన పాత్రలోకి రాలేదు, అక్టోబరు విప్లవం కూడా జరగలేదు. ఈ పరిమితులలోనే వారిని అర్థం చేసుకోవాలి. ఎవరిలోనైనా ఏ కాలంలోనైనా రాజకీయ చైతన్యం సామాజిక చైతన్యం ఏక కాలంలో ఒకే స్థాయిలో వుండకపోవచ్చు. ప్రధానంగా సమాజ గమనానికి వారు అందించిన దోహదం ఏమిటన్నదే చూడాల్సిన అంశం. అభ్యుదయ వాదులు చేసింది అదే.

***దేశమంటే మనుషులోయి అనిగాక మార్కెట్లోయి అని చెప్పే ప్రపంచీకరణ దాడులూ, కుల మతాల ప్రాతిపదికన మంటలు పెట్టే కుటిలత్వం, అనుచితమైన ఆంగ్ల వ్యామోహంతో ప్రజల భాషకు ఎసరు పెట్టే సాంస్కృతిక తాకిడీ పెరిగే కొద్ది ఆయన సందేశం మరింత అవసరమవుతున్నది.***

దేశమంటే మనుషులోయి అనిగాక మార్కెట్లోయి అని చెప్పే ప్రపంచీకరణ దాడులూ, కుల మతాల ప్రాతిపదికన మంటలు పెట్టే కుటిలత్వం, అనుచితమైన ఆంగ్ల వ్యామోహంతో ప్రజల భాషకు ఎసరు పెట్టే సాంస్కృతిక తాకిడీ పెరిగే కొద్ది ఆయన సందేశం మరింత అవసరమవుతున్నది. కన్యాశుల్కం పోయి వరకట్నం వచ్చి, తగ్గిన మహిళా నిష్పత్తి వల్ల కొన్ని చోట్ల మళ్లీ ఆ శుల్కం ప్రత్యక్షమవుతూ అన్ని విధాల బలిగొంటున్న స్థితిలో, విశృంఖల ధోరణులు సైబర్ సెక్స్ స్థాయికి చేరిన దశలో స్త్రీ విముక్తికి అంకితమైన గురజాడ వాణి మరింత బలంగా వినిపించాల్సి వుంటుంది. తెలుగు రాష్ట్రాలు రెండైనప్పటికీ గురజాడ అందరివాడుగానే వుంటాడు. ఎందుకంటే ఆయన స్థానిక భాషకు యాసకూ పట్టం కట్టాలన్నాడు. వ్యవహారిక భాష రూపాన్ని నిర్ణయించేప్పుడు తనున్న చోట మాట్లాడే తీరును తీసుకోవడం గాక ప్రామాణికంగా ఉపయోగపడుతుందని భావించినదాన్ని తీసుకున్నాడు. ఇప్పటి పరిణామాల నేపథ్యంలో గురజాడను చూడవలసిన అవసరం లేదు. అలాగే సామాజిక న్యాయభావన పూర్తిగా వంటపట్టించుకున్నాడు గనకే సనాతన ఛాందసాలను ఏకిపారేయగలిగాడు.

ఇప్పటి వరకూ మనం మహనీయుల శతజయంతులు చేస్తూ వస్తున్నాం. తెలుగు జాతి తొలి వైతాళికుల్లో ఒకరైన గురజాడ శతవర్ధంతి ఇప్పుడు ముందుకొచ్చింది. మరో నాలుగేళ్లకు కందుకూరి వీరేశలింగం ఆయన తర్వాత నాలుగేళ్లకు మరణించారు. ఇది తెలుగులో ఆధునిక భావ చైతన్య వ్యాప్తిని ప్రతిబింబించే పరిణామం. ప్రస్తుత నేపథ్యంలో దీనికి చాలా ప్రాధాన్యత వుందని గుర్తించడం అవసరం. సమైక్య రాష్ట్రం వుండగా గురజాడ నూటయాభయ్యవ జయంతి సందర్భంలో ఆలస్యంగా మేల్కొన్న సర్కారు ఆఖరులో హడావుడి పడింది. వాస్తవానికి ఈ వందేళ్లలోనూ గురజాడ సందేశాన్ని విస్తృతంగా జనంలోకి తీసుకుపోయి వుంటే ఇప్పుడు మనం చూస్తున్న అనేక దుష్పరిణామాలను మూఢత్వాలను ప్రతిఘటించే చైతన్యం మరికొంత అధికంగా వుండేదేమో. పునర్మూల్యాంకనాలు తప్పని సరి కాని ఏ కొలబద్దలతో చూసినా గురజాడ వెలుగుజాడగానే వుంటాడు. భాషకే గాక భావాలకూ సాహిత్యానికే గాక సమాజానికి కూడా ఆయన మార్గదర్శకుడు.

అడుగు జాడ గురజాడదె/అది భావికి బాట/మనలో వెధవాయిత్వం/మరిపించే పాట అన్న శ్రీశ్రీ చరణాలు ఇప్పటికీ అక్షర సత్యాలు. ఆయనకిదే నూటయాభై ఏళ్ల నివాళి. ఈ ఏడాది పొడుగునా సాహితీ స్రవంతి ఆయన సందేశం మూలమూలకూ తీసుకుపోవడానికి విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని భావిస్తున్నది. ఇందుకు సాహితీ మిత్రుల సహాయ సహకారాలు భాగస్వామ్యం కోరుతున్నది.

# పాపనవ్వు

- డా॥ ఎన్.గోపి



ఆమె భుజమ్మీద పసిపాప
నన్ను చూసి నవ్వింది
గాలి కాన్వాసు మీద
కాంతి చిత్రాలు వెల్లివిరిశాయి.

నా జేబులోంచి పెన్ను లాక్కొని
దాని డిజైన్‌ని పరిశీలిస్తుంది
పెన్నును అటూ ఇటూ ఊపుతుంది
నేను రాస్తున్న కవితలను
కొట్టి పారేస్తుందేమో!

ఆ ఊ అంటూ
ఎవరితో మాట్లాడుతుందో గాని
ఆ వ్యాకరణం
వాళ్ళమ్మకు మాత్రమే తెలుస్తుంది.

అంతేకాదు
అమ్మకు వేళలు కూడా తెలుసు
ఆటల తర్వాత నిద్ర
నిద్రకు ముందు దానితో యుద్ధం
ఓడిపోతున్నప్పుడు ఏడుపు
కొంతసేపటికి సముద్రం
ప్రశాంత ముద్ర వహిస్తుంది.
ఉలిక్కిపడుతున్నప్పుడు
భూనభోంతరాలు
కాస్త కలవరపడతాయి
అంతే!
మెలుకువొచ్చినంక
మళ్ళీ గుండ్రని అలలాగ
అదే బంగారు నవ్వు!
జీవితమంతా ముడుపు కట్టినా
దాన్ని కొనుక్కోలేము.

ఆ నవ్వు
ఇప్పటికీ నన్ను వెంటాడుతుంది
పుస్తకం పుటల్లోంచి
నెమిలీకను తీసినట్లు
నేనా నవ్వును అప్పుడప్పుడు
తలుచుకుంటూ వుంటాను.
నేనే కాదు
ఆ నవ్వు కోసం పాప కూడా
ముందు ముందు వెతుక్కుంటుందేమో!

# నాకు దక్కనిది

- డాక్టర్ దేవరాజు మహారాజు
9908633949

కాలేజీలో చదువుకునే రోజుల్లో భావుకుణ్ణి
కొంచెం కవిని, కొంచెం నాయకుణ్ణి, కొంచెం కళా ప్రేమికుణ్ణి
వర్షంలో చినుకు, చినుకుకూ మధ్య నిలబడి
నేల సుగంధం ఆఘ్రాణించిన వాణ్ణి
పువ్వుల రంగుల మధ్య పడుకుని కలలు కన్నవాణ్ణి
చేతులు చాచి పైకి చూస్తూ
నీలాకాశమే నా హృదయమనుకున్న వాణ్ణి
నింగి నేలా కలిసిన చోటే నా విజయమనుకున్న
వాణ్ణి
పుస్తకాలు వదిలి, బతుకు చదువులోకి వచ్చే సరికి
కఠిన వాస్తవాలు కంకర రాళ్ళయి గుచ్చుకున్నాయి
బతుకుపోరులో లారీలు, తూటాలు
జెండాలు, ఎజెండాలు, ఎర్ర నేస్తాలు, పచ్చ
దోస్తులు
కలగా పులగంగా జీవితమే సంక్లిష్టమైపోయింది!
సుళువుగా బతికే మార్గమే లేదా అని తల్లడిల్లాను
నవయవ్వనపు జ్ఞాపకాలు మెత్తని కత్తులై
అప్పుడప్పుడు గుచ్చిపోతూ ఉంటే
'ఛీ ! ఇదేం బతుకు?
ఈ నరకాన్ని ఇక ముగించేస్తే పోదా?'- అనుకున్నాను
అప్పుడు దొరికిందో కేసు
ఆ తరువాత ఇక బతుకే రన్నింగ్ రేసు
ఇప్పుడు డబ్బుకు, స్థాయికి కొదువ లేదు
పెద్ద పెద్ద వాళ్ళే నా చుట్టూ తిరుగుతున్నారు
నా స్కార్పియోను చూస్తేనే సామాన్యులు హడలి ఛస్తున్నారు.
తెల్లబట్టల్లో వినయంగానే ఉంటాను అయినా ఎందుకో



మంటల సెగకు పక్కకు తొలగినట్టు
జనం జరిగిపోతున్నారు
వాళ్ళు నన్ను చాటుకు గుండా, రౌడి అని
పిలుచుకుంటారట.
నేనిప్పుడు చేసేది సెటిల్ మెంట్లు, రియల్
ఎస్టేట్ వ్యాపారం, మాఫియా...
ఇలా కావాలని నే నే నాడూ అనుకోలేదు
కావాలని ప్రయత్నించనూ లేదు.. అయినా
అయిపోయింది
జీవితం నన్నిక్కడికి ఈడ్చుకొచ్చింది... ఈ గద్ద
మీద నిలబెట్టింది.
నేను చేసిందల్లా ఒక్కటే
ప్రవాహంలో పడి 'తెలివి' గా కొట్టుకు రావడం
ప్రవాహంలో ఎదురీదిన వాడికి ఏదీ మిగలదు
విలువ తప్పు!
నా బాధ అదే! నాకు దక్కనిదీ అదొక్కటే!!
ఎందుకో తెలియదు వాడి ముందు
నేను నానాటికీ దిగదుడుపే?
అదే విచిత్రం - వాడెప్పుడు కొండ శిఖరాగ్రానికి చేరాడో
ఎలా అజేయంగా నిలబడగలిగాడో... తెలియదు.

నివాళి


పైడి తెరేష్‌బాబు

# అక్షరాల్ని ఆయుధాలుగా ప్రయోగించిన దార్శనికుడు

డా॥జి.వి. రత్నాకర్
9849303175

*తెరేష్‌బాబు రచనలు, రచనా వ్యాసంగంలోని తపన అంతా హక్కులకు దూరమైన తన అణగారిన సమాజపు ఆక్రోశం, సమాజ జనజీవన స్రవంతికి దూరమైన బడుగు బలహీనవర్గాల వేదనతో నిండి ఉంటుంది. ఆయన కవితా శీర్షికలే చాలా భిన్నంగా వక్రోక్తితో విరోధాబాసతో నిండి ఉంటాయి. అవి దుర్భర సుఖం, నూరవ గొర్రె, చెవిటి పెద్దమనుషులకు శంఖం. కుక్క కరిచిన వార్త. చెంపలులేని మహాత్ముడు ఛాగ్గుడిస్తే ఛీ, అణచే చేతిని నరికే ఆయుధం, ములుకు తాళ్ళ చర్నాకోల, బేత్రాయి సామిదేవుడు, ఒంటిచేతి చప్పట్లు, బండి చక్రంమీద ఈగ, మట్టిబలపం, నరం మీద పుండు అనబడు ఒక దేబిరింపు, ఇచట ఉచితముగా డొక్క చీల్చబడును, నిశాని, వాడు తిట్టొద్దంటున్నాడు. మిగతావేళ్ళకు చిటికెన వేలు వ్రాయునది ఇలాంటి విభిన్నమైన శైలితో ఉంటాయి.*

సముద్రమంత విషాదాన్ని అక్షరాల్లో నింపి 'శర సంధానం' చేస్తూ హిందూ మహా సముద్రంలో 'అల్పపీడనం' సృష్టించి మూడో ప్రపంచ దేశాలకి "నాలుగో ప్రపంచాన్ని" చూపించిన స్వాప్నికుడు. వింతలమారి ప్రపంచంతో అసలు ప్రపంచపు నిజాల్ని నగ్నంగా నడిబజార్లో నిలబెట్టిన తిరుగుబాటు కవి పైడి తెరేష్‌బాబు.

ఏ దేశ సంస్కృతి లేక నాగరికతల అభివృద్ధి అయినా తరాల ఆదేశ ప్రజల సామూహిక ప్రయత్నాలు – వాళ్ళ ఆలోచనా స్థాయిని బట్టే నిర్మితమవుతుంది. ఆ ప్రజల ఆలోచనల పర్యవసానంగా సాహిత్యం ఒక ప్రవాహంగా మొదలై ఆ జాతి జనుల అభివృద్ధిని, ఉద్దేశ్యాలని ప్రతిబింబిస్తుంది.

ఈ దేశ మూలవాసీలు అయిన అంటరాని ప్రజల గుండె గొంతుకతో కవి పైడి తెరేష్ బాబు తన అల్పపీడనం (1996) కవితా సంపుటిలో ఒకచోట "అసలీ నేల మీద నీ ఆధిపత్యం ఏంటని ఎవళ్ళైనా ప్రశ్నిస్తే – ఈ దేశాన్ని మోస్తున్న మట్టి పొరల కింద పాతిపెట్టబడిన నా కోటానుకోట్ల సంతకాలను నిద్రలేపుతాను" అంటారు.

ప్రముఖ రచయిత దర్శకుడు సాహిత్యకారుడు కవి పైడి తెరేష్‌బాబు నాగరికత, సంస్కృతిల మానవీయ ఆకాంక్షల్ని నిలువెల్లా పులుముకున్న వ్యక్తి. ఒంగోలు గద్దల గుంట పాలెపు మట్టి వాసనల్ని హైదరాబాదు నడిగడ్డన తెలంగాణా ఉద్యమ బాటలు ఆడియో, వీడియోల శబ్ద, దృశ్య కావ్యాలతో ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం సాక్షిగా ప్రపంచ వ్యాప్తంగా వెదజల్లిన వ్యక్తి. కొత్త గూడెం రేడియోకేంద్రం నుండి గోదురా కిన్నెర అనే రేడియో రూపకంతో దేశమంతటా నగారా వినిపించిన దార్శనికుడు.

తెరేష్‌బాబు రచనలు, రచనా వ్యాసంగంలోని తపన అంతా హక్కులకు దూరమైన తన అంటరాని సమాజపు ఆక్రోశం, సమాజ జనజీవన స్రవంతికి దూరమైన బడుగు బలహీనవర్గాల వేదనతో నిండి ఉంటుంది. ఆయన కవితా శీర్షికలే చాలా భిన్నంగా వక్రోక్తతో విరోధాబాసతో నిండి ఉంటాయి. అవి దుర్భర సుఖం, నూరవ గొర్రె, చెవిటి పెద్దమనుషులకు శంఖం. కుక్క కరిచిన వార్త. చెంపలులేని మహాత్ముదు ఛాగ్గుడిస్తే ఛీ, అణచే చేతిని నరికే ఆయుధం, ములుకు తాళ్ళ చర్మాకోల, బేత్రాయి సామిదేవుడు, ఒంటిచేతి చప్పట్లు, బండి చక్రమీద ఈగ,

మట్టిబలపం, నరం మీద పుండు అనబడు ఒక దేబిరింపు, ఇచట ఉచితముగా డొక్క చీల్చబడును, నిశాని, వాడు తిట్టొద్దంటున్నాడు. మిగతావేళ్ళకు చిటికెన వేలు వ్రాయునది ఇలాంటి విభిన్నమైన శైలితో ఉంటాయి.




ఆయన ఒకచోట అల్పపీడనం కవితలో

"కల్లుముంతలకీ, కావిడిబద్దలకీ, గానుగెద్దులకీ

చెమట కాలువలకీ, చింపిరి చర్మాలకీ

కత్తులకీ, ఆరెలకీ, ఫసికల్లకీ, ఆనెలకీ అరెరెరెరే...

"బాంచన్దొరా నీ కాల్మొక్తాలకి ఎంత ఒళ్ళు బలిసింది!

ఎంత గడి మీరకపోతే వీళ్ళ చర్మాలు జెండా లౌతాయి

ఎంత బరితెగించకపోతే వీళ్ళ చేతులు గొంతుకలౌతాయి"

అంటూ నేటి ప్రజాస్వామిక భారతంలో రాజ్యాంగం సాక్షిగా అంటరాని బడుగు బలహీన వర్గాల ప్రజల పట్ల అగ్రవర్ణ, వర్గ సమాజం చేస్తున్న దగాని, వారి పెత్తందారీ తనపు అహంకారాన్ని నాటకీయంగా తన కవిత్వం ద్వారా ప్రదర్శిస్తాడు. మిగిలిన కవులకీ ప్రధానంగా దళిత కవిత్వం వ్రాసిన కవులకీ తెరేష్‌బాబుకీ ఉన్న తేడా అంతా ఆయన అమృతవాణి అనే క్రిస్టియన్ సంస్థలో ప్రారంభించిన దృశ్యరూపక ప్రక్రియలు తన కవిత్వంలో కూడా ప్రవేశపెట్టాడు ఆయన కవిత్వంలో కవితల్లో పాత్రలే మాట్లాడతాయి.

తెరేష్‌బాబు ఆలోచనలు అసహాయులైన సమాజానికి అక్షరాల ఆయుధాలు ఇచ్చే వేడిని నిలువెల్లా నింపుకొని ఉంటాయి. హిందూ అగ్రవర్ణ, అగ్రవర్గ సమాజం అంటరాని బడుగు బలహీన వర్గాల పట్ల ప్రదర్శిస్తున్న అసమానమైన, దుర్మార్గవైఖరికి వ్యతిరేకంగా ప్రపంచంలో ఏ మహా సముద్రానికి మతనామం లేదు కానీ హిందూమతం ఒక మహా సముద్రానికి కూడా హిందూ మహాసముద్రం అని పేరు పెట్టింది అంటూ ఒక ఆడియో కాసెట్‌ని హిందూ మహాసముద్రం పేరుతో తెరేష్‌బాబు 1996లో తీసుకొచ్చారు. ఆడియో కాసెట్‌ని పుస్తక రూపంలో 2010 నవంబర్‌న తీసుకురావడం జరిగింది.

అందులో ఆయన

చూడమ్మా శివరంజనీ

శ్రుతిపక్వంగా శ్రవణ సుభగంగా

శ్రుతుల్ని ధ్వంసం చేయడమే నాపని

(హిందూ మహాసముద్రం)

అంటూ సాంప్రదాయక 'సరిగమపదనిసల సంగీతాన్ని ధ్వంసం చేసేందుకు పక్కా ప్రణాళికని రచించారు.

మరోచోట ఆయన

ఇప్పుడు నేను 'హిందూ మహాసముద్రం" అనే విషాదగీతాన్ని ఆనందంగా మొదలు పెడుతున్నాను"

అంటారు. హిందూమతం వర్ణాశ్రమ ధర్మాల్ని ఆచరిస్తూ మహాకవి జాషువా "చీమలకు పంచదార పాములకి పాలు పోసే ఈ సమాజం మనిషిని మాత్రం కనీసం ఒక ప్రాణిగా చూడటం లేదన్నట్లుగానే తెరేష్‌బాబు తన కవితలో ఒకచోట

"మట్టి గట్లయిన చోట నీళ్ళుంటాయి

మనిషి గట్లయిన చోట నెత్తురుంటుంది" అంటారు.

సముద్రాన్ని ఒక మతంగా, ఉద్యమంగా భావిస్తూ

"సముద్రం ప్రవహించదు కానీ ప్రవహించగలననే బుకాయిస్తుంది" అంటారు.

ఆయన తన ఆలోచనల్ని హిందుమతం వరకు మాత్రమే పరిమితం చేయకుండా అన్ని రకాల ఉద్యమాల్లో పోరాటాల్లో జరిగే అన్యాయాల్ని ప్రశ్నిస్తూ

"సముద్రం నవ్వటం ప్రారంభిస్తుంది

ఆ నవ్వులో అభ్యుదయం

ఆ నవ్వులో సోషలిజం

ఆ నవ్వులో విప్లవం విప్లవం విప్లవం" అంటారు.

(హిందూ మహాసముద్రం)

నేడు దేశంలో ఇంతవరకు జరిగిన వర్గపోరాట నినాదాల కమ్యూనిస్టు ఉద్యమం తనని తాను ఆత్మవిమర్శలోకి నెట్టుకొని జరిగిన చరిత్రల కాలం" పాత్రని గుర్తించడంలో జరిగిన పొరపాటుని నెమరేసుకొని తిరిగి హిందూత్వంపై జరపాల్సిన పోరాటాన్ని దళిత శక్తులతో నిర్మిస్తున్న దశలో తెరేష్‌బాబు కవిత్వం చాలా అవసరమైనదిగా మనం భావించాలి.

తెరేష్‌బాబు కాలక్షేపపు మానసికోల్లాసపు కవిత్వం వ్రాయలేదు. ఆయన రచనలకు ఒక లక్ష్యం ఉంది. పైడి తెరేష్‌బాబు హక్కులకు దూరమైన అంటరాని సమాజంలో జన్మించాడు. ఆయన రచనలన్నీ జీవితపు కఠోర వాస్తవాలతో నిండి ఉంటాయి.

ఆయన సముద్రం ఉన్నది
వాయుగుండాల్ని పుట్టించి! భూమ్మీదకి విసరడానికే
సముద్రం ఉన్నది
జీవిత సౌందర్యాన్ని ధ్వంసం చేసి
సముద్ర శాఖల్ని తెరవడానికే
ఎక్కడైనా ఒక అల్పపీడనం పుట్టిందంటే
దాని వెనకో సముద్ర హస్తం ఉందని
మనం అర్ధం చేసుకోవాలి అంటారు.

(హిందూ మహాసముద్రం)

తుఫాన్ నేపథ్యంలో బలీయ సమాజాన్ని అతల కుతలం చేస్తున్న మతం, కులం అంటరాని తనాన్ని మనం కొత్తగా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

అంటరాని బడుగు బలహీన వర్గాల గురించి వ్రాయకుండా ప్రేమ, గాలి, చెట్టూ, పుట్టా అంటూ రాస్తున్న సంప్రదాయ కవుల గురించి వ్రాస్తూ

ఆయన....

"అయ్యా సముద్ర దేవరా
నిన్నటిదాకా కవిత్వాన్ని బతికించడం కోసం చచ్చావ్
ఇవాళ నువ్వు బతకడం కోసం కవిత్వాన్ని చంపుతున్నావ్
అనుకరించు అనుసృజించు అంతా సొంతమేనని బుకాయించు
అంత గొప్ప కవివి
దళితుల జోలి నీకెందుకులే పాపం
శరీరం మీ్మదపడు శిరోజం! ఉరోజం! నాభీ! నడుమూ
రతీ! అధరం అద్భుత కవితా వస్తువులు కదూ...

(హిందూ మహాసముద్రం)

అంటాడు. "సాహిత్యం సృష్టిస్తూ అనవసర కవితా వస్తువుతో అవార్డులకోసం అనేక పాట్లు పడుతూ అసలు సిసలు మట్టి మనుషుల కోసం మాట్లాడని ఒట్టి మనుషుల గురించి లోపలి, బైటి మిత్రుల శత్రుల గురించి అనేక పోరాటాలు చేసారు తెరేష్‌బాబు.

తెరేష్‌బాబు హిందూమతంతో పాటు అన్ని మతాల్ని వాటి మూఢనమ్మకాల్ని ప్రశ్నిస్తూ

ఎందుకయ్యా ఏసు ప్రభువా
ఇరవై శతాబ్దాలు గడిచినా ఇంకా లోక పాపం మోస్తానంటావ్
ఎవడి కరెన్సీ భారం వాడు మొయ్య గలిగినప్పుడు
ఎవడి సిలువభారం వాడు మొయ్యడానికేం" అంటాడు.

తెరేష్‌బాబు అంతరంగంలో అంబేద్కరిజపు చైతన్యం నిలువెల్లా తొణికిసలాడుతూ ఉంటుంది. అందుకే ఆయన ఒకచోట

"సముద్రానుకూల సాహిత్యాన్ని పేజీల కొద్దీ విసరవచ్చు
అరుణ్ శౌరీల్ని పోషించనూ వచ్చు
అంబేద్కర్ వ్యతిరేకతకు పెంచనూ వచ్చు"

("హిందూ మహాసముద్రం")

పుట్టుకతోనే తెరేష్‌బాబు ఒంగోలులోని దళితవాడలో చైతన్యపు ఉగ్గుపాలు తాగాడు. కనుకనే ఆయన 1985లోనే తన ప్రశ్నల ఆయుధాలతో దాశరథి గారి ముందుమాటతో 'శర సంధనం' అనే కవితా సంపుటిని వెలువరించారు. ఏ సమాజంలో అయినా ఒక రచయిత పుట్టాలంటే అతనికి సంవేదన శీలత గ్రహణశక్తి సృజనాత్మకత ఖచ్చితంగా ఉండాలి. దళిత సమాజపు వేదనలని తెరేష్‌బాబు స్వయంగా 10ఏళ్ళ వయసునుండే అనుభవించాడు. అందుకని ఆయనకి భాదితుల పట్ల అనంతమైన ప్రేమ ఉండేది. అందుకే ఆయన ఒకచోట సజ్జలగూడెం మహదేవమ్మ అనే దేవదాసి పై అత్యాచారానికి ప్రతిస్పందిస్తూ కుక్క కరిచిన కవితలో

"నే నిప్పుడు వేదంలా ఘోషిస్తున్న రోజుల్లో
సీసంలా ప్రవహించిన గోదావర్లని కీర్తించను
జీవ నదుల్ని తలదన్నే ఒక మహా దుఃఖ కథ గురించి మాట్లాడదల్చుకున్నాను
అవును సజ్జల గూడెం మహదేవమ్మ గురించి మాట్లాడుతున్నాను.
నది నీళ్ళయిన చోట నాగరికులు ఉన్నట్టు చరిత్ర లెక్కలు కట్టిందే
మరి నదినెత్తుటి కన్నీళ్ళయినచోట ఏ గాడిద కొడుకులున్నట్లు లెక్క అంటారు.

గ్లోబలైజెన్ నేపథ్యంలో గ్రామాలు, పొలాలు బీడుబారి పట్టణాలవైపు పరిగెడుతున్న దశలో తెరేష్‌బాబు 'నేను నా వెతలమారి ప్రపంచాన్ని' జులై 2009లో ప్రచురించాడు అందులో ఆయన ఒకచోట

భయం బాంధవ్యానికి పునాది అయినంతకాలం
యుద్ధ స్పృహ వైరస్‌లా వ్యాపిస్తూనే ఉంటుంది
యుద్ధం కన్నా యుద్ధ భయం దుర్భరం
సైనికదాడి కన్నా సాంస్కృతిక దాడి ప్రమాదకరం అంటాడు

(నేను నావెతల మారి ప్రపంచం)

శతాబ్దాలుగా అణచివేయబడిన అంటరాని పల్లెల నెత్తుటి కేకలకి ఘనత వహించిన మన దేశ చరిత్ర తనలో చోటు

**కవిత**

## మాట




– ఎస్.ఆర్.పృథ్వి
9989223245


హృదయంలో మొలకెత్తిన భావ పరంపర
పెదవుల నాట్యంలోంచి మాటల విన్యాసమవుతుంది
మౌన మేఘాల్ని చీల్చుకొని
మెరుపు శబ్దమై ప్రకాశిస్తుంది
అమ్మ ప్రేమలా హృదయాల్ని తాకి
సువాసనల మల్లె పందిరి అవుతుంది
రెండు కలవని ధృవాల నడుమ
స్నేహ రాగం నడిచేందుకు వంతెన అవుతుంది
మాట – మంత్ర పుష్పంలాంటిది
కక్షలు పెరిగి, నెత్తురొలకకుండ
రెండు మనసుల నడుమ చెలిమి ద్వీపం అవుతుంది
మనసును, స్వార్థం జ్వాలై రగిల్చినప్పుడు
నిస్వార్థపు మేఘాల్ని చిదిమితే కురిసిన
తీపిజల్లు అవుతుంది
రెండు చూపులు చురకత్తులై తలపడినప్పుడు
ఆప్యాయతల్ని పొంగించే జలసంధి అవుతుంది
మాటలోంచి మాలిన్య రహితమైన మధుర జ్వాల ఎగసి
హృదయాంతరాళాలలో దాగిన కల్మషాన్ని దహిస్తుంది
మంచిమాట లోకహితాత్మకమైన గురువు
మంచిమాట శ్రేయాత్మకమైన సన్మిత్రుడు
మాటకి మంచి తనమనే మాణిక్యాల్ని పొదుగుదాం
ప్రతి అక్షరానికి మమతానురాగాల తేనెనుపూద్దాం
అక్షరాలను సత్యసంపదకి ప్రతీకని చేద్దాం

---

కల్పించలేదు. నాగరికత, సంస్కృతిల నిర్మాణంలో పాటుపడారన్న అంటరాని, బడుగు బలహీన వర్గాల ప్రజల చరిత్ర నమోదు కాలేదు. భారతదేశ సమైక్యత ముసుగులో దేశం తనలో కలిపేసుకున్న అనేక దళిత, ఆదివాసీల సంస్కృతుల్ని ఉన్నత, పండిత వర్గాల చరిత్రగా చెప్పుకోబడడం కన్నా అమానవీయం ఏముందని కవి పైడి తెరేష్‌బాబు అంటారు. ఆయన ఒక చోట వాడు తిట్టొందంటున్నాడు. తిట్టు కవిత్వం కాదంటున్నాడు రంద్రండి దళిత కవుల మందరం బృహన్నల వేషాలు కట్టుకుందాం (అల్పపీడనం)

ప్రపంచ చరిత్రలో నమోదుకాని అనేక అల్పసంఖ్యాక గొంతుకలు నేడు తమ చరిత్రని తాము లిఖిస్తున్నాయి. భారతదేశం, తెలుగు ప్రాంతమే కాదా ప్రపంచ చరిత్ర దానికి సాక్షిగా నిలిచింది తెలుగు దళిత కవిత్వం అంటుంది ప్రజల గుండె గొంతుకగా వెలికి వచ్చింది.

తెలుగు దళిత సాహిత్యంలో “నిశాని” కవితా సంపుటతో సింహగర్జన చేస్తూ నలుగురు కవులు ప్రవేశించారు. వీరిలో వరదయ్య, మద్దూరి నగేష్‌బాబు, పైడితెరేష్‌బాబు, ఖాజ్రాలని చెప్పుకోవాలి.

నిశాని కవితలో తెరేష్‌బాబు “రాతమాకు కొత్తకాదు మీరు పలకల బావుల్లో బలపాల కప్పలైనప్పుడు మేం నేల తల్లి గుండెలమీద పైరు పద్యాలమయ్యాం (అల్పపీడనం)

సమకాలీన దళిత కవిత కేంద్రంగా స్వాతంత్ర్యం లభించిన తరువాత దళితుల దీనమైన అవస్థల్ని చిత్రించడం జరిగింది. పేదరికం, ఆకలి అభద్రత, పరాధీనత, లాంటి స్థితిలోకి అంటరాని ప్రజలు నెట్టి వేయబడ్డారు. దీనికి కారణంగా మతం రాజ్యం, పెట్టుబడిదారీ సమాజాలను చెప్పవచ్చు. ఇలాంటి స్థితిలో దళిత కవి పైడి తెరేష్‌బాబు తన కలంతో అగ్నిని కురిపించాడు. నాకు చెందని సిద్ధాంతపు వెలుగులో ఆయన ఒక చోట “కాలాన్ని విస్మరించి వ్యవస్థతో పోట్లాడ్డం అంబేద్కర్‌ని మినహాయించి అస్పృశ్యతను రూపుమాపడం ఎంతహాయి. అంటారు

(నేను నా వెతలమారి ప్రపంచం)

అలాంటి గొప్ప వ్యక్తిని ఇంత త్వరగా కోల్పోవడం చాలా బాధాకరం.

**(సెప్టెంబర్ 29న పైడి తెరేష్‌బాబు కన్నుమూశారు)**

# తాత్త్వికపరిశోధన పునాదిపై పాపినేని కవితా నిర్మాణం




- ఎమ్వీ రామిరెడ్డి
9866777870

*చదివేకొద్దీ మనసుకు మరింత చేరవయ్యే పాపినేని కవిత్వంలోని ప్రత్యేకత ఏమిటి అని ప్రశ్నించుకుంటే... 'తాత్త్విక పరిశోధన' అని నాకనిపిస్తుంది. తీసుకున్న వస్తువు ఏదైనా, లోతుల్లోకి ఎలబారి, దాని మూలాలను అందిపుచ్చుకుని, అక్కడ కవితానిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఆధునిక వస్తువును కవిత్వీకరిస్తున్నా, ఆదిమ మూలాలను బయటకు తీస్తారు. దాని గురించి పరిశోధించి, కొత్త విషయాలను సరికొత్తగా చెబుతారు. 'గొంతెత్తి' అనే కవితలో 'పాలేరు చిన్నోడి'నీ, 'సిసిఫస్'నీ పోల్చడమే అందుకు నిదర్శనం.*

ప్రముఖ కథారచయిత, కవి, విమర్శకులు, ఆదర్శ అధ్యాపకులు డాక్టర్ పాపినేని శివశంకర్ "ఆకుపచ్చని లోకంలో" కవితాసంపుటి అంటే నాకు చాలా ఇష్టం. దాన్ని మా ట్రస్టు తరపున ప్రచురించడం ఒక కారణమైతే, అందులో అద్భుతమైన కవిత్వం ఉండటం మరో కారణం. ఆ సంపుటిలోని కవితలన్నీ వెనక్కీ ముందుకీ బోల్డన్నిసార్లు చదివాను. 'అంతకన్నా గొప్ప కవిత్వం ఇకముందు ఆయన రాయలేకపోవచ్చు. రాసినా కొత్తగా ఇంకేమీ చెప్పలేకపోవచ్చు' అనుకున్నాను. కానీ నా అనుమానాన్ని పటాపంచలు చేస్తూ "ఒక ఖడ్గం ఒక పుష్పం" దూసుకొచ్చింది. అది మరింత వైవిధ్యభరిత కవిత్వంతో నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది. తొమ్మిదేళ్ళ విరామం తర్వాత మళ్ళీ "రజనీగంధ" రూపంలో సరికొత్త కవితాపుష్పమై పరిమళించారు.

పాపినేని మృదుస్వభావి. సౌమ్యుడు. గబగబా చొచ్చుకుపోవడం, ఎదుటివారిని తెరుచుకుని అమాంతం లోనికి ప్రవేశించడం ఆయన మనస్తత్వానికి విరుద్ధం. ఆచితూచి స్పందిస్తారు. ఎదుటివారితో ఒకసారి అనుబంధం ముడిపడిందంటే మాత్రం, తనను తాను విప్పుకొంటారు. అలాగని ఆ సౌమ్యత్వం కవిత్వంలోనూ ప్రతిఫలిస్తుందనుకుంటే పొరపాటే. ఆయన లోపల రహస్యంగా ఓ కత్తులబావి ఉంటుంది. పురుడు పోసుకునే ప్రతి పదం ఆ బావిలో స్నానించి, రాటుదేలి, నగ్నంగా కవిత్వంలో నిలబడుతుంది. కాబట్టే ఆయన "ధిక్కరించకపోతే/ దిక్కులు దద్దరిల్లేటట్టు/ పొలికేక బెట్టకపోతే/ అది కవిత్వమెట్లా అవుతుంది" అనగలిగారు. ఏ కవిత రాసినా 'వాక్యం తపించాలి/ రవ్వరవ్వగా రగుల్కోవాలి' అని తపిస్తారు. అలాంటి తపస్సులలోంచే కవి "గొంతెత్తి" అరుస్తారు. ఎవ్వరూ ముట్టుకోని "ద్రవాత్మకం" లాంటి కవితకు ప్రాణం పోస్తారు.

**మూలాల్లోకి ఎలబారడం కవి ప్రత్యేకత**

చదివేకొద్దీ మనసుకు మరింత చేరవయ్యే పాపినేని కవిత్వంలోని ప్రత్యేకత ఏమిటి అని ప్రశ్నించుకుంటే... 'తాత్త్విక పరిశోధన' అని నాకనిపిస్తుంది. తీసుకున్న వస్తువు ఏదైనా, లోతుల్లోకి ఎలబారి, దాని మూలాలను అందిపుచ్చుకుని, అక్కడ కవితానిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఆధునిక వస్తువును కవిత్వీకరిస్తున్నా, ఆదిమ మూలాలను బయటకు తీస్తారు. దాని గురించి పరిశోధించి, కొత్త విషయాలను సరికొత్తగా చెబుతారు. 'గొంతెత్తి' అనే కవితలో 'పాలేరు చిన్నోడి'నీ, 'సిసిఫస్'నీ పోల్చడమే అందుకు నిదర్శనం. 'నయాగరా' గురించి రాస్తూ ఆ 'కళ్ళెం తెగిన కదన ధవళాశ్వం' 'మేరియాని తాటిపై దాటించిన, యానీని పీపాలో ముంచి తేల్చి తీరం చేర్చిన' విషయ పరిజ్ఞానాన్ని కూడా కవిత్వంలో ప్రస్తావిస్తారు.

'క్రిక్రీడ' అనే విచిత్రమైన శీర్షికతో క్రికెట్టు మీద రాసిన కవితలో

మన ఆటలైన బిళ్ళంగోడు, పిచ్చిబంతులను స్పృశిస్తారు. అదిగో, అక్కడే ఆయన తాత్త్వికపరిశోధన ప్రారంభమవుతుంది. 'ప్రతి మనిషీ/ బతుకంతా కోర్కెల బరువుల్తో/ ఒక కొండనెక్కుతానే ఉన్నాడు' (గట్టు మీదకి); 'ఒక చావు చుట్టూ అనేక మరణాలుంటాయి/ ఒక్క కన్నీటిబొట్టులోనే సముద్రాలు ఘోషిస్తాయి' (ఆయుధ పాఠశాల)– ఈ వాక్యాల్లో ఎంతటి తాత్త్విక దృక్కోణం దాగుందో ప్రత్యేకంగా వివరించాల్సిన పనిలేదు. "ఆయుధ పాఠశాల"లో 'పక్కలో పిల్లలు గాక తుపాకులు పవళించటమేమిటి?/ ఆయుధమే వ్యాపారం కావటమేమిటి?/ అంతా వ్యాపారమైన చోట/ ఆయుధమూ నిత్య వినియోగవస్తువేనా?' అంటూ తాత్త్వికంగా ప్రశ్నిస్తారు.



పాపినేని శివశంకర్

"కుంకుమపూల రాణి"లో కాశ్మీర్ అందాలను వర్ణిస్తూనే, దాని వెనక దాగిన దుఃఖపు తెరలను తొలగిస్తారు. "చెప్పులు మీద'' కవిత్వం రాసినా మనిషి ప్రకృతినెలా కోల్పోతున్నాడో వివరిస్తారు. ''కాసేపు ఎలుకల గురించి" రాసినా 'ప్రకృతిలో రెండు చేతుల రెండుకాళ్ళ భయదసౌందర్యం' గురించి విశ్లేషిస్తారు. 'మైత్రికోసం నేనొక మనిషినడిగాను/ కరచాలనం తోపాటు కరవాలమిచ్చాడు' అంటూ "ఆయుధమూ ఆర్తనాదమూ" వెనక చీకటికోణాలను వెలికితీస్తారు. హజారే ఉద్యమనేపథ్యంలో రాసిన కవిత కూడా 'చిన్నప్పటి నుండి/ చిన్నదో పెద్దదో ఒక పామును కొట్టాలని' అని మొదలవుతుంది. అవినీతిని సర్పంతో పోల్చడంతోపాటు; చిన్నప్పుడు పాముల్ని బైటికి రప్పించి, కవ్వించి, కసిగా చంపే చుండి రాఘవాయ్‌లో హజారేను దర్శిస్తారు.

**మనిషే అంతిమ లక్ష్యం**

పాపినేని అంతిమలక్ష్యం మనిషే. మనిషిని కనుగొనటం. మనిషిని లోకానికి పట్టించటం. 'మనిషై పుట్టినాక/ కాస్త మట్టిగొట్టుకోవాల' అంటూ మన మూలధాతువును గుర్తు చేస్తారు. 'అందంగా మబ్బునుంచి వానచినుకు జారినంత సహజంగా/ కదిలిపోయే మనిషీ! అభినందనలు' అని ప్రశంసిస్తారు. ఆ మాటకొస్తే, ఎక్కడ ప్రారంభమైనా, ఆ వస్తువును మనిషి దగ్గరకే తీసుకొస్తారు. పచ్చపిట్ట, గడ్డివాము, పాకుడుమెట్లతో ప్రారంభమైన "ఎండ పడనీ" కవితను 'పొద్దున్నే గూడు వీడుతూ/ రెక్కలల్లార్చిన మనిషిపిట్టకి/ ఎండపొడ సోకనీ' అంటూ మనిషితో ముడిపెడతారు. 'ఇద్దరు స్త్రీ పురుషుల మధ్య/ కాంక్షారహిత, దేహరహిత, దహనరహిత సంబంధం/ అలౌకికం అలైంగికం/ ఇంకేదైనా ఉండవచ్చు/ పక్కపక్కనే అంతులేని చెలిమినడకేదో ఉండవచ్చు' అంటూ "ఆలోచనాలోచన" చేస్తారు.

**ఛాయలకు రాని సంక్లిష్టత**

పాపినేని కవిత్వంలో భావసంక్లిష్టతకు తావులేదు. ఆయన తెలుగు పండితులైనా, భాషమీద ఎంతో పట్టు ఉన్నా సుదీర్ఘ సంధులూ సమాసాల జోలికి వెళ్ళరు. సులభమైన, శుచి అయిన పదాలనే వాడతారు. పడికట్టు పదాలు ఎక్కడా కనిపించవు. రొడ్డకొట్టుడు వ్యక్తీకరణలు కనిపించవు. అర్థంలేని అభివ్యక్తులకు చోటుండదు. కవితా ప్రారంభం ఎంత తేలిగ్గా ఉంటుందో అంత లోతైన భావాలతో తొణికిసలాడుతుంది. నయాగరాను వర్ణిస్తూ 'నీటి చాటున ఉరుమో/ నోరెత్తి హూరెత్తి నురగలెత్తే అగాథమో/ ఆగ్రహ ఆకాశగంగో' అని ప్రారంభిస్తారు. 'తలుపులన్నీ సరిగ్గా వేశావా/ తాళాలు వేసి లాగి చూశావా' అని మొదలవుతుంది ''అన్నీ మూసేసి"న కవిత. 'అన్నీ చూడగలిగీ/ దేన్నీ దర్శించలేకపోవటం అసలైన అంధత్వం' అంటూ 'దర్శనం' మొదలవుతుంది. 'ఫిజికల్లీ ఛాలెంజ్‌డ్ కాదు/ ఫిజిక్స్‌నే ఛాలెంజ్ చేసిన వాడు' – కాళ్ళూ చేతులు ఆడకపోయినా, కాలబిలంలో ఏరోబిక్స్ చేసిన' "విశ్వనరుడు" స్టీఫెన్ హాకింగ్‌పై రాసిన కవితకు ఆదిపంక్తులవి.

'పరాయి విత్తనం' ఓ అద్భుతమైన కవిత. దీన్నిండా ఎన్నో పదప్రయోగాలు. 'అమెరికేండియాకి అవగుణ సంధి చేసి/ బి.టి.కి కాటన్‌కి అనుప్రాస కూడా కుదిర్చాడు/ అహో! మహికో–మోన్‌శాంటో విచిత్రదాంపత్య వికల సంతానమా' అని కవిత్వీకరించడం ఆయనకే చెల్లింది. ఈ కవితలో అమెరికేండియా, జీనీకరించుకొని, బాక్టీరియోదకం, ఎలర్జీవ సంపద వంటి అద్భుత పదప్రయోగాలను గమనించవచ్చు. అలాగే అవకగ,

**అవకగ, ఇవకడ, ఆ వజాన వంటి గుంటూరు జిల్లా మాండలికాన్ని కూడా పరిశీలించవచ్చు. 'నాము మొలకలు' వంటి పదాలను రైతుబిడ్డ మాత్రమే, పొలంతో గాఢపరిచయం ఉన్న వ్యక్తి మాత్రమే రాయగలడు.**

ఇవకడ, ఆ వజాన వంటి గుంటూరు జిల్లా మాండలికాన్ని కూడా పరిశీలింవచ్చు. 'నాము మొలకలు' వంటి పదాలను రైతుబిడ్డ మాత్రమే, పొలంతో గాఢపరిచయం ఉన్న వ్యక్తి మాత్రమే రాయగలడు.

ఏళ్ళ తరబడి లెక్చరర్‌గా పనిచేసి, ప్రిన్సిపల్‌గా రిటైరయిన పాపినేనికి నాలాంటి వాళ్ళు చాలామందే శిష్యులున్నారు. తన విధి నిర్వహణ యావత్తూ 'ఒక్కొక్క మొక్కని సుతిమెత్తగా సాకటం/ కాసిని తేట తెలుగు నీరుపోసి కాపాడటం' చేశారు. 'నారు పోసి నీరు పోసి/ పాదులు తవ్వి పందిళ్ళు వేసి' ఎంతో అలసిపోయినా, విశ్రాంతి తీసుకోవాలంటే ఏదో అలంకు. 'పాటైనా బాటైనా చివరి చరణంలోనే సారాంశమంతా' అంటారు. 'ఎందరో సముద్రదాహాలతో పర్వతమోహాలతో వెళ్ళిపోతారు/ గాయాల దేహాలతో మళ్ళిపోతారు/ చివరికి సారం లేని పిప్పిదంట్లుగా మిగిలిపోతారు.' కానీ పాపినేని మాత్రం 'మనసునిండా మధురగేయాలతో మల్లెలవాసనతో/ అందర్నీ కదిలిస్తూ కదిలిపోయారు/ దారి పొడుగునా స్నేహదీపాలు వెలిగిస్తూ/ తన వెనకే పరిమళాల దారుల్ని/ నీరవ సంగీత ధారల్ని వదులుతూ' నడచిపోయారని ఆయన వందలాది శిష్యుల ఏకాభిప్రాయంగా నేను చెప్పగలను.

**ప్రతి కవితా అనుభవసారమే**

సాధారణంగా తన అనుభవంలోకి రానిదాన్ని పాపినేని ముట్టుకోరు. ఏళ్ళ తరబడి పోగుపడిన సంఘటనల సమాహారంలోంచే కవితా మాలలల్లుతారు. 'పెంపకం' దానికో ఉదాహరణ. సంపుటి మొత్తంమీద నాకు బాగా నచ్చిన కవిత ఇది. చిన్న చిన్న పదాలతో, తేలికైన ఇమేజరీలతో అద్వితీయంగా రాశారు దాన్ని. 'పెద్దగా నేర్పిందేమీ లేదు/ పలక మీద దయ అనే రెండక్షరాలు రాసి దిద్దించాను/ కాసిన ముళ్ళూ రాళ్ళూ ఉండే దారి చూపించి/ నిబ్బరంగా నడిపించాను/ అక్కరపడినప్పుడు కొత్తదారులు కనుక్కొమ్మన్నాను' ఇలా హాయిగా ప్రారంభమైన కవిత అంతే ఆహ్లాదంగా సాగి, చివరగా 'జీవితం ఒక అద్భుతపుష్పం వికసించే ప్రక్రియ–/ దాన్ని పరిమళభరితం చేసుకొమ్మని చెప్పాను' అంటూ అంతే సహజసుందరంగా ముగుస్తుంది.

"అసమాపకం" అంటూనే చాలా వాక్యాల్లోని ఖాళీలను ఆయన పూరిస్తారు. వాక్యాల్లోనే సృష్టి సమస్త అర్థాన్నీ దట్టించి

**సాధారణంగా తన అనుభవంలోకి రానిదాన్ని పాపినేని ముట్టుకోరు. ఏళ్ళ తరబడి పోగుపడిన సంఘటనల సమాహారంలోంచే కవితా మాలలల్లుతారు. 'పెంపకం' దానికో ఉదాహరణ.**

దట్టించి, తారాజువ్వలా మబ్బులకల్లే విసిరేస్తారు. ఆయన వాక్యాలు మన చుట్టూ ప్రదక్షిణ చేస్తాయి. కవి దృష్టిలో 'మాట ఒక వింధ్య పర్వతం'. 'ఒక సంపూర్ణవాక్యం కోసమే ఈ యాతనంతా' అంటూ సాదాసీదాగా ప్రారంభమైన కవిత బాల్యపు జ్ఞాపకాలతో మిళితమై, 'డొంకదువ్వలో గోలీ దొరికిన పిల్లాడిలా/ ఒక పూర్ణవాక్యం దొరకబుచ్చుకొని/ సంబరంగా ఎగిరి గంతులేసిందెవడు?' అంటూ ఒక ఊపుతో ఎత్తులకెదుగుతూ మనల్ని మరో లోకంలోకి తీసుకెళుతుంది. చెప్పులు పోగొట్టుకున్న అంశం మీద కవిత రాస్తూ ఓచోట 'చివరికి మిగిలేవి కొన్ని పాదముద్రలే' అనటం పాపినేనికే చెల్లు.

తనకున్న భాషాపటిమ కారణంగా పాపినేని ఎక్కడా అరిగిపోయిన మాటలజోలికి వెళ్ళరు. వాడీవాడీ వదిలేసిన పదప్రయోగాల ప్రసక్తే రానివ్వరు. తనకంటూ ప్రత్యేక పదసామగ్రిని తయారుచేసుకుంటారు. సరికొత్త పదబంధాలను సృష్టిస్తారు. ఆ పద సంగమంలో సౌందర్యం ఉంటుంది. అబ్బురపరిచే అర్థం ఉంటుంది. చక్రం కన్ను, వర్ణసమామ్నాయం, మట్టివేను, సంవాసన, ఆత్మహంస, విశ్వావధి, అంతరంగ గగనం, అహం పలుగు, శిలాద్వేషం, దయావృక్షం, చర్మలావణ్య తరంగాలు, ఎడారి ఎడాలు, చెతుర్లాడే మబ్బు, మబ్బులో కుశాల, దయాగ్ని, మదోద్రిక్త కాయం, చీకటికంటె, వికార విభజన రేఖలు, దేహవాహిని, వృక్షాటవులు, జ్ఞాన వ్యాయామం, విజయువజ్రం, సాహసదీపం, ధునీగాయని, జలజ్వాల, కంకాళ కాలం, గాయాల మాలలు, జీవసుధాకలశం, చండశ్వాస, మార్మికగర్జన, మహాటవి, శూన్యసరస్సు.... మచ్చుకు కొన్ని. బర్రెగొడ్డు, ఉసి, దబ్బున, దువ్వనేల, ఉక లేని, చొప్పకట్టలు, వెలిబారిన, తొలేకాశి, సనూడదలు, మయాన, ఇయ్యాల, సిగరం, ముణగర దీసుకు, సుంకు, వెనకమాట వంటి గుంటూరు జిల్లా పదాలు సహజసహజంగా ఆకట్టుకుంటాయి.

కవితల్లోని కొన్ని వాక్యాలైతే అద్భుత నిర్వచనాలుగా భాసిస్తాయి. ప్రేమంటే 'సాన్నిహిత్య సంగీతంలోనుంచి/ బాధ్యతాభావనలో నుంచి పెల్లుబికే అద్భుత సంవేదన కదా' (చెప్పలేనిది), 'పుట్టుకతోనే రవళిస్తూ ఆఖరి ఊపిరితో ఆగిపోయే/ పరవశ ప్రాణవేణువు గదా శరీరం' (దేహదేహళి), 'ఆర్ద్ర

## కవిత

### చీకటి కోణం

- సిహెచ్. మధు
9949486122

గుండెల్లో
చిరుదరహాసం మొలకెత్తిన వేళ
చీకటి ముసరు కుంటుంది

చల్లగాలి మెల్లగా వీస్తున్న వేళ
తుఫాను దండెత్తుతుంది

ఇది ప్రకృతి వైపరీత్యం కాదు
విధి విలాపం కాదు

జనం బ్రతుకు శాపగ్రస్తం!
వ్యవస్థ రూపు రేఖలలోనే
జీవిషాద దృశ్యం...

సూర్యుడు ఉదయించాడని
సంబరపడిన వేళ -
కొండలు అడ్డొస్తాయి

నక్షత్రాలు మెరుస్తున్నాయని
ఎగిరి గంతు లేసిన తోట
రాలిపడిన నక్షత్రాన్ని చూచి
కెవ్వున కేక వేస్తోంది



నిండు జలాశయాల పండుగచూచి
రైతు నృత్యం - తర్వాత
మెడకు చుట్టుకున్న అప్పుల
నాగుచూచి
చావు బ్రతుకు గీత మధ్య
జీవితాన్ని నిలబెడుతాడు
ఇది దేవుని కోసం కాదు దయకాదు
వ్యవస్థ శాపం!

### నానీలు

- డా.ఎన్.నిశ్చల

అన్యాయాలు
అక్రమాలు
సయామీస్ కవలలు
విడివడని బంధం మరి



ప్రపంచీకరణమా
నీకో నమస్కారం
లోకమంతా
నీకు దాసోహం

సామ్రాజ్యవాదంలో
ప్రపంచీకరణం
ఒక
వశీకరణమంత్రం

అద్భుతమేఘం జీవితం' (తోటమాలికి వీడ్కోలు), దీపం 'అపురూప కాంతి సుగంధ పవనం' (దీపం ముట్టించు) వంటివి వాటిల్లో కొన్ని.

**అగ్ని ముట్టించే ముగింపు**

పాపినేని కవితల ముగింపులో తళుకుబెళుకు మెరుపులుండవు. పనిగట్టుకుని పరిగెత్తుకొచ్చే కొత్త దృశ్యాలుండవు. ఆశ్చర్యపరిచే అభివ్యక్తులుండవు. ఎంత హృద్యంగా మొదలవుతుందో, అంతే హుందాగా ముగుస్తుంది. అయితే అతి సాధారణంగా కనిపించే ఆ ముగింపు మనల్ని వెన్నాడుతుంది. ఆలోచింపజేస్తుంది. లోపలెక్కడో అగ్ని ముట్టించి వదిలేస్తుంది. "పిలుపు"లో ఈ సగం చెవిటి ప్రపంచంలో/ ఎవడు ఎక్కువమందిని తనివితీరా పిలవగలడో/ లేదా పిలిపించుకోగలడో/ వాడికి నా వందనాలు' అన్న ముగింపు చదివాక ఆ వాక్యాల్లో పడి కొట్టుకుపోకుండా ఉండలేం. "గట్టు మీదకి" కవిత చివరి వాక్యాలు చదివాక 'ఎన్నాళ్ళకైనా ఇక్కడ/ మనిషిలాంటి ఒక కొండను చూసినట్టే/ కొండలాంటి ఒక మనిషిని చూస్తానా' అని ఆలోచించని మనిషి ఉండడు. 'ఏవీ మూసెయ్యకుండా/ నిర్భయంగా నిశ్చింతగా/ నిద్రపోలేమా' (అన్నీ మూసేసి), 'పామును కొట్టలేకపోవచ్చు/ కనీసం సర్పహననంలో సైదోడుగానైనా నిలబడాలి' (సర్పయాగం), 'ఈ నీల సంక్షుభిత వాతావరణంలో/ జాతి చైతన్యమెట్లా తిరిగి మేల్కొంటుందో చూద్దామని/ ఆ వాక్యం ఇంకా/ చేతులు కట్టుకొని నిలబడే ఉంది' (వివేకానందుడు ప్రసంగించిన వేదికపై నిలబడిరాసిన 'వివేకవాక్యం'), 'దారి నీదే/ సంశయం నీదే/ ఫలితమూ నీదే' (టు బి ఆర్ నాట్ టు బి).. ఇలా ఏ ముగింపు తీసుకున్నా మనల్ని ఆవహించి, ఆలోచనాసుడిలో విసిరేసేదే.

విద్యార్థులకు పాఠ్యాంశంగా పెట్టదగిన కవితలు పాపినేని సంపుటాల్లో పుష్కలంగా ఉన్నాయంటే, ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. తప్పక చదివి తీరవలసిన 50 కవితల అద్భుత కావ్యం "రజనీగంధ".

**కవిత**

# అమ్మమ్మల కాలం

**అయినంపూడి శ్రీలక్ష్మి**
**99899 28562**

నేల తల్లికి
తన నుండి పుట్టిన మర్రి చెట్టు కన్నా
మర్రికి పుట్టిన ఊడల పైన్నే ఆరాటం
ఊడలకీ అంతే –
తమని పుట్టించిన చెట్టు కన్నా
చెట్టుని సృష్టించిన నేల పైన్నే మమకారం
నేల అమ్మమ్మ బుగ్గలని ముద్దాడాలని
ఊడ మనవరాల్లు బిరబిరా దిగుతుంటాయి

అమ్మలగన్న యమ్మ అని శ్లోకాలు చదివాం
ఇప్పుడు నిజంగానే ఇది అమ్మమ్మల కాలం
మా అమ్మ– నేను– మా అమ్మాయి ముగ్గురం
ఒకే జీవితానికి మూడు రూపాలం
తరాల అంతరాలను అధిగమించిన
కొనసాగింపులం

అమ్మమ్మకీ –అమ్మాయికీ మధ్య నేను ఓ వారధి
బొడ్డు తాడు తెగే దాకా నా అంతర్భాగం మా
అమ్మాయి
“కేర్” మని అరిచాక, ఇక ‘కేర్’కి మా అమ్మే
సారథి
నా కన్నా, నేను కన్న మా అమ్మాయే
మా అమ్మకిపుడు అపురూపమయింది
అసలు కన్నా కొస రెక్కువనే మాటని నిజం చేసింది

మా అమ్మ నాకెపుడూ బెత్తం పట్టుకోని మాస్టారే
ఆడపిల్ల లక్షణాలని జడలుగా అల్లి
వినయ విధేయతల లోలాకులని చెవులకు కుట్టి
సంస్కారం ఓణీ ని ఒళ్ళంతా చుట్టి
గౌరవ మర్యాదల పట్టీలని కాళ్ళకి పెట్టి
ఆచారాల గాజులని చేతులకు తొడిగి
సంప్రదాయం కాటుకని కళ్ళకు అద్ది
కుటుంబ ప్రతిష్టని తిలకంగా దిద్ది
Do’s and don’ts గురించి ప్రైవేటు చెప్పేది
తలెత్తి చూసినా – నోరెత్తి మాట్లాడినా
పంజాబీ డ్రెస్ పై ముచ్చట పడినా
మన ఇంటా వంటా లేదు పొమ్మని క్లాసులిచ్చేది
నిరంతరం తల్లి కోడిలా మారేది

మా అమ్మంటే ఓ చాదస్తం ….. ఓ చాందసపు “స్త్రీ సూక్తం“!

అమ్మ అమ్మమ్మ అయింది
మా అమ్మాయితో దోస్తీ కట్టింది
థర్డ్ జెనరేషన్ తో పాటు మాడ్రన్ అయింది
మనవరాలు ఏం చేసినా మన ‘వరాలే’ అంటోంది
త్రీ- ఫోర్త్ స్ట్రేచ్ డ్ జీన్స్ కి ఓకే చెపుతోంది
రోడ్డు పక్కన ఛాట్ బండిపై పానీ పూరిని
మనవరాలితో షేర్ చేసుకుంటోంది
లేట్ నైట్ దాకా మేలుకునే ఉంటోంది
సీరియల్స్ కి బై చెప్పి రోడీస్ షో చూస్తోంది
జడ వేసుకోక పోయినా –
జాము పొద్దు ఎక్కే దాకా బెడ్ దిగకపోయినా
మనవరాలు, తనకి వరాలు అంటుంది



ఆఖరికి, మా అమ్మాయి బర్త్ డే పార్టీకి
అబ్బాయిలు వచ్చినా దగ్గరుండి వడ్డిస్తుంది

నా క్లాస్ మేట్ ని నోట్స్ అడిగినందుకే
నా మీద ఉరుమురిమి మెరుపులు
కురిపించిన అమ్మేనా ఈమె
కోడి కూతకు ముందే లేవకపోతే
సూర్యుని ప్రచండ అవతారాన్ని చూపించిన
అమ్మేనా ఈమె

నా తరం పై
తన తరం ఆలోచనలను ప్రవహింపచేసిన అమ్మ
నా కూతురు తరం లోని కొత్త సులోచనాలకు Welcome
చెప్తోంది
నాకు అన్నీ నేర్పించిన అమ్మ
నా కూతురుతో పాటు Update అవుతూ
తనని తాను Upgrade చేసుకుంటూ
మనవరాలికి best friend అయింది
మనవరాలితో తన Lost life ని జీవిస్తోంది

అమ్మమ్మ అంటే new-gen నేస్తం …. ఆమే ఇప్పుడు సమస్తం!

‘అమ్మమ్మనవరాల్ల’ కొత్త బంధమిది
కాలం నుదుటిపై కొత్త సింధూరమిది
బిరబిరా దిగుతున్న ఊడలని గుండెలకి హత్తుకునే
నేల తల్లుల కాలం ఇది
అమ్మమ్మల కాలం ఇది!
*( మా అమ్మకి ప్రేమతో …..)*

## కథ




# మచ్చ లేని చందమామ

– భవానీ ఫణి
**9441555402**

***"ఇవ్వాళ కొత్త డిజీన్ పెట్టు" అంది శైలజ పరికిణీ దగ్గరగా పట్టుకుని పక్కన కూర్చుంటూ. "అయ్యో, నేనింకా "అప్పుడెప్పుడో ఒకప్పుడు" ఏం జరిగిందో చెబుదామనుకున్నానే " అంది సీత గోరింటాకు కొబ్బరి చిప్పలో సర్దుతూ. "అమ్మా, నువ్వెప్పుడూ అంతే. ఆ చందమామ చుక్కలే. కమలత్తయ్య చూడు. పుల్లతో ఎన్ని కొత్త కొత్త డిజీన్లు పెడుతుందో " బుంగమూతి పెట్టింది శైలజ***

"ఒక పని చెయ్యి అయితే. ఈ గోరింటాకు కమలత్తయ్య వాళ్ళింటికి పట్టుకెళ్ళి కొత్త రకంగా నీకు నచ్చినట్టు పెట్టించుకుని రా" సీత గట్టిగా ఉన్న గోరింటాకు ముద్దలో కొద్దిగా నీళ్ళు కలుపుతూ అంది.

"వద్దులే, కథ చెబుతాను అన్నావు గా చెప్పు" శైలజ చెయ్యి ముందుకు చాచింది పెట్టమన్నట్టుగా.

సీత నవ్వుకుంటూ కొద్దిగా గోరింటాకు చేతిలోకి తీసుకుని చెప్పడం మొదలు పెట్టింది.

"అప్పుడెప్పుడో ఒకప్పుడు పగలంతా సూర్యుడు వెలుగు జల్లి వెళ్ళిపోయాక రాత్రిళ్ళు ఆకాశం ఖాళీగా ఉండేది ఇప్పుడు నీ అరచెయ్యి లా, ప్రజలంతా చీకట్లో చాలా ఇబ్బందులు పడేవారు. ఓ సారి వాళ్ళు దేవుడ్ని బాగా ప్రార్థించారు. దేవుడా, సూర్యుడ్ని రాత్రుళ్ళు కూడా ఉంచెయ్యి అని. కానీ అదెలా కుదుర్తుంది? సూర్యుడు రాత్రి విశ్రాంతి తీసుకోవాలి కదా. దేవుడు బాగా ఆలోచించాడు. అప్పుడు దేవుడికి, అదే కృష్ణుడికి, తను చిన్నప్పుడు అమ్మకి తెలీకుండా తిందామని దాచుకున్న మట్టి ముద్దలు గుర్తొచ్చాయి . అంతే, వెంటనే వాటిలో ఒక పెద్ద ముద్ద తీసుకుని గుండ్రంగా చేసి ఆకాశంలో అంటించాడు." అంటూ శైలజ చేతిలో గుండ్రంగా చందమామ పెట్టింది సీత.

"ఇంకా చిన్న చిన్న ముద్దలు తీసుకుని చుట్టూ నక్షత్రాల్ని పెట్టాడు" అంటూ చుట్టూ చుక్కలు పెట్టడం మొదలు పెట్టింది. అంతలోనే మళ్ళీ ఆపి శైలజ ముఖం లోకి చూస్తూ "నీకేమీ అనుమానం రావట్లేదా?" అంది.

ఒక చెయ్యి గెడ్డం కింద పెట్టుకుని, రెండో చెయ్యి మోకాలికి ఆనించి గోరింటాకు పెట్టించుకుంటూ ఎంతో ఆసక్తిగా కథ వింటున్న శైలజ లేదన్నట్టుగా పెదవి విరిచింది.

"నల్లగా ఉండే ఆకాశంలో మట్టి ముద్దలు ఎలా కనిపిస్తాయి? వెలుగెలా వస్తుంది?"

"అవును కదా!" తనకి ఆ ఆలోచన రానందుకు బాధపడింది శైలజ.

"ఆ ... జనం అదే అడిగారు, అప్పుడు దేవుడు నాలిక్కరుచుకుని నెమలి పించం తీసుకుని పక్కనే కుండలో ఉన్న వెన్నలో ముంచి ఆ మట్టి ముద్దకి పూసాడు. అంతే

చందమామ అందంగా తెల్లగా మెరిసిపోతూ వెలుగులు విరజిమ్మడం మొదలు పెట్టింది. ఆ చల్లని వెలుగు మీద పడి నక్షత్రాలేమో ఎర్రగా కందిపోయాయి. అంతే ఇంక అప్పటినించీ రాత్రి కూడా జనమంతా చంద్రుడి వెలుగులో హాయిగా ఉన్నారు." అంటూ కథతో పాటూ చేతి వేళ్ళకి గొడుగులు, ఉంగరాలు పెట్టడం పూర్తి చేసింది. సీత

"సరే, నేను బుజ్జి వాళ్ళింటికి వెళ్తున్నా" లేచి పరిగెత్తబోయింది శైలజ. కూతురి కంగారేమిటో సీతకి తెలుసు. వెంటనే ఈ కథ తన నేస్తాలకి చెప్పెయ్యాలి.

"ఆగాగు" అని కొంచెం గోరింటాకు చేతిలోకి తీసుకుని శైలజ చేతి మీద తిప్పుతూ "దొంగాడా దొంగాడా సరిగ్గా పండక పోతే ముక్కూ చెవులూ కోసి నూతిలో పడేస్తాను" అంటూ చెయ్యి వెనక్కి తిప్పి అక్కడ చిన్న చుక్కలా పెట్టింది.

"సరే, వెళ్తున్నా" అని శైలజ తూనీగలా బయటకి పరుగు తియ్యగానే నూతి పళ్ళెం దగ్గరికి వెళ్లి చేదతో నీళ్ళు తోడుకుని చేతులు కడుక్కుంది. చెయ్యి కమ్మని వాసనేస్తోంది. చిన్నప్పటినుండి సీతకి ఆకాశమన్నా , చందమామన్నా చాలా ఇష్టం ఎర్రగా పండిన గోరింటాకులో వాటిని చూసుకోవడం ఇంకా ఇష్టం అందుకే శైలజ గోరింటాకు పెట్టమన్నప్పుడల్లా చందమామ చుక్కలే పెడుతుంది. శైలజకి అలా నచ్చడం లేదు ఈమధ్య, పెద్దదవుతోందిగా మరి.



సీతకి కథలు చెప్పడం కూడా చాలా సరదా. ఉందుండీ ఒక్కో కల్పన దానంతట అదే మనసులో మెదులుతూ ఉంటుంది. చిన్నతనంలో తను చెప్పే వింత వింత కబుర్లన్నీ తన ఈడు పిల్లలంతా నోరు వెళ్ళబెట్టుకుని వింటుంటే ఆమెకి చాలా గర్వంగా అనిపించేది. "ఇది అత్తగార్ని కథలు చెప్పి బుట్టలో వేసేస్తుంది" అనేది ఆమె బామ్మ. సీత పెదవుల మీద విరక్తి తో కూడిన పల్చని నవ్వు మెరిసి మాయమయింది.

"బాగుంది సంబడం, అది అడగడం, నువ్వు చెయ్యడం, మినప్పప్పు ఎప్పుడు రుబ్బుతావు. ఇక రోలుకి ఆ గోరింటాకు వాసన వదిలి చావదు" అత్తగారి ఉరుము లాంటి మాటలకి ఉలికి పడి ఈ లోకం లోకి వచ్చి పడింది సీత. గబ గబా చేతులు చెంగుకి తుడుచుకుంటూ "లేదత్తయ్యా, ఇప్పుడే కడిగి రుబ్బేస్తాను" అంది

"వెధవ ఆడ మేళం, వెధవ సంత, వెధవ సంత" అని సణుక్కుంటూ లోపలికి వెళ్ళిపోయింది సుందరమ్మ గారు.

సీత మనసు చివుక్కుమంది. కళ్ళలో చివ్వున నీళ్ళు ఎగజిమ్మాయి. శైలజ తర్వాత ఎందుకో ఆమెకి మళ్ళీ పిల్లలు పుట్టలేదు. అసలే అన్నిటికీ అరిచి గొడవ చేసే అత్తగారు, వంశానికి వారసుడ్ని ఇవ్వలేక పోయిందన్న వంకతో మరింత రెచ్చిపోతుంది. బావగారికీ ఇద్దరూ ఆడపిల్లలే కావడంతో ఆవిడకి బాధ మరీ ఎక్కువై అది తన మీద కోపంగా మారిపోతుంది.

ఎంత అలవాటు అయిపోయినా ఆవిడ మాటలకి బాధపడకుండా ఉండలేకపోతోంది సీత . పరధ్యానంగా రుబ్బురోలు పాత్రం కడుగుతుంటే చేతులు ఏదోలా అనిపించాయి. ఏమిటో అర్థం కాక చేతుల వంక చూసుకుంది. గోరింటాకు రుబ్బడం వల్ల ఎర్రగా ఉన్నాయి వేళ్ళు. అక్కడక్కడ ఏదో కొరికినట్టుగా ఉన్నాయి ఎందుకో. ఏదో నీరసంగా కూడా ఉంటోంది ఈ మధ్య. అయినా ఏ పని తప్పుతుంది అనుకుంటూ పనిలో పడింది. శని తన జాతకం లోకి అడుగు పెడుతూ అందించిన మొదటి సూచన ఆమె అప్పుడు అర్థం చేసుకోలేక పోయింది. మరింత బలమైన రెండో సూచన సరిగ్గా నెల రోజుల తర్వాత ఆమెకి అందింది.

తెల్లారితే భోగి పండగ. ఇల్లంతా చుట్టాలతో సందడిగా ఉంది. పట్నం నించి బావగారు, పక్క ఊరి నించి ఆడపడుచు తమ తమ కుటుంబాలతో సహా నాలుగు రోజుల క్రితమే వచ్చేసారు. అప్పటినించీ సీతకి ఊపిరి సలపని పని.

ఆ రాత్రి వంట హడావిడిలో ఉండగా బిలబిల మంటూ వచ్చేసారు పిల్లలు. ఆమెని వీధిలోకి లాక్కుపోయారు.

"అత్తా, మధ్యలో ఆ పెద్ద పద్మాలు ముగ్గు, ఇటువైపేమో సీతాకోక చిలకలు ముగ్గు, అటువైపు చేపలు పెడదాం అనుకుంటున్నాం. బానే ఉంటుందా ?" అంది ఆడపడుచు కూతురు శిరీష, పిల్లలందరిలో కొంచెం పెద్దది కావడం వల్ల వచ్చిన పెద్దరికం చూపిస్తూ.

"బాగుందమ్మా, పెట్టండి" సీత ముగ్గుల పుస్తకంలోకి చూస్తూ అంది.

"పిన్నీ, చుక్కలు నువ్వు పెట్టవా, అమ్మైనా అత్తైనా పెడితే ఈ వీధిలో మొదలు పెడితే ఆ వీధిలోకి పోతాయి." గారాలు పోయింది బావగారి సుపుత్రిక స్వాతి.

"తప్పు అలా అనకూడదు. నేనే పెడతాలే" అని ముగ్గు గిన్నె చేతిలోకి తీసుకుంది సీత ఎవరైనా విన్నారేమో అని భయంగా చుట్టూ చూస్తూ.

చీర కొంగు నడుం చుట్టూ బిగించి, కుచ్చిళ్ళు కొంచెం పైకి దోపి వంగి చుక్కలు పెట్టడం మొదలు పెట్టింది. మాటి మాటికి ఆమె పొడవాటి జడ ముందుకి పడి నేలకి రాసుకోవడం, కొన్ని చుక్కలు చెరిగిపోవడం చూసి చిరాకొచ్చినట్టుంది, ఆడపడుచు కొడుకు చిన్నా ఆమె వెనక్కి వచ్చి జడ కదలకుండా

పట్టుకున్నాడు. కంగారు పడి వెనక్కి తిరిగి చూసిన సీతకి నవ్వొచ్చింది. నవ్వితే వాడు ఉడుక్కుంటాడని నవ్వకుండా ఊరుకుంది.

" అత్తా, ఈ సాలి గబా గబా పెట్టేయ్" అన్నాడు వాడు.

ఓ పక్క ఆడపిల్లలు ముగ్గురూ పేకెట్లలో రంగులు చింపి చిన్న చిన్న గిన్నెల్లో పోసి పట్టుకుని దీర్ఘమైన చర్చలో ఉన్నారు. "ఏమే, రంగులు తెమ్మంటే మావయ్య చూడు ఎంత కొంచెం తెచ్చాడో. ఇప్పుడేం చేద్దాం? ఇవేం సరిపోతాయ్?" అంటోంది శిరీష స్వాతి తో.

"ఏముంది కరణం గారి ఇంటి ముందు సన్నిసుక ఉంది కదా. తెచ్చి కలిపేద్దాం. రంగులూ ఎక్కువవుతాయి. చక్కగా మెరుస్తాయి." దర్పంగా చెప్పింది శైలజ ఎప్పుడో సీత చెప్పిన విషయం గుర్తు తెచ్చుకుని.

సీతకి ఎందుకో చుక్కలు పడటం లేదు. ఎక్కడ పెడుతోందో తెలీడం లేదు. తన చేతులకి ఏమవుతోంది? మాటి మాటికీ తిమ్మిరెక్కి పోతున్నాయి. కాళ్ళ వేళ్ళు కూడా అంతే. ఏ పనీ సరిగ్గా చెయ్యలేకపోతోంది. కళ్ళు మంటలు కూడా ఎక్కువయ్యాయి. ఎలాగో చుక్కలు పెట్టడం పూర్తి చేసింది పంటి బిగువున. లాభం లేదు. ఆచారి గారికి చెప్పి మందడగాలి . ఈ తిమ్మిర్ల బాధ భరించడం కష్టంగా ఉంది అనుకుంటూ లోపలికి నడిచింది ముగ్గు గిన్నె పిల్లల చేతిలో పెట్టి.



"అమ్మా, రేపు నెమళ్ళ ముగ్గు నువ్వే పెట్టాలి, చాలా పెద్దది" వెనక నించి అరిచింది శైలజ.

భోగి, సంక్రాంతి రోజులు ప్రతీ యేడులానే గడిచిపోయినా, ఆ యేటి కనుమ పండుగ మాత్రం సీత జీవితాన్ని తలక్రిందులు చేసింది. ఆ రోజు తెల్లవారుఝామున మూడుగంటలకే లేచి పని మొదలు పెట్టింది. అమ్మవారికి నైవేద్యాలు పెట్టాలి. తోటి కోడలు పైపనులు చక్కబెడుతోంది. సీత వంటంతా పూర్తి చేసి గారెలు కూడా వేసేసింది. ఇక బూర్లొక్కటే మిగిలాయి. ఆ పాటికి పిల్లలు కూడా స్నానాలు చేసి తడి బట్టలు కట్టుకుని సిద్ధమై పోయారు ఉండలు చేస్తామంటూ. శిరీష , శైలజ పెద్దవాళ్ళు కాబట్టి వాళ్ళని మాత్రం రానిచ్చి మిగిలినవాళ్ళకి నచ్చచెప్పి ఆడుకోమని పంపేసింది.

ఆ రోజు ఏం బట్టలు వేసుకోవాలో, రాత్రి రథం ముగ్గు ఎలా పెట్టాలో, రథం ఎవరింటి దగ్గరికి లాగాలో చిన్న గొంతుల్లో చర్చించుకుంటున్నారు పిల్లలిద్దరూ. వాళ్ళు చేస్తున్న ఉండలు తీసుకుని చోవిలో ముంచి నూనెలో వేస్తూ పరధ్యానంగా వాళ్ళ కబుర్లు వింటోంది సీత.

ఒక్క సారిగా మాటలు ఆగిపోయేసరికి తలెత్తి పిల్లల వైపు చూసింది. వాళ్ళు కబుర్లతో పాటు పని కూడా ఆపేసి బూర్లు మూకుడు వైపు ఏదో దయ్యాన్ని చూసినట్టుగా చూస్తున్నారు. సీతకి ఏమీ అర్ధం కాక తల తిప్పి చూసింది. అప్పుడు చూసుకుంది. తన చేతి వేళ్ళన్నీ ఎర్రగా కాలిపోయి ఉన్నాయి. చాలా సార్లు మూకుడు తగిలినట్టుగా, నూనె చిందినట్టుగా! ఆవె ఆశ్చర్యపోయింది. చేతులు ముందుకీ వెనక్కీ తిప్పి చూసుకుంది. అంతగా కాలినా అసలు తనకేమీ తెలీలేదు. అదెలా సాధ్యం! కాలిపోయినా తెలీనంతగా తన చేతులు స్పర్శని కోల్పోయాయా!

సాయంత్రం వచ్చి పరీక్ష చేసిన ఆచారి గారి మాటలకి ఇంట్లో పెద్ద విస్ఫోటనమే జరిగింది.

"అమ్మా, ఇది కుష్టు వ్యాధి అని నా అనుమానం. పెద్దాసుపత్రి కి తీసుకెళ్ళి చూపిస్తే మంచిది" అంటూ ఏవో మాత్రలు ఇచ్చి వెళ్ళిపోయారు.

సీత గుండె పగిలిపోయింది . భూమి అలా అక్కడే బ్రద్దలై అందులో కూరుకుపోతే బాగుండుననిపించింది. దేవుడు తనకి అంత పెద్ద శిక్ష ఎందుకు వేసాడు? తనేం అపరాధం చేసింది? తనకి ఇటువంటి రోగమా! అయిపోయింది. తన జీవితం సర్వనాశనం అయిపోయింది.

ఆమె ఊహించినట్టుగానే సుందరమ్మ గారు వెంటనే చెప్పేసింది కొడుకుతో ''వాళ్ళ అన్నయ్యకి కబురు పెట్టు, వాళ్ళింటికి పంపేద్దాం " అని

మరుసటి రోజంతా సీత తన గదిలోనుంచి బయటకి రాలేదు. అలా పడుకుని ఏడుస్తూనే ఉంది. శైలజ తప్ప ఎవరూ ఆమెని పలకరించలేదు కూడా. సాయంత్రం అన్నగారి మాటలు వినిపిస్తుంటే లేచి కూర్చుంది.

"అత్తయ్యగారూ మీకు తెలుసు. తల్లీ తండ్రీ లేని పిల్ల బాధ్యత నేనే నెత్తిన వేసుకుని ఎలాగో పెళ్లి చేసి పంపించాను. గంపెడు సంసారం. పైగా ఏదో అరకొర పౌరోహిత్యం ... సీతని నాతో ఎలా తీసుకెళ్ళ గలనమ్మా? ఎలాగో మీరే కడుపులో పెట్టుకోండి" అంటున్నాడు

అత్తగారు పెద్ద గొంతుతో మొదలు పెట్టింది. "రోగిష్టి దాన్ని కట్టబెట్టి ఇప్పుడు కడుపులో పెట్టుకోమంటే ఎలాగయ్యా"

సీత ఇక వినలేకపోయింది. ఏడుస్తూ మంచం మీద వాలిపోయింది కొంత సేపు వాదన జరిగాక అన్నగారు వెళ్ళిపోయినట్టున్నాడు ఆమెని కలవనైనా కలవకుండా. సుందరమ్మ గారు ఉగ్ర రూపం దాల్చింది.

"ఒరేయ్, శివా, తక్షణం దాన్ని ఇంట్లోంచి బయటకి పంపు, లేదంటే నేను కాలవలో దిగాల్సి వస్తుంది"

ఆమె భర్త చిన్న గొంతుతో ఏదో సర్ది చెబుతున్నాడు. తల్లి చాటు బిడ్డ పాపం. ఆమె మాటను ఎలా జవదాట గలడు? పది నిమిషాల తర్వాత వచ్చి సీత ఉన్న గది గుమ్మం దగ్గర నిలబడ్డాడు. కనీసం ఆమె వైపు చూడనైనా చూడకుండా చెప్పాడు.

"రేపు ఉదయాన్నే బయలుదేరి కాకినాడ వెళ్తున్నాం హాస్పటల్‌కి. అక్కడ కొన్ని రోజులు ఉండాల్సి వస్తుందేమో, బట్టలు సర్దుకో" హడావిడిగా ఎవరో తరుముతున్నట్టు గా చెప్పేసి వెళ్ళిపోయాడు. ఆమెకి తెలుసు కొన్ని రోజులు అంటే జీవితాంతం అని.

◆◆◆

"హెలో... కెన్ ఐ స్పీక్ టు మిసెస్ వెన్నెలా ప్లీజ్"

"ఎస్ స్పీకింగ్?"

"అమ్మా"

సీత గుండె ఒక్కసారిగా గొంతులోకి వచ్చినట్టయింది. అది శైలజ కదూ.

"అమ్మా, నువ్వే కదూ" ఆ పక్క నుండి ఏడుస్తోంది శైలజ

"చిన్నీ, ఎలా ఉన్నావు తల్లీ" ఆనందంతో గొంతు పూడుకు పోతుంటే అడిగింది సీత.

"బాగున్నానమ్మా, నువ్వెలా ఉన్నావు? వెన్నెల పేరుతో రచనలు చేస్తున్నది నువ్వేనని నాకు ఎప్పుడో తెలుసమ్మా, నీ ప్రతి కథా చదివాను. నీ నెంబర్ తెలుసుకునేసరికి ఇంత టైం పట్టింది" ఉద్వేగంగా మళ్ళీ ఈ క్షణం రాదేమో అన్నట్టుగా చెబుతోంది శైలజ.



నా కథలు నా చిన్నితల్లి గుర్తుపట్టకుండా ఎలా ఉంటుంది? ఆనందం గా అనుకుంది సీత. "ఎలా ఉన్నావు, ఎక్కడున్నావు.? ఇంట్లో అందరూ ఎలా ఉన్నారు ?" వెంట వెంటనే అడిగింది.

ఒక్క క్షణం మాట్లాడలేదు శైలజ.

"అమ్మా, ఇప్పుడు నీకు ఇలా చెప్పచ్చో లేదో నాకు తెలీదు. అయినా చెప్పేస్తున్నాను. నాన్నగారు లాస్ట్ ఇయర్ హార్ట్ అటాక్ తో చనిపోయారమ్మా" బాధగా చెప్పింది.

సీతకి దుఃఖం వచ్చింది. ఆ మనిషి తనని ప్రత్యేకంగా ప్రేమించింది ఏమీ లేదు. అలాగని అన్నేళ్ళు కలిసి కాపురం చేసిన వ్యక్తి ఇక లేరంటే, మెల్లగా చేతి గాజుల వైపు చూసుకుంది. నోట్లోంచి మాట రావడం లేదు.

"అమ్మా, అమ్మా, మాట్లాడమ్మా" అంటోంది శైలజ కంగారుగా అవతలినుంచి.

"చెప్పమ్మా, ఏం చదివావు?ఇప్పుడేం చేస్తున్నావు?" తేరుకుని అడిగింది సీత. తన కన్న కూతుర్ని తనే ఇలా అడగాల్సి రావడం ఏదోలా ఉంది ఆమెకి.

"చదువుకున్నానమ్మా, నువ్వెళ్ళి పోయాక ఏం అర్థం కాక చాలా ఏడ్చాను. నీకు చదువంటే ఎంతిష్టమో నాకు తెలుసు కదా. అందుకే బామ్మ ఎంత వద్దంటున్నా ఇంజనీరింగ్ పూర్తి చేసాను. మంచి జాబ్ కూడా వచ్చింది ఒక ఎం.ఎన్.సి లో."

"మంచిది తల్లీ, వివాహం ?"

"నీకు శ్రీదేవత్తయ్య తెలుసు కదా. బామ్మ వైపు దూరపు బంధువులు . రాజోలు లో ఉంటారు. వాళ్ళ అబ్బాయి కౌశిక్ నేను పని చేస్తున్న కంపెనీ లోనే వర్క్ చేస్తాడు. అతనితోనే నా పెళ్లి జరిగిందమ్మా ప్రస్తుతం కంపెనీ పని మీద యు .ఎస్ లో ఉన్నాము . రెండు నెలల్లో వచ్చేస్తాము వస్తూనే రెక్కలు కట్టుకుని నీ ముందు వాలిపోతాను"

"తప్పకుండా తల్లీ, చాలా సంతోషం, అన్నట్టు మీ బామ్మ ఎలా ఉన్నారు?"

"ఏమీ బాగాలేదమ్మా, నాన్నగారు ఉన్నంత వరకు బాగానే నడిచింది. ఈ ఏడాదిగా ఒంటరిదై పోయింది. పక్కూళ్ళో నే ఉన్నా అత్తయ్య చూడటానికి కూడా రాదు. ఇక పెదనాన్న వాళ్ళు సరే సరి. దూరంగా ఉన్నామన్న వంకతో అసలు పట్టించుకోవడం లేదు. ఈ మధ్యనే టి.బి కూడా వచ్చింది. సరిగా పత్యం కుదరకో, ఏజ్డ్ కావడం వల్లనో తగ్గడం లేదమ్మా, నేను ఇండియా వచ్చాక నా దగ్గరే ఉంచుకుందాం అనుకుంటున్నాను"

ఏళ్ళ తరబడి ఏర్పడిన దూరాన్ని ఒకే సారి అధిగమించాలన్నట్టుగా తల్లీ కూతుళ్ళిద్దరూ కరువుతీరా ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు. చాలా సేపు మాట్లాడుకున్నాక పెట్టలేక పెట్టలేక ఫోన్ పెట్టేసింది శైలజ. తమ ఫొటోస్ మెయిల్ చేస్తానని చెప్పింది.

ఇక ఆ రాత్రి సీత కి నిద్ర పట్టలేదు. పాత జ్ఞాపకాలన్నీ కళ్ళ ముందు కదలసాగాయి. తన భర్త ఆమెని కాకినాడ హాస్పిటల్ లో వదిలేసి వెళ్ళిపోయాడు కొంత డబ్బు కట్టేసి. ఇక అతను తిరిగి రాడని ఆమెకి తెలుసు. బయలుదేరుతున్నప్పుడే అత్తగారు చెప్పేసింది .ఇక జన్మలో తన గుమ్మంలో కాలు పెట్టద్దని.

కొద్ది రోజుల్లోనే ఆమె జబ్బు నయమైపోయింది. హాస్పటల్ విడిచి వెళ్ళాల్సి వచ్చినప్పుడు ఎక్కడికి వెళ్ళాలో ఏం చెయ్యాలో అర్థం కాక తల్లడిల్లింది. ఆ సమయం లో డాక్టర్ వనజ ఆమెని ఆదుకుంది. తన పదేళ్ళ కూతురి ఆలనా పాలనా చూసుకోమంది. తన ఆరోగ్య సమస్య కారణంగా రాలేనని సీత ఎంత చెప్పినా ఆమె వినలేదు. సీత ఇప్పుడు పూర్తిగా ఆరోగ్యవంతురాలనీ, ఏ సమస్యా ఉండదనీ నచ్చజెప్పి తన ఇంటికి తీసుకెళ్ళింది.

చదువు మీద సీతకున్న ఆసక్తి, ఆమె తెలివితేటలూ చూసి ప్రైవేట్ గా డిగ్రీ పూర్తి చేయించింది. ఆమెకి ఒక స్కూల్ లో టీచర్ గా ఉద్యోగం కూడా వేయించింది. కొన్నేళ్ళ తర్వాత వాళ్ళ

## కవిత

# వారసత్వపు నీడలో....

- పాతూరి అన్నపూర్ణ
9490230939



**నా**కు తెలిసి మాతాత తరం
మా నాయిన తరం
నడయాడింది ఈ గోడల మధ్యనే
తాత ఆ మూలనే పండేవాడు
అవ్వ ఈ గదిలోనే పోయింది
భౌతికంగా మనుషులు దూరమైనా
జ్ఞాపకాలు గదులలో నిక్షిప్తమై
వాళ్ళంతా నాతోనే ఉన్నారనిపిస్తుంది
సంకురాత్రికి కొట్టిన సున్నంతో మెరుస్తూ
ఎర్రమట్టితో పట్టీలు పెట్టించుకుని
గుమ్మాలకు కట్టిన మామిడి తోరణాలతో
ఇల్లు పండగకళతో మెరిసిపోయేది
పుష్యమాసపు భోగిమంటల ఎర్రదనం
అమ్మచేతి గోరింటలో కనిపించేది
ముగ్గుల్లో పెట్టిన గొబ్బిళ్ళ అందాలు
దొడ్లో కట్టేసిన గొడ్లరంకెలు
అన్నిటికీ సాక్ష్యంగా నిలచింది
శిధిలమవుతున్న ఈ పెంకుటిల్లు

బిడ్డల చిట్టి చేతుల పిచ్చిగీతలు
అక్షరమాలలై ఆకృతి చెందిననాడు
ఈ ఇంటిగోడలు నల్లబల్లలైనాయి
మేకులకు తగిలించిన ఫోటోలు
పాతబడి పగుళ్ళు తీసినా
పాత తరాలను పదిలం చేశాయి
నా ఇంటిపేరును చాటుతూ
ఇప్పటికీ ముంగిట్లో నీడనిస్తున్నది వేపచెట
ఇల్లంటే నిశ్శబ్దం రాజ్యం చేస్తున్న
అంతస్థుల భవనం కాదు
మమతల మమకారాల పునాదిపై
ప్రేమానురాగాలు ఇటుకలుగా పేర్చి
కట్టుకున్నదే నిజమైన ఇల్లు
నాన్ననాకిచ్చిన వారసత్వపు వృక్షానికి
మళ్ళీ పాదు చేసి ప్రాణం పొయ్యమని
మనసు మరీ మరీ హెచ్చరిస్తున్నది.

---

పాప పెద్దదై, పెద్ద చదువుల నిమిత్తం వేరే సిటీకి వెళ్ళిపోయాక సీతకి ఇంకా వాళ్ళింట్లో ఉండటం భావ్యంగా అనిపించలేదు. డాక్టర్ వనజ అనుమతి తో ఆ ఇంట్లోంచి బయటకి వచ్చేసి కాకినాడ లోనే చిన్న ఇల్లు అద్దెకి తీసుకుని జీవితం వెళ్ళదీస్తోంది. రచయిత్రి గా కూడా మంచి పేరే సంపాదించుకుంది. ముఖ్యంగా మధ్యతరగతి జీవితాన్ని కథా దృశ్యంగా మలచడంలో ఆమె అందెవేసిన చెయ్యి అనిపించుకుంది.

ఈ ఆలోచనలతో సతమతమవుతూ ఎప్పుడో తెల్లవారుఝామున నిద్రపోయిన సీతకి ఒక కల వచ్చింది. కలలో ఓ అందమైన వెన్నెల రాత్రి. తను ఎంతో ముచ్చటగా చందమామ వైపు చూస్తోంది. ఇంతలో ఒక అందాల రాకుమారి, కాదు కాదు చిన్నప్పటి తన శైలజే రాకుమారి లా వచ్చి నవ్వుతూ ఆకాశంలోంచి చందమామని త్రుంచి తన చేతిలో ఉంచింది. సీత సంభ్రమం గా ఆ చందమామ లోకి చూస్తోంది. లోపల వెన్నెల కెరటాలు కెరటాలు గా కదులుతోంది. ఇంతలో ఆ వెన్నెల నదీ ప్రవాహం లా మారిపోయింది. అది తమ ఊరి కాలువలా కనిపిస్తోంది ఇప్పుడు.

అంతలో ఒక ముసలావిడ మెల్లగా నీటిలోకి ప్రవేశిస్తోంది. ఆమె బాగా చిక్కి పోయి ఎముకల ప్రోగు లా ఉంది. ఖళ్ళు ఖళ్ళు మని గట్టి గా దగ్గుతోంది. నడవలేక నడుస్తూ కాలవలోకి వెళ్లి పోతోంది. ఆ ప్రవాహం మధ్యలో తన భర్త నిలబడి మౌనం గా చూస్తున్నాడు. తను మాత్రం ముఖానికి పసుపు రాసుకుంటూ కడిగేసుకుంటూ ఆ ముసలావిడని గమనించనట్టుగా గట్టు మీద కూర్చుని ఉంది. అలా లోపలికి వెళ్లి ఆఖరికి ఆ ముసలామె నీటిలో మునిగిపోయింది.

ఉలికి పడి నిద్ర లేచింది సీత. ఆ ముసలావిడ తన అత్తగారు కదూ. సీత హృదయం జాలితో నిండిపోయింది. పట్టించుకునే వాళ్ళు లేక ఎంత దుర్భరమైన జీవితం గడుపుతూ ఉండి ఉ ంటుందో! ఎంత కాదనుకున్నా ఆమె తన భర్త కి తల్లి. ఆమెని సంరక్షించాల్సిన బాద్యత తనపై ఉంది.

మర్నాడే ఆ ఊరు వెళ్లి అత్తగార్ని తన దగ్గరికి తీసుకుని రావాలని నిర్ణయించుకుంది సీత. ఆమె ఇప్పుడు అగ్ని ప్రవేశం చేస్తూ పరితపించిన అబల కాదు. కారడవుల్లో కంటికీ మింటికీ ఏక ధారగా ఏడ్చిన అభాగ్యురాలు కాదు. మానవత్వం తో పరిమళించే మంచి గంధపు చెక్క. చల్లని వెన్నెలలా కరుణ ని వెదజల్లే మచ్చ లేని చందమామ.

## కవిత

# సౌందర్యం జన్మ రహస్యం...


–మామిడి హరికృష్ణ
9908844222




ఇన్నాళ్ళకి నాకు
నీ జన్మ రహస్యం తెలిసింది..

ఒకానొక రోజు ప్రకృతి దేవతకి విసుగొచ్చింది...
ప్రతి నిత్యం మొక్కల్ని, మొగ్గల్ని, పువ్వుల్ని,
ఆకుల్ని, చెట్లని, చేమ దుంపల్ని సృష్టించి..
ఆరు ఋతువుల ఆతిథ్యానికి అనుగుణంగా నేలని
అలంకరించి..
కొండలని పచ్చని పచ్చికల చీరతో చుట్టి ...
ఎడారి ఇసుక దిబ్బల చెక్కిళ్ళ పై
Xerophyte మొక్కల్ని పూయించి ...
దీవులలో నారి కేళాలని,
సాగర జలాల్లో నాజూకు నాచు మొక్కల్ని,
మైదానం పై వర్ష మేఘాల్ని రప్పించి..
రాళ్ళు – గుట్టలని
చిరు జల్లుల స్నానాలు చేయించి..
ఎండలు కాయించి..
వెన్నెల కురిపించి..
చలి పవనాల్ని గాఢంగా వీయించి..
కొత్త చిగుళ్ళు వేయించి..
సరికొత్త పూతలు పూయించి ..
ఆకులు రాల్పించి...
చెట్టును నగ్న దేహ అస్థి పంజరంగా మార్చి..
ఇలా ప్రతీ క్షణం చేసీ చేసీ
ప్రకృతి దేవతకి విసుగొచ్చింది..
ఎంటీ రొటీన్ లైఫ్ అని
మార్గాంతరం కోసం బాగా ఆలోచించింది..

వెరైటీ గా ఉంటుందని
మానవ రూపం దాల్చుదామని
అనుకుంది..
మానవులలో ఎలాంటి అవతారం
ఎత్తాలా అని
తీవ్రంగా తర్జన భర్జన పడింది..
చివరికి నీ అవతారం ఎత్తింది..

ఇప్పుడు నువ్వు నడిచే ప్రకృతివి..
సహజ సౌందర్యాలు అన్నింటినీ
దేహం నిండా అలంకరించుకున్న
mystic సమ్మోహనానివి..

అందుకే కదా చెలీ..
నిన్ను చూడగానే
నా చిగురాకు మనసు మురిసిపోయింది
తెలి మబ్బు హృదయం తేలి పోయింది
నేల ఆత్మీయత మొలకలేసింది
పూమొగ్గ అనురాగం పరిమళించింది
పైర గాలి మమకారం పరవశించింది
పండు వెన్నెల కాంక్ష కలవరించింది
సముద్ర అలల అభిమానం
పలకరించింది
వేకువ వెలుగుల మోహం
పలవరించింది
వాన చినుకు ఆరాధన వెల్లువెత్తింది..

అందుకే కదా ప్రియతమా..
నిన్ను తాకగానే
నాలో ప్రేమ పుట్టింది..
--- --- ---
ఇన్నేళ్ళకి నాకు
నీపై ప్రేమకు కారణం తెలిసింది....!

# ఈ కల ఇలానే ఉండనీ .....!


– మార్టూరి శ్రీరామ్ ప్రసాద్
9490455599




ఈ కల ఇలానే ఉండనీ
ప్రపంచమంతటినీ
కలలోనన్నా
ఐకమత్యంగా ఉండనీ
ప్రేమ పొంగనీ
శాంతి విరియనీ
స్నేహం కురవనీ
ఆకాంక్షలు సిద్ధించనీ
జాతుల వైరాన్ని విడిచి
పక్కవారిని గౌరవించనీ
ఈ కల ఇలానే ఉండనీ
ఈ నిద్ర చెడనీకు

## విశ్లేషణ

# అమెరికా తెలుగు కథకు 50 ఏళ్ళు



*వేరు వేరు కాలాలలో అమెరికాలోని తెలుగువారి జీవనవిధానం ఎలా కొనసాగిందో తెలుసుకోవడం ఈ కథల ద్వారానే సాధ్యమవుతుంది. అమెరికాలోని తెలుగు కథా రచయిత్రులు అక్కడి సమాజంలోని తమ వారి జీవితాలను శోధించి, ఆ అంశాలనే ఇతివృత్తాలుగా తీసుకొని కథలను సృష్టిస్తున్నారు. అమెరికా లాంటి భిన్న సంస్కృతుల వ్యవస్థలో తమ సంస్కృతిని, తమ భాషను, తమ ప్రత్యేకతను నిలబెట్టుకోవాలనే తాపత్రయంతోను - ఉత్సాహంతోను అక్కడి కథా రచయితలు - రచయిత్రులు కథలను వ్రాస్తున్నారు.*

**- డా॥ తన్నీరు కళ్యాణ్ కుమార్**
**9490776385**

కథలు వ్యక్తుల జీవితానుభవాల్లోంచి పుట్టి, ఆ జీవితాలనే ప్రతిబింబిస్తుంటాయి. అమెరికాంధ్రుల జీవితాలలో తరచుగా తారసపడే పరిస్థితులను, సమస్యలను వాటి పరిష్కారాలను కథలుగా మలచి మనకు అందిస్తున్న అమెరికాంధ్ర తెలుగు కథా రచయితలు అభినందనీయులు. వేరు వేరు కాలాలలో అమెరికాలోని తెలుగువారి జీవనవిధానం ఎలా కొనసాగిందో తెలుసుకోవడం ఈ కథల ద్వారానే సాధ్యమవుతుంది. అమెరికాలోని తెలుగు కథా రచయిత్రులు అక్కడి సమాజంలోని తమ వారి జీవితాలను శోధించి, ఆ అంశాలనే ఇతివృత్తాలుగా తీసుకొని కథలను సృష్టిస్తున్నారు. అమెరికా లాంటి భిన్న సంస్కృతుల వ్యవస్థలో తమ సంస్కృతిని, తమ భాషను, తమ ప్రత్యేకతను నిలబెట్టుకోవాలనే తాపత్రయంతోను-ఉత్సాహంతోను కథలను వ్రాస్తున్నారు. సాహిత్యం కూడా సంస్కృతిలో భాగం కావున అమెరికాలో స్థిరపడినప్పటికీ మాతృభాషలో కథలు, కవితలు వ్రాస్తున్న రచయితలు కూడా అక్కడి తెలుగు సంస్కృతికి ఇతోధికసాయం చేస్తున్నారని చెప్పవచ్చు.

అమెరికాంధ్ర సాహిత్యంలోని కథలన్నీ అమెరికాంధ్రుల జ్ఞాపకాల నుండి, ఆరాటాల నుండి, బెంగల నుంచి, స్పృశించిపోయే అనుభవాల నుండి పుట్టుకొచ్చాయి. ఈ కథలు ప్రస్తుతం తెలుగు గడ్డపై వెలువడుతున్న కథలకు ఇవి భౌతికంగాను, మానసికంగాను భిన్నమైనవి. ఈ కథలలో అధిక భాగం స్త్రీ దృక్పథం నుండి కష్ట సుఖాలను విశదం చేస్తాయి. అమెరికాంధ్ర కథా రచయితలందరూ రచనే వృత్తిగా కలిగినవారు కాదు. అక్కడి రచయితలకిది ప్రవృత్తి మాత్రమే. ఈ రచయితలకు వారు చేసే ఉద్యోగాల ద్వారా రకరకాల వ్యక్తులు పరిచయమవుతుంటారు. అమెరికాంధ్రులు పరాయిగడ్డపై ఎటువంటి సమస్యలను ఎదుర్కొంటున్నారో, వాటిని వారు ఎలా పరిష్కరించుకోగలుగుతున్నారో, ఆయా సమస్యల నుండి బయటపడే దారిలేక ఎలా బలి అవుతున్నారో తెలుసుకొని కూర్చబడిన కథలివి.

అమెరికా తెలుగు కథా పరిణామాన్నే అమెరికా తెలుగు సాహిత్య పరిణామంగా చెప్పవచ్చు. అమెరికాలో తెలుగు కథ పుట్టు పూర్వోత్తర వికాసాలను పరిశీలిస్తే - 1965 ప్రాంతపు తొలిదశలో అమెరికా గడ్డపై కాలుమోపిన తెలుగువారు, ఆ సరికొత్త వ్యవస్థలో సర్దుకుపోలేక విపరీతమైన ఒత్తిళ్ళకులోనై సాహిత్యం జోలికిపోలేదు. కానీ 1970 ప్రాంతంలో ఈ పరిస్థితులు మారి సాహిత్య సృజనకు అనుకూలమైన వాతావరణం ఏర్పడింది. దీంతో అంతకుముందు రచనా వ్యాపకం కలిగిన వారేగాక, కొత్తవారు కూడా కలంపట్టి తమ సంఘర్షణలను కథలుగా మలచడం ఆరంభించారు.

తొలినాళ్ళలో అమెరికాకు వచ్చిన తెలుగువారు వేరు వేరు నగరాలలో స్థిరపడటం వల్ల వీరందరి మధ్య మొదట్లో పెద్దగా సంబంధాలు ఉండేవి కాదు. ఆ తరువాత అక్కడ ఏర్పడిన తెలుగు సంఘాలు ఈ కొరతను తీర్చడంలో ముఖ్య భూమికగా నిలిచాయి. డెబ్బయ్యో దశకంనాటికి అమెరికాకు వచ్చే తెలుగువారి సంఖ్య క్రమంగా పెరగడంతో అక్కడి ముఖ్య నగరాలన్నింటిలోను తెలుగు సంఘాలు ఏర్పడటం, ఆ తరువాత కొంత కాలానికి అచ్చు పత్రికలు కూడా వెలువడ్డాయి. తెలుగు భాషా పత్రిక, మధురవాణి, తెలుగు అమెరికా పత్రికల్లో అక్కడున్న తెలుగు కథకుల కథలు ప్రచురించబడేవి. తొంబయ్యో దశక ప్రారంభంలో వెలువడిన తానా పత్రిక, ఆ తరువాత కొంత కాలానికి అమెరికా భారతి, తెలుగు జ్యోతి, తెలుగు వెలుగు, తెలుగు పలుకు, ఇంద్రధనుస్సు, తెలుగువాణి తదితర పత్రికలు వెలుగుచూశాయి. ఈ పత్రికలన్నీ తెలుగు కథకు అగ్ర తాంబూలాన్ని ఇచ్చాయి.

స్వర్గీయ పులిగండ్ల మల్లిఖార్జునరావు వ్రాసిన 'వాహిని' అమెరికా నుండి వెలువడిన తొలి తెలుగు కథగా చెప్పవచ్చు. ఈ కథ ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ఏప్రిల్ 24, 1964లో ప్రచురించబడింది. ఈ కథా రచయిత కలం పేరు 'ఆర్పియన్'. ఈ కథలోని పాత్రలు భారతీయులవే అయినా, సన్నివేశాలు – వాతావరణం అన్నీ అమెరికావే కావడం విశేషం. ఈ కథలో రచయిత తొలినాళ్ళలో అమెరికాకు వచ్చిన భారతీయుల మనోగతాన్ని చక్కగా ఆవిష్కరించారు. చెరుకూరి రమాదేవి – 'పుట్టిల్లు', కోమలాదేవి – 'పిరికివాడు', కస్తూరి రామకృష్ణరావు – 'యవ్వన కుసుమాలు వాడిపోతే' కథలు తెలుగు భాషా పత్రిక (1970, ఏప్రిల్) ప్రారంభ సంచికలో ప్రచురించబడ్డాయి. ఇవి ఉత్తర అమెరికాలో ప్రచురించబడ్డ తొలి కథలు కావడం విశేషం. ఐతే ఈ కథల్లోని కథా వస్తువు, వాతావరణం ఆంధ్రదేశానికి చెందినవి.

**మొదటి తరం రచయితలు మొదట్లో పుట్టిన గడ్డకు దూరంగా ఉండటం వల్ల ఆ జ్ఞాపకాలు, అనుభూతులను ఒకరితో మరొకరు పంచుకోవాలనుకున్నారు. అందుకు అప్పుడే ఏర్పడిన తెలుగు సంఘాలు, వాటి సావనీర్లు వీరికి ఆలంబనగా నిలిచాయి.**

పెమ్మరాజు వేణుగోపాలరావు, కిడాంబి రఘునాథ్, వేమూరి వెంకటేశ్వరరావు, వంగూరి చిట్టెన్ రాజు, వేలూరి వెంకటేశ్వరరావు, సత్యం మందపాటి, చెరుకూరి రమాదేవి తదితరులు అమెరికాలోని ప్రారంభ కథకులు. మొదటి తరం రచయితలు మొదట్లో పుట్టిన గడ్డకు దూరంగా ఉండటం వల్ల ఆ జ్ఞాపకాలు, అనుభూతులను ఒకరితో మరొకరు పంచుకోవాలనుకున్నారు. అందుకు అప్పుడే ఏర్పడిన తెలుగు సంఘాలు, వాటి సావనీర్లు వీరికి ఆలంబనగా నిలిచాయి.

అందుచేతనే ప్రారంభ అమెరికా తెలుగు కథకుల రచనలో నోస్టాల్జియా భావాలు కన్పిస్తాయి. దాదాపు 25, 30 ఏళ్ళుగా అమెరికాలో ఉంటున్న తొలితరానికి చెందినా ఇప్పటికీ ఆ ప్రపంచం నుండి బైటపడలేకపోతున్నారు. ఈ తరం వాళ్ళు ఏం రాసినా మాతృదేశంతో వాళ్ళ మానసిక సాన్నిహిత్యం కనిపిస్తుంది. ఎన్నో ఏళ్ళ నుండి వీరు భౌతికంగా విదేశంలో వున్నా మాతృదేశపు మూలాల్ని మరిచిపోలేదు. దామరాజు లక్ష్మి, శారదాపూర్ణ శొంఠి లాంటి వాళ్ళు పూర్తిగా మాతృదేశపు జ్ఞాపకాలతో కథలు రాశారు. వేమూరి వెంకటేశ్వరరావు, కిడాంబి రఘునాథ్ కథల్లోను నోస్టాల్జియా భావాలు తొంగి చూస్తుంటాయి.

1990వ సంవత్సరం తరువాత వచ్చిన రెండో తరం కథకుల కథల్లో నోస్టాల్జియా భావాలు కనిపించడం లేదు. కొత్త దేశంలో తమకు ఎదురయ్యే సరికొత్త అనుభవాలను, పాత అనుభవాలను సమన్వయం చేస్తూ, ప్రతి విషయాన్ని కొత్త కళ్ళతో పరిశీలిస్తూ వ్రాసే డయాస్పోరా కథా సాహిత్యం వెలువడటం మొదలయింది. 1998 అట్లాంటాలో జరిగిన ప్రప్రథమ అమెరికా తెలుగు సాహితీ సదస్సు, 2000వ సంవత్సరం చికాగోలో జరిగిన రెండవ అమెరికా తెలుగు సాహితీ సదస్సు ఈ భావాలకు బలాన్నిచ్చాయి.

ఉత్తర అమెరికాలోని తెలుగు రచయితలను ప్రోత్సహించాలనే సంకల్పంతో 1994లో ఆవిర్భవించిన వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా తెలుగుకథకు కొత్త గౌరవాన్ని కలుగజేసింది. ఈ ఫౌండేషన్ కృషితోనే 1995 జులైలో అమెరికా తెలుగు కథానిక – మొదటి సంకలనం వెలుగు చూసింది. అమెరికాలో వెలువడిన మొట్టమొదటి కథా సంకలనం కూడా ఇదే కావడం విశేషం. ఈ ఫౌండేషన్ వారే ఏటేటా కథా పోటీలను నిర్వహించి బహుమతులు ఇవ్వడమే గాక, కథా సంకలనాలుగా కూడా ప్రచురిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ ఫౌండేషన్ వారు 11 కథా సంకలనాలను ప్రచురించారు.

అమెరికాలోని తెలుగు రచయితల సృజనాత్మక శక్తిని వెలికి తీయడంలోను, ఔత్సాహిక కథకులను ప్రోత్సహించి – ఉత్సాహపరచడంలోను ఈ ఫౌండేషన్ గణనీయమైన పాత్రను పోషించింది. పై సంకలనాలతో పాటుగా వేమూరి వెంకటేశ్వరరావు 'కించిత్ భోగే భవిష్యతి', దామరాజు సచ్చిదానందమూర్తి 'మా వూరి కథలు', చిమట కమల 'అమెరికా ఇల్లాలు', వేమూరి వెంకటేశ్వరరావు 'మెటామార్ఫసిస్', పూడిపెద్ది

శేషుశర్మ 'ప్రవాసాంధ్రుల ఆశా కిరణం', శ్యామలాదేవి దశిక 'అమెరికా ఇల్లాలి ముచ్చట్లు', మెడికో శ్యాం 'శ్యామ్ యానా' మొదలైన కథా సంకలనాలను కూడా వంగూరి ఫౌండేషన్ వారు ప్రచురించి కథకులను ప్రోత్సహించారు.

1995 సంవత్సరంలోనే సత్యం మందపాటి 'అమెరికా భేతాళ కథలు' అనే కథా సంపుటి వెలువడింది. 'తెలుగువాడు పైకొస్తున్నాడు – తొక్కేయండి', 'చెట్టు క్రింద చినుకులు', 'గవర్నమెంటాలిటీ కథలు', 'మేడ్ ఇన్ అమెరికా', 'ఎన్నారై కథలు – మరో ఆరు అమెరికా కథలు' మొదలైనవి ఆయన ఇతర కథా సంకలనాలు. ఈ విధంగా కొందరు కథకులు తమ కథా సంకలనాలను తామే ప్రచురించుకొని కథలపై తమకున్న అభిలాషను వ్యక్తపరుస్తున్నారు.

అట్లే ఆరి సీతారామయ్య 'గట్టు తెగిన చెరువు', అక్కినపల్లి సుబ్బారావు 'మనిషి మరక', నిడదవోలు మాలతి 'నిజానికి – ఫెమినిజానికి మధ్య', వేలూరి వేంకటేశ్వరరావు 'ఆ నేల, ఆ నీరు, ఆ గాలి', చింతపల్లి గిరిజా శంకర్ 'కదంబము', గొర్తి సాయి బ్రహ్మానందం 'సరిహద్దు', కన్నెగంటి చంద్ర 'మూడో ముద్రణ', డొక్కా శ్రీనివాస ఫణికుమార్ 'పల్లకీ', 'టేకిటీజీ', నారాయణ స్వామి 'రంగుటద్దాల కిటికీ', కూనపరాజు కుమార్ 'న్యూయార్క్ కథలు', కె.వి.యస్.రామారావు సంపాదకత్వంలో 'ఈ మాట' వెబ్‌సైట్ వారు ప్రచురించిన 'ఈ నేలా.... ఆ గాలీ', కాలిఫోర్నియా తెలుగు సాహితీ సదస్సు వారు గొర్తి సాయి బ్రహ్మానందం సంపాదకత్వంలో ప్రచురించిన 'వెన్నెల్లో హరివిల్లు' తదితర కథా సంకలనాలు అమెరికాలో వెలువడిన ప్రముఖ కథా సంకలనాలు.

సంప్రదాయబద్ధంగా స్వదేశంలో పెరిగి, పెళ్ళి పేరుతో తమ సంస్కృతి సంప్రదాయాలకు – ఆచార వ్యవహారాలకు ఎంతో భిన్నమైన వాతావరణంలోకి అడుగిడిన తెలుగింటి ఆడపడుచుల మనోభావాలను కథల రూపంలోను, కబుర్ల రూపంలోను అందించే ప్రయత్నాన్ని కొంతమంది అమెరికా తెలుగు కథా రచయిత్రులు చేశారు. దశిక శ్యామలాదేవి 'అమెరికా ఇల్లాలి ముచ్చట్లు', చిమట కమల 'అమెరికా ఇల్లాలు' ఈ కోవకు చెందిన కథా సంకలనాలు.

1977 నుండి జరుగుతున్న ద్వైవార్షిక తానా సమావేశాలు, 1991 నుండి జరుగుతున్న ఆటా సమావేశాలు, అమెరికాలోని తెలుగు సంఘాలు ప్రత్యేక సందర్భాలలో ప్రచురిస్తున్న విశేష సంచికలు – సావనీర్లు వీలయినంత వరకు అమెరికాలోని తెలుగు కథకులను ప్రోత్సహిస్తున్నాయి. అమెరికాలోని తెలుగు రచయితలు చాలా మంది తెలుగు దేశపు పత్రికల్లో తమ రచనలను ప్రచురిస్తూ మంచి పేరును తెచ్చుకుంటున్నారు. అట్లే 'ఈ మాట', 'కౌముది', 'సుజనరంజని', 'వాకిలి', 'భువన విజయం', 'సారంగ', 'మాలిక', 'విహంగ' తదితర అంతర్జాల పత్రికల్లోను అమెరికాలోని తెలుగు కథా రచయితలు – రచయిత్రులు ఉత్సాహంగా రచనలు చేస్తూ కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నారు. ఇవనీ కలుపుకుంటే అమెరికాలోని తెలుగు వారు సృష్టించిన సాహిత్యం రాశిపరంగా గణనీయంగానే ఉందని చెప్పవచ్చు.

**1977 నుండి జరుగుతున్న ద్వైవార్షిక తానా సమావేశాలు, 1991 నుండి జరుగుతున్న ఆటా సమావేశాలు, అమెరికాలోని తెలుగు సంఘాలు ప్రత్యేక సందర్భాలలో ప్రచురిస్తున్న విశేష సంచికలు – సావనీర్లు వీలయినంత వరకు అమెరికాలోని తెలుగు కథకులను ప్రోత్సహిస్తున్నాయి. అమెరికాలోని తెలుగు రచయితలు చాలామంది తెలుగుదేశపు పత్రికల్లో తమ రచనలను ప్రచురిస్తూ మంచిపేరును తెచ్చుకుంటున్నారు.**

కథలలోని ఇతివృత్తాలను ఆధారం చేసుకొని అమెరికా తెలుగు కథలను కొన్ని రకాలుగా వర్గీకరించవచ్చును. 1. అమెరికన్ సంస్కృతి పట్ల అవగాహన కలుగజేసే కథలు 2. హాస్య కథలు 3. తరాల సంఘర్షణలను చిత్రించిన కథలు 4. వివాహ సమస్యలను చిత్రించిన కథలు 5. విభిన్న సంస్కృతుల వైవాహిక జీవిత సమస్యలను చిత్రించిన కథలు 6. భార్యభర్తల అనుబంధాలను చిత్రించిన కథలు 7. మధ్య వయస్సు ఒంటరితనానికి పరిష్కారం చూపిన కథలు 8. వృద్ధాప్య సమస్యలను చిత్రించిన కథలు 9. గృహ హింసను చిత్రించిన కథలు 10. అమెరికన్ సంస్కృతిలో మమేకమైన – మమేకం కాని జీవితాలను చిత్రించిన కథలు 11. మాతృభూమి పట్ల మమకారాన్ని వెల్లడించే కథలు 12. సాంస్కృతిక ఔన్నత్యాన్ని వెల్లడించిన కథలు 13. స్వదేశంలోని బంధు ప్రేమలను చిత్రించిన కథలు 14. అమెరికన్ విద్యా విధానం పట్ల అవగాహన కలుగజేసే కథలు 15. పిల్లల పెంపకంలోని సమస్యలను చిత్రించిన కథలు 16. మాతృప్రేమను తెలియజేసే కథలు 17. వ్యక్తుల వ్యక్తిత్వాలను చిత్రించిన కథలు.... తదితరమైనవి.

పులిగండ్ల మల్లిఖార్జునరావు, వంగూరి చిట్టెన్ రాజు, వేమూరి వెంకటేశ్వరరావు, వేలూరి వెంకటేశ్వరరావు, సత్యం మందపాటి, పెమ్మరాజు వేణుగోపాలరావు, ఆరి సీతారామయ్య, కె.వి. గిరిధరరావు, దారా సురేంద్ర, మాచిరాజు వెంకటరత్నం, గొర్తి

సాయిబ్రహ్మానందం, పప్పు శ్యామసుందరరావు, అక్కినపల్లి సుబ్బారావు, గవరసాన సత్యనారాయణ, జె.యు.బి. ప్రసాద్, పుట్టా విప్లవ్, అక్కిరాజు భట్టిప్రోలు, కె.యస్. రామరావు, చింతపల్లి గిరిజాశంకర్, డొక్కా శ్రీనివాస ఫణికుమార్, దామరాజు సచ్చిదానందమూర్తి, ప్రభల శ్రీనివాస్, శశి.కె.బోస్, ఎన్.నారాయణ స్వామి, పులికట్ భాస్కర్, కన్నెగంటి చంద్ర, తాడికొండ శివకుమార శర్మ, వేదుల చిన్న వెంకటచయనులు, వల్లమాని విశ్వనాథ్, పట్టిసపు రామజోగి గంగాధరం, కూనపరాజు కుమార్ తదితరులు అమెరికాలోని ప్రముఖ కథా రచయితలు.

స్రవంతి, పుచ్చా వసంతలక్ష్మీ, పుచ్చా అన్నపూర్ణ, పూడిపెద్ది శేషుశర్మ, నోరి రాధిక, సుధేష్ణ, మాచిరాజు సావిత్రి, చెరుకూరి రమాదేవి, చిమట కమల, మాలెంపాటి ఇందిరా ప్రియదర్శిని, కామేశ్వరి దేవి, లలితా జొన్నాళ్, అదితం నశిని, రెంటాల కల్పన, రాధికాశాస్త్రి, గల్లా అరుణ, యార్లగడ్డ కిమీర, సాయి లక్ష్మీ, రాణీ సంయుక్త, కడప శైలజ, కాళ్ళకూరి సాయిలక్ష్మీ, అయ్యగారి రమామణి, జయుక్ష, కనకదుర్గా, కందికొండ లత, సురంపూడి అనంత పద్మావతి, కృష్ణప్రియ, సునీతా రెడ్డి, దేశభొట్ల ఉమ, కొవ్వలి జ్యోతి, ఆదిరాజు ప్రియ, యస్. విజయ, నిడదవోలు మాలతి, అనంతు శివపార్వతి, సంగసాని జయ, విజయలక్ష్మీ రామకృష్ణన్, కొమరవోలు సరోజ, వేద, ములుకుట్ల గునుపూడి అపర్ణ, దువ్వూరి సుందరశ్రీ, సూర్యదేవర ప్రమీల, సూరంపూడి అనంత పద్మావతి, కోమలాదేవి, పొన్నలూరి పార్వతి, దశిక శ్యామలతాదేవి, కనుపర్తి దీప్తి, వై.దుర్గా.... తదితరులు అమెరికాలోని ప్రముఖ కథా రచయిత్రులు.

**తెలుగు కథా రచయిత్రులలో చాలా మంది అక్కడి తెలుగు వారి జీవనానికి సంబంధించిన కుటుంబిక ఇతివృత్తాలతోనే కథలు వ్రాసారే తప్ప, వర్తమాన సాంఘిక-రాజకీయ-ఆర్థిక విషయాలను స్పృశించినట్లు కనిపించడం లేదు.**

అమెరికా తెలుగు కథల్ని ప్రచురితమైన క్రమంలో పరిశీలిస్తే – మొదటి తరం అమెరికా తెలుగు కథలలో ముఖ్యంగా కనిపించేది కల్చర్ షాక్ కథలు. తర్వాత నెమ్మదిగా అమెరికాలోని తెలుగు కుటుంబాల జీవనానికి సంబంధించిన కథలు రావడం మొదలైనాయి. పిల్లల పెంపకంలో ఉండే ఇబ్బందులు, మారుతున్న భార్య – భర్తల అనుబంధాలు, పిల్లల పెళ్ళిళ్ళ విషయంలో ఎదురౌతున్న అవస్థలు, అమెరికాలో అతిధులతో ఇబ్బందులు, అమెరికా నుండి ఇండియాకి వెళ్ళినప్పుడు కలిగే అనుభవాలు కథా వస్తువులయినాయి. ఆ తరువాత విడాకులు, వృద్ధాప్యం, ఉద్యోగ విరమణ వస్తువులుగా కథలు వచ్చాయి. ఇప్పటికీ వస్తున్నాయి. అమెరికా తెలుగు కథలు చాలా వరకు తెలుగు పాత్రలకు, తెలుగు కుటుంబాలకే పరిమితమైనట్లుగా కనిపిస్తున్నాయి. అమెరికన్ పాత్రలు, అమెరికన్ ప్రపంచం ఈ కథలలో అరుదుగా కనిపిస్తాయి.

అమెరికాలో తెలుగువారు సృజియించినంత సాహిత్యాన్ని అక్కడున్న ఏ ఒక్క ఇతర భారతీయ భాషల వారికీ ఇంతటి సాహిత్య స్పృహ ఉన్న దాఖలాలు కూడా లేవు. ఇది తెలుగు వారి సాహిత్యాభిరుచికి నిదర్శనం. ఇదమిద్ధంగా చెప్పలేం కానీ బహుశా ఉత్తర అమెరికాలో భారతీయులందరి కంటే ముందుగా సాహిత్య సృజనను ఆరంభించింది కూడా తెలుగువారే కావచ్చును.

1960 దశకంలో అమెరికన్ ఇమిగ్రేషను నియమాలలో మార్పులు వచ్చాక, తెలుగువారు అమెరికాకి ఎక్కువగా వెళ్ళడం ప్రారంభం అయింది. ఈ నాలుగైదు దశాబ్దాలలో వీరి జీవితాలలో వచ్చిన మార్పులు అవగాహన చేసుకోవడానికి కావలసిన విషయాలు ఇంకా పూర్తిగా అందుబాటులో లేవు. వీటిని సంగ్రహించి, విశ్లేషించి ప్రకటించే పరిశోధకులు ఇంకా బయలుదేరలేదనే చెప్పాలి. కానీ ఈ కొరతను కొంతవరకు అమెరికా కథా సాహిత్యం తీర్చిందని చెప్పవచ్చు. ఈ అమెరికా తెలుగు వారి జీవిత విశేషాలు, అక్కడి చైతన్యవంతమైన రచయితలకు కథా వస్తువులుగా మారాయి. దైనందిన జీవితాలలోని సమస్యలు, పరిస్థితులు అక్కడి కథలలో ప్రతిబింబించడం సహజమైన విషమయే కాబట్టి అక్కడి వారి జీవితాన్ని గూర్చి తెలుసుకోవాలంటే వారికి అమెరికా కథా సాహిత్యమే ముఖ్య భూమికగా నిలుస్తుందనడంలో ఎలాటి సందేహం లేదు. ఈ రచయితలు సమకాలికుల జీవితానికి మార్గదర్శకులు కూడా కాగలరు.

తెలుగు కథా రచయిత్రులలో చాలా మంది అక్కడి తెలుగు వారి జీవనానికి సంబంధించిన కుటుంబిక ఇతివృత్తాలతోనే కథలు వ్రాసారే తప్ప, వర్తమాన సాంఘిక – రాజకీయ – ఆర్థిక విషయాలను స్పృశించినట్లు కనిపించడం లేదు. నేడు కొత్తగా పుట్టుకొస్తున్న వివాహ వేదికలు, ఆన్ లైన్ మ్యారేజ్ బ్యూరోల వంటి అంశాలను కూడా అమెరికా తెలుగు కథ ఎక్కువగా స్పృశించినట్లు కన్పించడం లేదు. స్వదేశంలోని బంధు ప్రేమలను గూర్చి, విభిన్నమైన వాతావరణంలో తమ పిల్లలను

## కవిత

# ప్రక్కదారి

- ఏ.వి.ఆర్.మూర్తి
9652488342



కొందరు
రహదారులు మూసేసి
ప్రక్కదారులకు
తలుపులు బార్లా తెరిచారు
నిన్న పెట్టిన అర్జీ
నేడే పిండదశకు తీసుకొచ్చారు.

నిరుడెప్పుడో పెట్టిన అర్జీలు
కరుడుగట్టుకు పోయిన
పిండదశగానే ఉంచారు.
సంస్థల స్వరూపాలే మార్చేస్తున్నారు
కంపెనీ లావాదేవీలు, లాభాల దీవులు
గలాబావేదికలుగా మార్చేస్తున్నారు.

చదువులకు చెదలు
క్రీడలకు క్రీనీడలు పట్టిస్తున్నారు.
నిరుపేదలకు నిలువనీడ లేదు
దళారులకు వేలకు వేలు భూములు
కృష్ణార్పణమవుతోంది.

న్యాయకమిటీలు, కమిటీలుగానే
మిగిలాయి
నిన్న కట్టిన కాలువలు
ఇవాళ తిరిగి గంగలో కలిసిపోతున్నాయి.
ప్రాజెక్టుల శిలాఫలకాలు ఏళ్ళకు ఏళ్ళు
మ్యూజియమ్‌లో శిలాక్షరాలుగా
మిగిలిపోతున్నాయి.
ఎవరో ఒకరిద్దరు నిలదీసిన వాళ్ళని
మంచినీళ్ళను సైతం కొనుక్కునే ఊళ్ళకు
బదిలి చేస్తున్నారు
రహదారులు మూసేసి
ప్రక్కదారులు తెరిచారు
రైతుల ప్రక్కటెముకలు విరిచారు.

# నానీలు

- బి. గీతిక
9908063266

కన్నులతోనే అన్నీ
చూడాలని చూడకు.
ఒక్కోసారి..చూద్దం
మనసువంతు..!



గురువు చెప్పేది
పాఠమేలే అనకు.
పిల్లవాడికి అది
జీవిత సారం..!

నిరాశే
శాశ్వతం కాదు.
ఎండిన పూవు
రేపటికి విత్తనమవదూ..!

రాత్రీ పగలూ
పారుతూ శ్రమిస్తుంది.
అయినా.. స్వేదం
రాల్చదేం ప్రవాహం..!

ఊహల్లో ఉంటే,
నిరాకారం.
కాగితాన్ని తాకితే,
అక్షరాకారం..!

---

పెంచడంలో అమెరికాంధ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను గూర్చి తెలిపే కథలు కూడా చాలా తక్కువ సంఖ్యలోనే ఉన్నాయి.

అమెరికా తెలుగు కథల రాశి ఎక్కువగానే వున్నా, వాసి పూర్తిగా సంతృప్తికరంగా లేదనే చెప్పాలి. కథా శిల్పం తెలిసి, ముఖ్యమైన విషయాలపై మంచి కథలు వ్రాసిన కథా రచయితల సంఖ్య తక్కువనే చెప్పాలి. కథ ఎత్తుగడ, ముగింపు, భాష, శైలి వంటి అంశాల పట్ల అమెరికా తెలుగు కథా రచయితలు ఇంకొంత శ్రద్ధ చూపితే మంచి కథలు వెలువడతాయి. ఉపన్యాసాలు, సుదీర్ఘ సంభాషణలు చాలా కథల్లో ఎక్కువగా కన్పిస్తాయి. అనేక కథలు కాలక్షేపానికి బాగానే వున్నా, ఆలోచింపజేసేవి కొన్ని మాత్రమే కన్పిస్తున్నాయి. అమెరికాలో తెలుగు కథా రచయితలు - రచయిత్రులు ఎక్కువ మందే వున్నా, ఎక్కువగా కథలు వ్రాసిన వారు చాలా తక్కువ మందే అని చెప్పవచ్చు. ఒకటో, రెండో కథా రచనలు చేసి చాలా కాలంగా రాయని కథా రచయితలు - రచయిత్రులే ఎక్కువ. అట్లే రచనలు ప్రారంభించిన తొలినాళ్ళలో ఎక్కువ కథలు వ్రాసి, ఆ పిమ్మట స్తబ్ధతగా వున్నవారు ఉన్నారు. స్థానిక సంపాదకులు కూడా కథల ఎంపిక విషయంలోను, రచనల లోటుపాట్లను సవరించడంలోను శ్రద్ధ వహించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ఇంతకు ముందు ఎలా వున్నా, ఈ మధ్య కాలంలో వస్తున్న కొన్ని కథల్లో, ముఖ్యంగా కొత్తగా వ్రాస్తున్న కథకుల వస్తువులోను, శిల్పంలోను వైరుధ్యం చూపాలన్న తపన స్పష్టంగా కన్పిస్తుంది. ఈ రచయితలు తమ కథలపై చర్చలను, విమర్శలను ఆహ్వానించడం ఒక శుభపరిణామం. అమెరికా తెలుగు రచయితలు - రచయిత్రులు కథలు వ్రాయడంలో చూపుతున్న ఆసక్తి, సమకాలీన అమెరికా తెలుగు కథా రచనలపై సమీక్షలు - విమర్శలు - చర్చలు చేయడానికి చూపడం లేదు. రచనలపై ఉత్తమ సమీక్షలు - విమర్శలు ఎంత ఎక్కువగా వెలువడితే, అంత మంచి కథా సాహిత్యం వెలుగు చూస్తుంది.

అమెరికా తెలుగు కథ ఇంకా వస్తుపరంగా, శిల్పపరంగా స్థాయి ఎదగాల్సి వుంది. ముఖ్యంగా రెండు సంస్కృతుల, జీవన క్రమాల సమాగమాన్ని విశ్లేషించి సమన్వయించాల్సిన అవసరం వుంది. ఈ అవకాశాన్ని చక్కగా ఉపయోగించుకొని కథకులు చక్కని కథలల్లుతారని, అమెరికా తెలుగు డయాస్పోరా కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తారని ఆశిద్దాం. అమెరికా తెలుగు, తెలుగు సాహిత్యం దినదిన ప్రవర్ధమానమై వెలుగొందాలని మనసారా కాంక్షిద్దాం.

## కవిత

# హుద్ హుద్ విధ్వంసం

- చిత్రాడ కిషోర్ కుమార్
9866912906

పచ్చదనపు పట్టువస్త్రాలతో అలరారిన విశాఖనగరాన్ని
వాయువిలయం విలవిలలాడించి వివస్త్రగా మార్చేసింది
కళకళలాడుతున్న నగరాన్ని కాలరాత్రులతో కప్పేసింది
అపసవ్యదిశలో సుడుగాలులు చండప్రచండ వేగంతోచుట్టేసి
కకలావికలం చేసి చేదు జ్ఞాపకంగా మిగిల్చింది
ప్రళయాన్ని తలపించిన ఈ హుద్ హుద్ విధ్వంసం!!

---

హోరున వీచే పెరుగాలులు ఉత్తరాంధ్రను ఒణికించి
కుండపోతగా కురిసిన వర్షం ఒడిశాను భయపెటట్టి
సమాచార వ్యవస్థను చిన్నాభిన్నం చేసి
జనజీవనాన్ని అస్తవ్యస్థంగా మార్చి
నగర జీవితాన్ని నిర్మానుష్యంగా చేసేసింది
ప్రళయఘోషతో వచ్చిన ఈ హుద్ హుద్ విధ్వంసం!!

---

నేలకొరిగిన వృక్షాలతో, కుప్పకూలిన చెట్లతో
ఎగిరిపోయిన ఇళ్ళపైకప్పులతో
కొబ్బరితోటల విలవిలలతో
గతి తప్పిన విద్యుత్ స్థంభాలతో
నగరపు రూపురేఖలనే మార్చేసింది
పనిగట్టుకొచ్చిన ఈ హుద్ హుద్ విధ్వంసం !!



---

నీరులేక ప్రజల దాహపుకేకలు
పాలులేక పసిపిల్లలు ఆపసోపాలు
గమ్యం చేరేందుకు పెట్రోల్ కోసం పడిగాపులు
తినేందుకు బియ్యం, కాయగూరల కోసం
గుంపుగుంపులుగా అగచాట్లు
చీకటిని చీల్చే కాంతులు వెదజల్లే విద్యుత్ కోసం
ఎదురుచూపులతో ప్రత్యక్ష నరకం చూసిన
విశాఖ ప్రజల కటకటలు
ఈ.. ఏడురోజులు విధ్వంసపు ఆనవాళ్ళు
హుద్ హుద్ విలయతాండవానికి సాక్షీభూతాలు!!

# దూరమైన అక్షరం

పుష్యమి సాగర్
9032215609

అక్షరం నా నుంచి విడిపోయింది
చెట్టు మీద గా రవాణా అయ్యే పిట్టల్లా
ఎవరో నా ప్రాణాన్ని తోడెస్తునట్టు గా ఉన్నది
కాస్త వాక్యం వాసన చూపించండి .....!!!

రాత్రిళ్ళు వర్షం పడేప్పుడు, వొద్దిక గా ఓ మూల కూర్చొని
నేను, నా గతం సమాంతరం గా పయనిస్తున్నప్పుడు
రాలి పడిన కన్నీటి చుక్కలని పోగు చేసుకొని
కాగితపు దొంతరల్లో వడి వడి గా ఉరుకుతున్నప్పుడు కూడా
నన్ను వీడక వెంట నడిచింది కదు ...!!.

దారి తప్పిన లేగ దూడ మాదిరి
ఆలోచన కు అందక ఊపిరి ఉక్కిరి బిక్కిరి అవుతున్నప్పుడు
కళ్ళ నిండా కలలు పరుచుకొని
అంతులేని సాహిత్యపు పొలం లో పంట పండించాలని
వ్యవసాయం చేస్తున్నప్పుడు కూడా
ఓ హాలికుడై నన్ను నా మనసు ని అతుక్కు పోలేదు ..!!

ఇప్పుడు అక్షరం కొత్తగా నన్ను దూరం పెడుతుంది
అవును, నేను మారిపోయాను కదా....
చప్పట్ల కి , ముఖ స్తుతులకు బానిసను ...

కీర్తి కందూతి బావి లో పడి తిరిగే
కప్పను ...!!

అసూయ జ్వాలల్లో పడి నేను
కాలిపోతున్నప్పుడు
ఎంత గా ఏడ్చిందో కదా
పుస్తకాలని ప్రపంచం మీదికి విసిరేసి
తల ఎగరేసినప్పుడు
వంటి నిండా అహంకారపు మదం
తో కాళ్ళ కింద నలిపేసినపుడు
అక్షరం ఆకాశమంతా ఆవరించుకొని
నన్ను దిగంతాల్లో కి విసిరేసి నా
నుంచి దూరం అయ్యింది ...!!

నేను మరల అక్షరం లా జన్మించాలి
అప్పుడే నాకు నిష్కృతి ...!!



## పరిశీలన

# మరపురాని మంచికలల




ముకుందరామారావు "విడనిముడి" చదివిచూడండి. మన రూపమే ఒక ఊరేగింపుగా తేరిపార చూసుకునేంతలో తటాలున మనల్ని దాటి సాగిపోతూ ఉండే మళ్ళీ మళ్ళీ వెనక్కి వెనక్కి తిరిగి తిరిగి చూసుకోవాలనిపిస్తుంది. ఆ వెదుకులాటను అక్షరాలుగా మార్చిన ముకుందరామారావు కవిత్వంలోంచి కవిత్వానికి కొత్త నిర్వచనాలు పుడతాయి.

- డా. యు.ఏ.నరసింహమూర్తి

**9963421460**

చదవడానికి కళ్ళున్నాయి. ఆలోచనకు మెదడు వుంది. అనుభవించడానికి మనసు ఉంది. రాసే చేతులు ఉన్నాయి. చేతిలో "విడనిముడి" ఉంది. ఈ ముడి ఒకడిది కాదు, ఒక చోటిది కాదు, ఒక కాలానిది కాదు. నా కొడుకు పుట్టినప్పటి నుంచి మా అమ్మ వాడితో 'నేను మళ్ళీ తిరిగి నీ కడుపున పుడతాను'- అంటూ ఉండేది. నా కుర్చీలో ఇంకెవరూ కూర్చోరు. ఇప్పుడు బెంగుళూరు నుండి చుక్క తెగిపడినట్లు, సుడిగాలిలా వచ్చే నా మనుమరాలు నన్ను రెక్కపట్టి కిందకు గుంజి నా కుర్చీలో కాలుమీద కాలు వేసుకొని మరీ కూర్చుని 'నేను నీ అమ్మను' అంటుంది. నేను మా అమ్మ కాళ్ళ దగ్గర కూర్చున్నట్టే ముద్దు మురిపాలు చెల్లించుకుంటూ దాని కాళ్ళ దగ్గర కూర్చుని అది చలాయించే అధికారానికి లోబడి నడుచుకుంటాను. మనం ఆలోచనలో పడ్డప్పుడు ఈదృశ్యం 'సగం కల/ సగం మెలకువ"తో కలగలిసిపోయినట్లు కనిపిస్తుంది. మనిషి ఇంకో ఇంకో అవస్థలో ఉన్నప్పుడు "మగతవీడని కళ్ళ వెనక మసక మసకగా" కదిలే మిగులుకల అనిపిస్తుంది. తాతముత్తాతలు, పెళ్ళాం పిల్లలు, మనమలు, మరికొంచెం ఆగితే వారి పిల్లలు- ఇలా దృష్టి సారిస్తే వీళ్ళందరూ విడనిముడిలో కలగాపులగంగా కలిసిపోయిన కలల జ్ఞాపకాల దారాలలా కనిపిస్తారు. ముకుందరామారావు "విడనిముడి" చదివిచూడండి. మన రూపమే ఒక ఊరేగింపుగా తేరిపార చూసుకునేంతలో తటాలున మనల్ని దాటి సాగిపోతూ ఉండే మళ్ళీ మళ్ళీ వెనక్కి వెనక్కి తిరిగి తిరిగి చూసుకోవాలనిపిస్తుంది. ఆ వెదుకులాటను అక్షరాలుగా మార్చిన ముకుందరామారావు కవిత్వంలోంచి కవిత్వానికి కొత్త నిర్వచనాలు పుడతాయి. అందుకే ఇంద్రగంటి శ్రీకాంతశర్మ "నిశ్శబ్దాన్ని శబ్దాల్లోకి ప్రవేశపెట్టడమే కవిత్వం", "వాక్యాంత నిశ్శబ్దంగా పరిణమించిన అనుభవం అనగదినది వాచ్యార్థాన్ని విడిచిపెట్టేసి - ఒక భావస్ఫురణగా మిగిలితే - అది కవిత్వం" అంటూ కవిత్వానికి రెండు కొత్త నిర్వచనాలను చూపించగలిగారు. నా మట్టుకు నాకు ముకుందరామారావు కవితలతో పాటు స్ఫురించే అరచిత కవితలలోకి, వాక్యాంత నిశ్శబ్దాలలోకి ప్రయాణించినప్పుడు "మరు జన్మకూ మరపురాని మంచి కల కవిత్వం" అనిపిస్తుంది. అంతేకాదు అనుభవానికందిన ఆనందపు ఆక్రోశాన్ని మనకు చవిచూపించారు ముకుందరామారావు.

వేయి పున్నమిల వెలుగులను పిడికిళ్ళలో పట్టుకుని దానిని చీకట్లో కూడా అప్పుడప్పుడు ఒకళ్ళ కళ్ళు ఒకరు మూసుకుని

చీకట్లో పోకలు పోకలుగా పోసి ఒకరు పోసిన పోగులను ఇంకొకరు వెతుక్కుంటూ విసుగు-విరామం లేకుండా వెన్నెలపోక ఆటలాడుకున్న అమ్మ-నాన్నలిద్దరూ తమ ఆటస్థలాన్ని ఇంకొక చోటికి బదలాయించుకొని వారం రోజులు ముందు వెనుకలుగా తనను విడిచి తరలిపోయినప్పుడు కవి ముకుందరామారావు ఏమంటారో చూడండి- 'బహుశా/ముసలితనం/ వాయిదాల మరణం/ ఎవరేమిటో/ లోతుగా తెలుసుకునే సమయం' అన్న వాక్యాలలో ఒక తాత్వికత కంటే ఎడతెగని ఎరుకలో నిలిచిపోయిన ఒక లోతైన అనుభవమే కనిపిస్తుంది. ఆ వాయిదాల మరణంలో కూడా తల్లిదండ్రులిద్దరూ ఎలా ఒకరికొకరు గుట్టుగా తోడునీడగా వుండడానికి కిందుమీదులయినారో ఈ కవి రాసిన "వాళ్ళు లేని ఇల్లు"లో కనిపిస్తుంది. వాకిట్లోని వాలుకుర్చీ, ఎముకల గూడైన యంత్రం అనే రంగులు వెలసిన కలల దారాలు ఎలా విడనిముడిలో ఏకమయాయో తెలుస్తుంది.

'ఆ కుర్చీ/ ఈనాటిదా/ వాళ్ళ నాన్నది/ బహుశా రేపు నాది!' విడని ముడిలో రంగు వెలసిన దారం లోని ఒక పోగుగా, 'ఎంత నడిచినా ఎవరి నడక వారిదే' అన్న నిజాన్ని తెలియజేసే ఈ అనుభవం ప్రతీ వ్యక్తికీ జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు ఎదురుకాక తప్పదు.

ముకుందరామారావు పద్యం పసితనం లాంటిది. "ఏమీ తెలియనితనం నుంచి ఏదో తెలుస్తున్న తనంలోకి ప్రవహిస్తున్న పరిణామం''. జీవితంలోని అన్ని దశలలో కంటే పిల్లల, మనుమలకు చెందిన ఈ పరిణామమో వికాసమో లిప్తలలో, క్షణాలలో జరిగిపోతూ ఉంటుంది. అంత వేగంగానూ వాళ్ళకూ, మనకూ మధ్యన ఉన్న మమతల ముడి బిగిసిపోతూ ఉంటుంది. దానికి బిగియడమే గానీ వదులుకావడం తెలియదు.

'నిన్నో మొన్నో/ ఎత్తుకు తిప్పినట్టున్న/ పాపేనా ఈమె/ అప్పుడే వుదయించిన కళ్ళతో/ సాయంత్రాన్ని చూస్తున్నట్టుంది.' ఈ మాటలలో సుఖమయ జీవితంలో పుట్టి పెరిగే పిల్లల, మనుమల పెరుగుదలకు సంబంధించిన కుటుంబీకుల మైమరపు కనిపిస్తుంది. పిల్లలను సాకడంలో, వారితో ఆటలాడుకోవడంలో ఎప్పుడు పొద్దు పొడిచిందో, ఎప్పుడు పొద్దు గ్రుంకిందో తెలియనంత వేగంగా కాలచక్రం గిరగిరా తిరిగిపోతుంది. అప్పుడు మనల్ని మనం పూర్తిగా కోల్పోయి వాళ్ళ చెప్పుచేతలకు కట్టుబడి లొంగి ఉండడం ఒక వినోదమవుతుంది.

'గుర్తుకొచ్చేదిపుడు/ పిల్లల కంటే/ వారి పిల్లలే/ వారి చేతుల్లో/ ఆటబొమ్మలైపోవటం/ వారి పోటీల్లో/ ఓడిపోవటం/ వారిముందు/ ఏమీ తెలియదనిపించుకోవటం'

అదృష్టం కొద్దీ కొంతమంది పెద్దలకు ఎంత కావాలనుకుంటే అంతగా ఎప్పటికప్పుడు కొత్త కొత్తగా మరల మరలా తటస్థపడుతూ ఉంటుంది. ఇది లేకపోతే దీని కోసం పరితపించే వారి జీవితం ఎడారిగా మారుతుంది. అందుకే ప్రతివారూ ఎక్కడో ఒకచోట, ఏదో ఒక రకంగా ఈ విడనిముడిలో చిక్కుకొని పోవాలని ఆరాటపడుతూ ఉంటారు. ఇదంతా పెద్దల సంగతి. పసిపిల్లల పక్షం నుంచి ఆలోచిస్తే "అందరూ అన్నిచోట్లా వుంటే ఎంత బాగుండును లేదా అదృశ్యంగా అందర్నీ చూడగల్గితే' అంటూ సముద్రాలను దాటి ఎగిరే రెక్కల కోసం, ఆకాశాలను అధిగమించే తిరస్కరిణీ విద్య కోసం వారి అత్యంత సహజమైన ఉబలాటం ముద్దుగొలుపుతూ ఉంటుంది. మానూ-మాకూ, రాయీ-రప్ప అయితే తప్ప మానవమాత్రుడికి ఈ ముడి నుండి విడిపోవడం సాధ్యం కాదు.

విడనిముడులలో కెల్లా పెద్ద ముడి బ్రహ్మముడి. పెళ్ళిలో పురోహితుడు వధూవరుల కొంగులు ముడి వేస్తాడు. ఇది తేలికగా పడే ముడి కాదు. పెళ్ళి మాటలాడేటప్పుడు అటు ఏడు తరాలను, ఇటు ఏడు తరాలను చూస్తారు. పెళ్ళితంతు జరిగేటప్పుడయితే "దశ పూర్వేషాం దశా పరేషాం" అంటూ ఈ సంఖ్య ఇంకా విస్తరిస్తుంది. తంతు ముగియగానే వధువు పుట్టింటి ముడులన్నింటినీ విడిపించుకొని అత్తవారింటి ముడులకే అంకితమైపోవాలని చూసే సంఘం మనది. భారతీయ వధువు తన జీవితంలో అనుభవించే ప్రథమము, ప్రబలము అయిన శిక్ష ఇది. సమాజం ఏ శిక్ష విధించినా వధువు మానసిక కక్ష్యలో రెండు పక్షాల ముడులూ సమతూకంలోనే బిగుసుకుపోతాయనే సత్యంతో పాటు ఆమె మనఃప్రపంచం ఎంతగా విస్తరిస్తుందో చాలా సున్నితంగా స్త్రీవాదుల కంటే సూటిగా చెప్పగలిగిన మృదులభాషి ముకుందరామారావు.

హైకూ సంప్రదాయం పట్ల ముకుందరామారావుకు సహజంగా ఏర్పడిన ప్రేమ ఆయనను ఇటువంటి అభివ్యక్తికి పురిగొల్పి ఉంటుంది. కవి ఇక్కడితో ఆగలేదు. క్రమ క్రమంగా ఆ కులవధువు మనఃప్రపంచపు ఆవర్తాలు ఎంతగా విస్తరిస్తాయో కూడా ప్రదర్శించి గానీ వదలలేదు.

'తన తల్లికిప్పుడు/ మూడు ప్రపంచాలు/ రాను రాను దూరమయే/ రక్తాణువుల కోసం/ ఎన్నెన్ని ప్రపంచాల మధ్య/ ఊగిసలాడుతుందో' ముడి ఇంకా ఇంకా దగ్గరగా బిగుస్తున్న కొద్దీ మహిళ మనసు మరీ మరీ విస్తరించడం ఇక్కడ కనిపించే విరోధాభ్యాసం. కవిత్వంలోని ఇటువంటి గుప్తవిద్యలను

నిరాడంబరంగా ప్రదర్శించగల శక్తి ముకుందరామారావు స్వభావంలో దాగి వుంది...

"ఊరక కృతుల్ రచియింపుమటన్న శక్యమే" అన్నాడొక పెద్దాయన. ఒకాయనే అన్నమాటేమిటి, చాలా మంది అభిప్రాయమదే. ముకుందరామారావు లాంటి కొద్దిమంది మాత్రం కృతులు రాయగలగడంలో వింతేముంది? అంటారు. పాండిత్యం, భావనా ప్రౌఢి, కల్పనాచాతుర్యం, కావ్యశాస్త్ర పరిజ్ఞానం, ఛందస్సు- ఇంకా ఇంకా ఏవేవో తెలిస్తేనే గానీ కవిత్వం రాయడం కుదరదని పూర్వులనేవారు. ఇప్పుడూ అలాంటివాళ్ళు లేకపోలేదు. కాకపోతే వీళ్ళ పరిభాష వేరు. ఆకృతి, అల్లిక, ఇమేజరీ, ఏంబిగ్యువిటీ, అబ్ స్యూరిటీ, మెటఫర్, డికన్‌స్ట్రక్షన్ - ఇలా ఇలా ఏవేవో అవీ ఇవీ కబుర్లు చెప్పి కుర్ర కవులను బెదరగొట్టేస్తూ ఉంటారు. మెదడుకు పదును పెడితేనే గానీ కవిత్వాన్ని కౌగిలించుకోవడం కుదరదనే తత్వం వీరిది. పాండిత్యానికీ, సృజన మార్గానికి మధ్య ఎప్పటికీ ముగియని స్పర్ధ ఒకటుందని గ్రహించని చండశాసనులు వీరు. అదేం చిత్రమో గానీ నాటికీ, నేటికీ చండశాసనుల మనుకునే వారిని బొత్తిగా పట్టించుకోని వాళ్ళ సంఖ్యే ఎక్కువ. వారి దృష్టిలో కవిత్వం రాసే వాళ్ళకు, చదివేవాళ్ళకు మెదడులోని రక్తనాళాలు చిట్లిపోనవసరం లేదు. ఒళ్ళు కొంచెం గగుర్పొడిస్తే చాలు. ఆలకించిన వారికి సొగసు కోర్కెలు వస్తే చాలు. మళ్ళీ, మళ్ళీ జ్ఞాపకమొస్తే చాలు. అలా వచ్చినప్పుడు తనకు తెలియకుండానే నాలుగు చరణాలు గొంతునుండి అలవోకగా బయటకు వస్తే చాలు. ఇందుకోసం పై కుస్తీలన్నీ పట్టవలసిన పనిలేదు.

సహృదయక్షేత్రం సదా కవితావర్షాన్ని కోరుకొంటుంది.

'రా!/ కల్లాపి జల్లో/ కుండపోతో/ నీకోసమే నేనని/ నగ్నంగా పడున్న నేల - అది.' చినుకో, తుంపరో, చిరుజల్లో, జల్లుమీదిజల్లో, ధారలో, కుండపోతో, ఏనుగుతొండాలో ఏదైనా వర్షమే. ఒక్కొక్కరికి ఒక్కొక్క తీరు వర్షం ఇష్టం. నా మట్టుకు నాకు చిరుజల్లుల్లో చేతులు బారచాపి "వానా వానా చల్లప్పా!" అంటూ ఆడుకునే అచ్చమైన ఆహ్లాదాన్నందించే శైశవదశలాంటి కవిత్వపు జల్లంటే ఇష్టం. విడనిముడిలో అటువంటి కవిత్వం కనిపిస్తుంది. అందులో ముకుందరామారావు గుండెభాష పలుకుతుంది. అందుకే ఆయన వాక్యాలలో కొన్ని విషయాలను జ్ఞాపకం చేసి అందులోనే వాక్యాంత విరామాలలోని జ్ఞాపకాలను తెరచి చూసుకోగల తాళంచెవిని ఇచ్చిపోతాడు.

> ***ముడి ఇంకా ఇంకా దగ్గరగా బిగుస్తున్న కొద్దీ మహిళ మనసు మరీ మరీ విస్తరించడం ఇక్కడ కనిపించే విరోధా భ్యాసం. కవిత్వంలోని ఇటువంటి గుప్త విద్యలను నిరాడంబరంగా ప్రదర్శించగల శక్తి ముకుందరామారావు స్వభావంలో దాగి వుంది...***

మొదలు తుద ఏ మాత్రం తెలియని బతుకు నడకలో పిల్లకారు కుర్రకారు కోడెకారు ముదురుకారు నేర్రెకారు ముదిమికారు వంటి వేరు వేరు దశలన్నీ మాత్రం దేనికదిగాను జమిలిగాను కలనేతగాను రంగు రంగుల కలలదారాలై కటిక కలపోతలై విడని ముడిగా ఎలా అల్లుకుపోతాయో ముకుంద రామారావు అచ్చం తన ముచ్చటలుగానే వెలిబుచ్చారు. కానీ కబుర్లు చెప్పినట్లు కాకుండా కవితలుగా చెప్పడం వల్లనో ఏమో ఆ ముచ్చట్లు అందరినీ ఆపాదమస్తకము అలముకున్నాయి. ఒళ్ళంతా పులుముకున్నాయి. ఈ ముడిలోంచి ఒక్క దారాన్నీ వెలికి తీయలేము. పసితనంలో పండు ముసలితనమూ, రాలే పండుటాకులో మొలిచే కొత్త చిగురూ కలలుగా, నిజాలుగా అనుభవంలోకి వస్తూనే వుంటాయి. 'విడనిముడి' కడుపులో ఒక డోలాయాత్ర కొనసాగుతూనే ఉంటుంది. అందులో శబ్దమూ ఉంటుంది, నిశ్శబ్దమూ ఉంటుంది. సంతోష సమారోహాలూ వుంటాయి. విషాద విపర్యాయాలూ ఉంటాయి. కానీ ఆ వెలుగూ చీకటి వెల్లువలా మన మీదవిరుచుకు పడకుండా ముకుందరామారావు కవిత్వం ఏ పంక్తికా పంక్తిలో తనను తాను నిభాయించుకుంటూ ఉంటుంది. ఎంత బాధించినా బయటకు రాని మంచి పద్యాలెన్నో ఈ కవిని బాధిస్తూనే ఉంటాయి. బైరాగి, ముకుందరామారావు వంటి కవులు రాసిన కవితల కంటే వారి అరచిత కవితలే మనకు, వాళ్ళకు మధ్య "విడనిముడులు"గా నిలిచిపోతాయి. ఆ భాషరాని పాటే మనల్ని వింతగా ఆకర్షిస్తూ ఉంటుంది. ముకుందరామారావు అర్థం కావాలంటే ఆయన రచనలన్నీ పూర్తిగా చదవాలి. ఉన్నతశ్రేణి కవిత్వాన్ని అవగాహన చేసుకోవడంలోను అనువదించడంలోను ఆయన సాధించిన విలువలు తెలుసు కోగోరేవారు వారి "నోబెల్ కవిత్వం" అనే పుస్తకాన్ని చదవండి. వివిధ దేశాల కవులను, కవిత్వాలను పరిచయం చేస్తూ ఆయన రాస్తున్న వ్యాసాలు చదవండి.

"వెళ్ళాలని నీకూ లేదు- పంపాలని నాకూ లేదు."

## కవిత

### తిరిగి వెళ్ళేటప్పుడు

- బుర్రా సాయిబాబు
9291291751



వెనుతిరిగి వెళ్ళే ప్రయాణాలు
ఎప్పుడూ తృప్తిగానే ఉండాలి.
కష్టపడు, కళ్ళుతుడు, కళ్ళుతుడుచుకో
ఏదైనా చెయ్!

వెనుతిరిగి బయలుదేరే ప్రయాణాలు ఎప్పుడూ
తృప్తిగానే ఉండాలి
అందరూ చేతులూపుతున్నప్పటి
నిష్క్రమణ చిహ్నాలు
నుదుటి మీది చెమట బిందువులు
తుడుస్తున్నట్లుండాలి!

పెదాల మీద గర్వాన్ని నిలబెటుతున్నట్లుండాలి!
ఉడికి ఉడికి బయట పడ్డ విసురు మాటలు
మూటకట్టి దాచిన మృత దేహాల్లా
ఎప్పుడో ఒకప్పుడు నమ్మకాన్ని పగలగొడతాయి
నామీద ఎంత ఆశపెట్టుకోవచ్చునో అని
నీ కళ్ళ, మాటల గవాక్షాల లోంచి
మనసులోకి చూసి కొలుస్తారు నీవాళ్ళు
నీలో, వాళ్ళని ఎంత లోతుల్లో పాతుకున్నావో
చూస్తారు వారు,
వెనుతిరిగి బయలుదేరేలోపే
వారి విశ్వాస పరీక్షలో వందశాతం
గెలిచి కదలాల్సి ఉంటుంది.
నీ భుజాల పక్కన నిలబడి
హెచ్చు తగ్గుల్ని కొలిచినట్లే,
వారి పాత ఆల్బం లోంచి ఒక నలుపు తెలుపు
చిత్రంలోంచి ఓ మేఘాన్ని లాగి నీమీద కురిపిస్తారు
అప్పటి అద్దాలమేడలోంచే, నీ యద సడిని గమనిస్తారు.
వారి పాదరస పరీక్షలో నువ్వు గెలిచితీరాలి.
వెనుతిరిగి వెళ్ళే ప్రయాణాలు
శుభం కార్డుపడ్డ సినిమా ముగింపుల్లా ఉండకూడదు.
అప్పుడే మొలకెత్తిన విత్తనం లోంచి
చీల్చుకొచ్చిన రెండు పచ్చటి ఆకుల్లా ఉండాలి.

---

### తెలిసినా....

పొద్దుటూరి మాధవీలత
9030573354

*అస్తమించక తప్పదని తెలిసినా*
*భానుడు ఉదయించడం మానేస్తాడా..?*
*చెదపడుతోందని తెలిసినా*
*చెట్టు ఎదగడం మానేస్తుందా...?*
*వెలుగునివ్వలేమని తెలిసినా*
*నక్షత్రాలు మెరుస్తూనే ఉంటాయి*
*కరిగిపోతానని తెలిసినా*
*కొవ్వొత్తి వెలుగుల్ని పంచుతుంది.*
*మాయమై పోతానని తెలిసినా*
*మేఘాలు వర్షిస్తూనే ఉంటాయి!*
*ఆక్రమిస్తారని తెలిసినా*
*అడవులు విస్తరిస్తూనే ఉంటాయి!*
*ఎప్పుడో ఒకప్పుడు*
*వలలో చిక్కుతానని తెలిసినా*
*పక్షి ఎగరడం మానేసిందా...!*



*విరిగి పడతామని తెలిసినా*
*కెరటాలు ఎగిసిపడటం మానవుగా...!*
*కాసేపే అని తెలిసినా*
*హరివిల్లు కనువిందు చేస్తుందిగా...!*
*పలక అక్షరాలను పొదగడం మానేసిందా...!*

---

### వాళ్లు

చింతం ప్రవీణ్
9346886143

బతుకుల బొంతలాంటి
బతుకులు కావచ్చు వాళ్లవి
కానీ
వాళ్ల మనసుకు ఏ చిరుగూ ఉండదు

వాళ్లు
దాచుకోవడానికి స్విస్సులు
దోచుకోవడానికి స్కాంలు
కోరటం లేదు

వాళ్లు
తమ బతుకులో
చందమామ చల్లదనాన్ని కలగనటం
లేదు
మండుతున్న ఆకలి సూర్యుడికి
'పచ్చి పులుసు ముద్ద'...
అంతే చాలంటున్నారు.

కథ

# ఆమె.... తల్లి



– సడ్లపల్లి చిదంబరరెడ్డి
9440073636

**రా**యలసీమలో అదొక మారుమూల గ్రామం. పేరు మిట్టపల్లె. చాల వరకూ అక్కడన్నీ వ్యవసాయ కుటుంబాలే.

అప్పుడు సమయం ఉదయం ఆరుగంటలు కావస్తుంది. ఇళ్ళ వాకిళ్ళన్నీ ఎప్పుడో తెరచుకొన్నాయి. ఇళ్ళ ముందు కోళ్ళు, లేగ దూడలు, శునకాల హడావుడి అప్పుడే మొదలయ్యింది. రాత్రంతా కూడదీసుకొన్న కలల్ని భుజాన వేసుకొని చాలామంది అప్పటికే పొలాల దారిపట్టినట్లున్నారు.

"ఏమి సుబ్బక్కాదినా ఇప్పుడు నిద్రలేసినట్లుందావు? ఇంత పొద్దెక్కినంక ఇండ్లముందర కసువు ఊడిస్తేయట్లమ్మా? కాపుదన మోళ్ళు యంత తొందరగా మేలుకొని ఇంటిపన్లు సేస్తే, సేన్లదగ్గరికి యల్లబారితే కుటుంబాలకి అంత మంచిదవుతుంది. ఊరికి గూడ మేలు జరుగుతుంది.

మా అత్త సచ్చి యా స్వరగంలో వుందో గాని, కోళ్ళకంటే ముందే లేస్తావుండె. గాట్లో పశువులిప్పి, బయటకట్టేసి, పేడ దిబ్బకు మోసి, ఆవుల పాలు పిండి, పెద్దోళ్ళని పిల్లోళ్ళని అందర్నీ – స్వామీ, దేవుడా సీతమ్మ తల్లీ అని దేవాను దేవతల్ని స్మరణ సేసినట్ల పిల్సి నిద్రలేపుతా వుండె. ముఖాలు కడిగించి, సద్దులు కట్టిచ్చి ఎవరి పన్లకి వాళ్ళని పురమా ఇస్తావుండె. రెండు కాళ్ళు ఒగతావబెట్టి నిలబడే రకంగాదు. గాలి ఈసినట్ల, గంగమ్మ తల్లి పరిగెత్తినట్ల పురుసత్తు లేకుండ కష్టం సేసిన పుణ్యాత్మురాలు. ఆయమ్మ సూపిన దార్ని నడువబట్టే ఎవ్వరూ ఏలెత్తి సూపకుండా మా సంసారం గుట్టుగా సాగుతావుంది.

ఇప్పుడు ఆకతలన్నీయాలగానీ పరక్కట్ట నా సేతికిచ్చి రవ్వంత కాఫీ సెయ్యిపోమ్మా, నాలుక పిడుసగట్టుకుపొయ్యింది" అని గుక్కతిప్పుకోకుండా మాట్లాడిన సీతమ్మ భుజంమీది తన చీరకొంగును నడుం మీద నుంచి ముందుకు లాగి బొడ్లోదోపి వంగి బిరబిరా కసుపు చిమ్మసాగింది.

సీతమ్మ వయస్సు యాభైకి అటు ఇటుగా ఉంటుంది. నుదిటి నిండా తావి పొద్దు వంటి ఎర్రటి కుంకుమబొట్టుతో నిండు ముత్తయిదువలా కళకళ లాడుతూ వుంటుంది. ఏమాత్రం అలసటగాని, చీకు చింతల వంటి మానసిక దౌర్బల్యాలుగాని కనిపించక, చూసే ప్రతి ఒక్కరికీ గౌరవించదగ్గ మహిళగా అనిపిస్తుంది.

ఆమె మాటలకు ఏమాత్రం బదులు పలక్కుండానే లోపలికెళ్ళింది సుబ్బక్క. కాఫీ చేసి తెచ్చింది. జారిపోతున్న చీపురుకట్ట ఊచలను అరచేతికి తాటిస్తూ సరిచేసి గోడవారగా

ఉంచి కాఫీ అందుకొంది. తూర్పుకు తిరిగి కళ్ళుమూసి సూర్యునికి దండం పెట్టుకొంది. కుడి చేతివేళ్ళు రెండు కాఫీలో అద్ది రెండు చుక్కలు నైవేద్యం మాదిరి భూమి తల్లికి సమర్పించింది. నిధానంగా గుక్కెడు గుక్కెడు చప్పరిస్తూ శక్తిని నింపుకొనే పనిలో అంతర్లీనమైనట్లు తనలోతాను అనుభూతి చెందసాగింది.

సుబ్బమ్మ ఇంట్లోకెళ్ళి వంట పనిలో మునిగిపోయింది. అంతలో కాఫీ తాగడం ముగించిన సీతమ్మ, ఆరు బయట కుడిత దగ్గరున్న బానలోని నీటితో శుభ్రంగా కడిగి గ్లాసును లోపలికి తెచ్చింది.

"ఇది గౌమ్మా వదినా గ్లాసు ఈ అరుగుమీద పెడతావుండాను. లోపల పెట్టుకోమ్మా. ఈ కాలంలో ఏద్దైనా మన దగ్గరున్నంత వరకే మనది. సెయ్యిదాటినంక దేశం దాటినట్లే. పరాయి సొమ్ములు తినే శానామంది పంతలు (రాబందులు) మాదిరి ఎదురుసూస్తా వుంటారు. బయట పడేసిన ఒక కట్టిపుల్లను గూడా బతకనీరు పాడు జనాలు. ఈ శద్ధకాలము యప్పుడు అంతమయ్యి మంచికాలం మొదలవుతుందో నమ్మా?!'' అని తనలో తాను అనుకొంటున్నట్లు బయటికొచ్చి పక్కవీధికి నడిచింది.



◆◆◆

కొండయ్య వక్కా ఆకూ నములూ్త, కాఫీ ఫ్లాస్కు కుడిచేత్తో పట్టుకొని, ఎడమచేత్తో భుజం మీది తువ్వాలు సరిచేసుకొంటు ఇంట్లో నుండి బయటికొస్తున్నాడు. వయస్సు అరవై దాకా వుంటుంది.

సీతమ్మ తన్తో మాటలు కలుపుతూ "ఏం తిమ్మయ్య బావా చేని దగ్గరికి యల్ల బారినట్లున్నావు. ఎగువ నేల్లో ఏం పంట పెడ్తావుండారు" అని అడిగింది.

తిమ్మయ్య నములుతున్న వక్కాకు నోటిని పైకెత్తి "ఏం పంటలు పెట్టల్నో తియ్యమ్మ. ఇప్పుడు జూస్తే రేట్లు ఆకాశానికి తాకినట్లుంటాయి. ఆశపడి ఆత్రమాత్రంగా సాగుజేస్తే- కల్లంలో గింజలు సేరేటయాన్కి, అన్నీ అగ్గిబడిపోతాయి. కడాకి కూలి గూడా గిట్టుబాటు కాదు. ఏంజేస్తాం పూర్వజన్మలో మనం ఏమిసేయరాని సెడ్డపన్లు సేసిండామో ఇప్పుడు రైతులై పుట్టి శిక్ష అనుభోగంసేస్తావుండాము. అందుకే తాతల తండ్రుల్నుంచి ఒచ్చిండే భూమిని పాడుబెట్టకుంట మొక్కజొన్న గింజలు నాటుతా వుండాము" అని అంటూ పొలం దారి పట్టాడు.

అతన్ని అనుసరిస్తూనే సీతమ్మ "ఊను బావా నీ తమ్ముడు గూడా దుక్కిదున్ని పెట్టిండాడు. నాకేమో ఈ ముసుగు జొన్నలు, సెరకు తోట్లు ఏమీ ఇష్టముండదు. మీ మగోళ్ళకెప్పుడూ ఒగేసారి షావుకార్లుగా వల్ల అనే ఆలోశన్లుంటాయి. కూకోని పండుకొందామనుకోరు. సాప ఉన్నంత వరకే కాళ్ళు సాపుకొందాము అనే తత్వము కాదు. ఏటికాలవల కింద రైతుల మాదిరి ఎగబడతారు. కడాకి 'బాయిలో బండబడె, కర్రెద్దు మూలబడె యావేస్తివి యంగటరెడ్డి సెరకు తోట' అని అందరి నోళ్ళలో నగుబాట్లవుతారు. ఈ పంటలు పెట్టే తవుడు ఆడమనిషిని ఒగమాట అడగరు! సంసారం ఇగ్గలాడేది ఆడ మనిషేగదరా అని మనసులో గూడ అనుకోరు.

ఇప్పుడు సూడు మిట్టకయ్యన్ని బాగా దున్ని పెడా కాలువ సేసిండారు. రెండు తీర్లు మిరపసెట్లు, రెండు తీర్లు వంకాయి పైర్లు నాటి మిగిలిన దాంట్లో ఆక్కూర్లు తరకారీ దినుసులు నాటితే యంత బాగుంటుంది. ఈ కాలంలో తిండిగింజల కన్న తరకారీకే గిరాకీ శానా వుంటుంది. రెండు తడుపులు పారి ఇంకా ఫింజెలు ఏస్తా వున్నట్లే సేతులమిందే బాసుకుపోతారు.

ఇట్ల సెప్పితే గంగెద్దుమాదిరి తలకాయ ఊపుతాడు, కడాకి మారెడ్డి మనసులో ఏమనుకొంటే ఆ పంటే పెడతాడు. నువ్వన్నా బుద్ధిమాటలు సెప్పు బావా" అని ప్రాధేయపడినట్లు చెప్పసాగింది సీతమ్మ.

అంతలో పొలం నుంచి ఎదురొస్తున్న ఫక్రుద్దీన్‌ను చూసి అక్కడే నిలబడి- "ఔను లేమ్మా నువ్వు సెప్పింది బాగుంది పక్కీర్ రెడ్డికి చెప్పి ఆ పంటలే పెట్టమంటాను" అని సముదాయించసాగాడు.

దగ్గరగా వచ్చిన ఫక్రుద్దీన్‌తో కొండయ్య "ఏమప్పా పకుర్దీనా ఇంత బిరీన సేన్ల దగ్గరికి ఎళ్ళుస్తా వుండావు. ఇంతకీ ఏం పన్లు సేస్తావుండారప్పా?" అన్నాడు.

ఫక్రుద్దీన్ ఇరవై ఏళ్ళయువకుడు. ఈ మధ్యనే కళాశాల చదువు ముగించి ఉద్యోగాల వేటలో ఉన్నాడు. వాళ్ళ నాన్నపేరు పీరూసాబ్. చాలా ఏళ్ళ కిందట పొట్ట చేత్తో పట్టుకొని ఆ ఊరికొచ్చాడు. నాయుడప్పగారి వసారాలో మిషన్ పెట్టుకొని దర్జీపని మొదలుపెట్టాడు. మంచి పనిమంతుడిగా, చెప్పిన సమయానికి బట్టలుకుట్టే నమ్మకస్తుడిలా పేరు సంపాదించాడు.

అతని భార్య నూర్జహాన్. ఉదయాన్నే ప్రతి ఇంటికీ పూల బుట్టె తిరిగేది. బంధుత్వాల మాటలతో, ఆడవాళ్ళందర్నీ ఆత్మీయ తీగలా అల్లుకుపోయింది. పండుగలు పబ్బాలకు పొదుగాటి చెక్కపలక మీద గోధుమ పిండితో రుద్ది సేమ్యాలు తయారుచేసి ఇచ్చేది. ఆడపిల్లలకు అల్లికలు నేర్పడం, చేతులకు గోరింటాకు పూయడం చేసేది.

చిన్న చిన్న గడ్డిపరకా, పత్తిపోగులూ ఏరి ఊరపిచ్చుక వీధి వసారాల్లో వెచ్చనిగూడు అల్లుకొన్నట్లు ఇల్లుకట్టుకొని, కొంత భూమి సంపాదించుకొన్నారు. మొదటి కాన్పుల్లో పుట్టిన ఇద్దరు ఆడ బిడ్డలనూ అంతో ఇంతో చదివించి మంచి సంబంధాలు వెదికి పెళ్ళి చేశారు.

చివరి వాడయిన ఫకృద్దీన్ చదువు ముగించి ఉద్యోగ ప్రయత్నం చేస్తూనే నాన్నకు వ్యవసాయంలోను, కుట్టు పనిలోను సహాయపడ్తున్నాడు.



ఫకృద్దీన్ కొండయ్యకు వినయంగా నమస్కారం చేసి "పనులేమీ లేవు పెద్దయ్యా. బోరింగు చేని కింద వేరుశెనగ పంటుంది. ఊడలుదిగి గింజ బలుస్తావుంది. అడవి పందుల బెడద ఎంత ఘోరంగా వుందో మీకు తెలియంది కాదు. అందుకే వారం నుండి రాత్రిపూట కాపలా వెళ్తున్నాను" అన్నాడు.

కొండయ్య ముఖంలో మెచ్చుకోలు ఆనందంగాతొంగి చూసింది. "నీది శానా మంచి బుద్ధిరా కొడకా! పని దొంగవు కాదు కాబట్టి నువ్వు కోరిన కొలువు నీ కాళ్ళ దగ్గరికి ఎదుక్కొనొస్తుంది", అని అంటు– "ఈ సీతమ్మ పెద్దమ్మని ఇంటి దాకా పిల్చుకుపోప్పా" అన్నాడు.

"అది నువ్వు చెప్పాల్నా పెద్దయ్యా! నాకు మా అమ్మ ఎంతో ఈ పెద్దమ్మ కూడా అంతే కదా!" అని ఆప్యాయంగా ఆమె చేయిపట్టుకొని గ్రామంవైపు నడకసాగించాడు.

ఫకృద్దీన్‌తో మాటలు కలిపి సాగిపోతున్న ఆమెను అలాగే చూస్తూ బరువుగా నిట్టూరుస్తూ కొంతసేపు నిలబడిపోయాడు తిమ్మయ్య.

ఫకృద్దీన్‌తో మాట్లాడుతూ సీతమ్మ "ఏమప్పా సన్నోడా నీ కింకా కొలువు సిక్కలేదా? మా పిల్లోనికి ఇట్ల సదువయిపోతా ఉన్నట్లే అట్ల ఉద్యోగం దొరికిందంటే– అదంతా పైనుండే దేవుని ఆశీర్వాదం. కిందుండే భూమమ్మ సలవ. మా పిల్లోనికి ఒగ శుద్ధబుద్దిగాని, సిల్లర తిరుగుళ్ళుగాని లేవు. నెలజీతం సేతికొస్తూనే, రవంత ఖర్చులకుంచుకొని వాళ్ళనాయనకి పంపిస్తాడు.

వాళ్ళ నాయనగూడా ఆ దుడ్లు ముట్టుకోడు. కూతురుకు మంచి మొగుణ్ణి తేవల్ల అని బ్యాంకులో దాచిపెడ్తా వుండాడు" అని చెప్పసాగింది.

అంతలో ఇల్లు రావడంతో సీతమ్మ వరండాలోని కుర్చీ మీద కూర్చొంది. ఫకృద్దీన్ లోపలికి వెళ్ళాడు.

నూర్జహాన్ బీ చెంబుతో నీళ్ళుతెచ్చి సుబ్బమ్మకిస్తూ "అక్కా ముఖము చేతులు కడుక్కో అన్నం తిందువు'' అని పురమాయించింది.

"అవును బువ్వమ్మక్కో ఆకలైతా వుంది. నాకీ నడుమ శానా మరుపురోగమొచ్చింది. పొద్దున అటకనిండా అన్నం, గిన్ని నిండా శెనిగల పులుసు సేస్తినో! పాప పెండ్లి గుర్తొచ్చి తినేదే మర్సిండాను. సేసింది సేసినట్లే గంపకు నింపి సేని దగ్గరికి పంపిచ్చిండాను''. అని తనకు తానే చెబుతున్నట్లు గొణుక్కొంటూ ముఖమూ చేతులూ కడుక్కొచ్చి హాల్లో కూర్చొంది.

ఆయింట్లో అయిదారుమంది ఉన్నారు. అరమరికలు లేకుండా అందరూ ఆమెను పలకరిస్తూ కొసరికొసరి వడ్డించారు.

అంతలో పొరుగు వీధి నుండి ఒక అమ్మాయి వచ్చింది. ఆమెకు పెళ్ళి కుదిరింది. బట్టల డిజైన్ గురించి అడగడానికి ముంతాజ్‌తో పనుంది.

ఆమెను చూస్తూనే సీతమ్మ ఆనందంతో పొంగిపోయింది. ఆప్యాయంగా దగ్గరికెళ్ళి రెండు చెంపల్నీ ప్రేమతో తడిమి "ఇట్లనే నిండు నూరేళ్ళూ బతుకు బిడ్డా' అని దీవించి చేతులను పెదాల దగ్గరకు తీసుకొని ముద్దుపెట్టుకొంది.

ఆ అమ్మాయి ఏమీ మాట్లాడలేదు. ఆమె అనురాగాన్ని, వాత్సల్యాన్ని భరించనట్లు మూగగా ఆనంద భాష్పాలు రాల్చింది.

అవి ఏవీ గ్రహించలేని సీతమ్మ మాటలు మొదలుపెట్టింది. "పెండ్లికి సొమ్ములన్నీ చేయించి నారా? చీరలు కొనేసి నారా? మా అమ్మాయి పెండ్లికయితే సొమ్ముల బదనాం లేదమ్మా, మా అత్తమ్మ సొమ్ములు పాతకాలంవి కాసులదండ, జుమికీలు, నాగరబిళ్ళ, ఉంగరాలు, కమ్మలు అన్నీ ఉండవి. అవిట్ని సితగొట్టి

ఈ కాలానికి తగ్గట్టు సేపిస్తే చాలు...” అని చెబుతూ ఉన్నట్లే గోడమీద గడియారం గంటమోగింది.

ఆ శబ్దం వింటూనే ఆమె ఏదో గుర్తొచ్చినట్లు లేచి నిలబడింది. “అప్పుడే నడినెత్తిమీదికి పొద్దొచ్చినట్లుంది. మా రెడ్డి ఇంటికొచ్చేయాళయింది పొయ్యొస్తానమ్మా...'' అని బయలుదేరింది.

బిరబిరా వెళ్ళే ఆమెను అక్కడి వారంతా నిలువుగుడ్లేసుకొని చూస్తుండిపోయారు. హృదయాలు బద్ధలయి పొంగుకొని వచ్చే వేడి నిట్టూర్పుల్ని, కాళ్ళ నుంచి అప్రయత్నంగా కారే కన్నీటి ధారలతో చల్లార్చుకోలేక తమను తాము సమదాయించుకొంటున్నారు. ఆమె స్థితికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్లు నిలబడిపోయారు.

ఔను మరి! అంతకు మించి ఎవరూ ఏమీ చేయలేని దుర్భర దయనీయ పరిస్థితి ఆమెది!!

◆◆◆

ఆమె భర్త పక్కీర్‌రెడ్డి ఐదెకరాల ఆసామి. గతంలో రెండేళ్ళకో మూడేళ్ళకో అడపా దడపా పడేఏఏఏ చినుకులతో, వర్షాధార పంటలు పండిస్తూ లక్షల డబ్బులు వెనక్కేసుకోలేకపోయినా మెల్లగా... జీవితానికి ఏలోటూ రానీకుండా బతుకు బండి సాగించేవాడు.



బావుల తవ్వకం పోయి బోరింగు యంత్రాలు అందుబాటుకు వస్తూనే, మెట్టనంతా మాగాణిగా మార్చాలనే ఆశ పుట్టుకొచ్చింది. అప్పులు చేసి పాతాళానికి గొట్టపు బావులు దించి సాగు మొదలు పెట్టాడు. పెట్టిన పంట చేతికంద కుండానే బోరింగులు ఎండి పోయాయి. వాస్తు స్వాముల్ని పిలిచి, పుల్ల తిరుగుడుతో జలధారల గమనం చెప్పేవారితో చర్చించి మరికొన్ని చోట్ల తవ్వించాడు. వేసిన ప్రతిచోటా అరకొర నీళ్ల పడి అర్ధాంతరంగా ఆగిపోసాగాయి. చేసిన అప్పులు, వడ్డీలు తడిసి మోపెడయ్యింకాని ఒక్క పంటకూడా పూర్తిగా పండించలేకపోయాడు.

ఈ అవిశ్రాంతి వ్యవసాయ యాగంలో పడి కాలేజీలో చదివే కొడుకును గురించి పట్టించుకోలేదు. వాడి అవసరాలయిన ఫీజులు, పుస్తకాలు, వసతుల గురించి మరిచేపోయాడు.

వాడు మెల్లగా పిల్లముఠాల్లో చేరి ఫ్రాక్షనిజం ఒంటబట్టించుకున్నాడు. చదువు మధ్యలోనే మానేసినాడు. దారితప్పి దారంతెగిన గాలిపటమై గాలివాటుకు కొట్టుకు పోయాడు. కొన్నాళ్ళు ఎవరికంటా పడకుండా ఎటో వెళ్ళిపోయాడు. మరి కొన్నాళ్ళు రాత్రివేళల్లో మాత్రమే వచ్చి అమ్మానాన్నలను పలకరించి వెళ్ళేవాడు. క్రమంగా ఆ గ్రామానికి రావడమే మానుకొన్నాడు. ఎక్కడున్నాడో ఏం చేస్తున్నాడో కూడా తెలీదు.

ఇంటర్ చదివే కూతురు. రోజూ ఇరవై కిలోమీటర్ల దూరంలోని పట్నానికి ఆటోలో వెళ్ళివచ్చేది. ఈ కాలం ఆడపిల్లల అవసరాలు, వారి జీవన శైలిని గమనించే సమయం, సర్దిచెప్పే ఇంగితం వారికి లేకపోయింది. ఇరవైనాలుగ్గంటలూ పంటలు, తెగుళ్ళు, నీళ్ళు, అప్పులు, కరువులు వగైరా ఈతిబాధలతో పోరాటం చేయడానికే సమయం సరిపోవడం లేదు.

ఫలితంగా ఆమె కొత్త కొత్త సినిమాలు చూపించే, సరికొత్త సెల్‌ఫోన్లు కొనిపెట్టే ఆటోడ్రయివర్‌తో జతకట్టి ఇంటి నుండి వెళ్ళిపోయింది.

కొడుకు కనిపించకపోయినా పట్టించుకోని పక్కీర్‌రెడ్డి కూతురు కనిపించకపోవడంతో కలవరపడినట్లు కళ్ళు తెరిచాడు. నడికట్ల మీద నిలబడి ఎంతో ఎత్తులో ఉన్నట్లు భ్రమపడుతున్నవాడు వాస్తవాల నేల మీదికి దిగాడు. ఊరూరా గాలించాడు. ఆ చూకీ లభించలేదు. హైదరాబాదులో ఫలానా చోట ఉన్నట్లు ఎవరో చెబితే వెళ్ళి నెలరోజులపాటు గల్లీ గల్లీ గాలించి ఉసూరని తిరిగివచ్చాడు. తెల్లారేసరికి శవమై నట్టింటి దూలానికి వేలాడాడు.

కూతుర్ని వెంటబెట్టుకొస్తాడని ఒళ్ళంతా కళ్ళుచేసి ఎదురుచూసిన సీతమ్మ భయంకరమైన వాస్తవాన్ని జీర్ణించుకోలేక పిచ్చిదయిపోయింది.

అందుకే ఆమె మాట్లాడుతున్నంత సేపూ ఆ ఊళ్ళో ఎవరూ ఎదురుచెప్పరు. ఓపిగ్గా వింటారు. అవసరమైతే ఓదార్చడానికి ప్రయత్నిస్తారు. తామున్నామని భరోసా ఇస్తారు.

ఏ ఇంటికి వెళ్ళినా తమ ఆడబిడ్డ వచ్చినట్లు మర్యాదలు చేస్తారు. ఏ లోటూ రానీక చూస్తారు. వెళ్ళినాక ఆ తల్లి తల్లడింపులు తలచుకొని కన్నీరై కారిపోతుంటారు.

## కవిత

# అన్నదాత


- మేరెడ్డి యాదగిరిరెడ్డి
9949415796


అతడు
కష్టాన్ని నమ్ముకున్నవాడు
అందరికి కావలసినవాడు
అందరి ఆకలి తీర్చేవాడు
అతనికి మేడలు మిద్దెలు లేవు
ఏడంతస్తుల బంగళాలు లేవు
కార్లు లేవు ఫోన్లు లేవు
పనిగంటలు లేవు సెలవుల్లేవు
ఎండాలేదు వానాలేదు
పగలులేదు రాత్రి లేదు
నెలజీతాలు బోనసులు లేవు
మాయామర్మం తెలవనివాడు
అందరిని నమ్మినవాడు
నమ్మి మోసపోయినవాడు
కల్తి విత్తనాలు, కల్తి ఎరువులు, పురుగు మందులు
కరువు కాలంలో
రైతు చెమట చెమ్మతో
మొలకెత్తిన విత్తనం
ఆరుగాలం కష్టం
పువ్వులు పూసిన అప్పులు
కాయలు కాచిన వడ్డీలు
పంటను దోచుకెల్లే దళారిగద్దలు
ఋణ మాఫీలు, పావలావడ్డీలు
రైతు మిత్రులు, రైతు బంధువులు
ఎడారిలో ఎండమావులు
మాయ జూదంలో
ఓడిపోయిన ధర్మరాజతడు
వచ్చిపోయే కరెంటుతో
వాటేసిన మడి ఎండుతోందో
పండుతుందో తెల్వదు
రైతు ఇంట్లో పెండ్లి మేళాలు లేవు
చావు మేళాలు విన్పిస్తున్నాయి.
కరువులో మన్ను బువ్వతిన్నవాడు
శిస్తులు కట్టలేక బండలు మోసినవాడు
మట్టిని నమ్మినవాడు
మట్టిని మెతుకులుగా మార్చినవాడు
అందరికి అన్నంపెట్టి
తాను గంజినీల్లు తాగినరంతి దేవుడతడు
అతడే అన్నదాత




ప్రస్థానం వెబ్‌సైట్: www.prasthanam.com

'ప్రస్థానం' కు చందా కట్టండి !
నెల నెలా మీ ఇంటికే ప్రస్థానం తెప్పించుకోండి !!



అయిదేళ్లకు : రు. 500 /-
పదేళ్లకు : రు. 1000/-
సంవత్సర చందా (వ్యక్తులకు) : రు. 120/-
సంవత్సర చందా (సంస్థలకు) : రు. 150/-
విడి ప్రతి : రు. 10/-

*5,10 సం॥ల* చందా కట్టిన వారికి సుమారు *1000/-*లు విలువ చేసే పాత ప్రస్థానం పుస్తకాలు ఉచితం.
◆ ట్రాన్స్‌పోర్టు చార్జీలు అదనం

ఒక మంచి పత్రికకు చందా కట్టండి! - తెలుగు సాహిత్య కృషిని ప్రోత్సహించండి !!

ప్రస్థానం

ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, ఆజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్-20
వివరాలకు: 040-27660013, సెల్ : 9490099059 ఇ-మెయిల్ : ssprasthanam_@gmail.com ; www.prasthanam.com

# స్వీకారం

## అక్షర హారతి



**కవిత్వం**

**డా॥సమ్మన్న**

వెల : రూ.100/- పేజీలు: 82

ప్రతులకు : 9885238654

ప్రసిద్ధిచెందిన కవులకు ఏ మాత్రం తీసిపోని కవిత్వం. పదకోశంపై వారికున్న పట్టు, పదాలు కూర్చడంలో నేర్పు, వస్తువు ఎన్నికలో, వస్త్వైకత ఎంతో అనుభవం మొత్తానికి మా గురువుగారు ఒక గొప్ప కవి అని తెలిసి మనస్సెంతో ఆనందపడుతున్నది.

**- బి. బాలకృష్ణ**

## అపరిచితం



**నవల**

**నరేష్ నున్నా**

వెల : రూ.70/- పేజీలు: 82

ప్రతులకు : 9849009776

నా విషయానికొస్తే, ముఖ్యంగా ఈ కొత్త రచన– 'అపరిచితం'– అంచెలంచెలుగా సాగిన ఈ మూడేళ్ళూ ముందెప్పుడూ లేనన్ని ఇబ్బందులు, ఈతిబాధలు పడ్డాను. అవేమీ కనీవినీ ఎరగని సినిమా కష్టాలేమీ కావు. కానీ, ఎక్కడో వచ్చిన సునామీ కంటే, నా గుడిసె కప్పు చిల్లుల్లోంచి కురిసే వానే పెద్ద సమస్యగా అతలాకుతలమయ్యే నాకు ఈ మూడేళ్ళూ, ముఖ్యంగా గత ఏడాది నిజంగా గడ్డుకాలమే.

**- నరేష్**

## ఎర్రచీమలు



**నానీలు**

**వడ్డేపల్లి రాంప్రసాద్**

వెల : రూ.30/- పేజీలు: 52

ప్రతులకు : 8897868747

ఎర్ర చీమలు కుట్టినప్పుడు ఏవిధంగా చిమ చిమ పెడుతుందో ఈ "ఎర్ర చీమలు" నానీలు చదివినప్పుడు అంతటి ఆలోచన చలనాలు నరనరాల్లో సుడులు తిరుగుతాయి. అప్పుడు పాఠకుడు కవి కవిత్వపు దారల వెంట దారులు వెతుక్కుంటూ చైతన్యపు తీరాలను చేరుతాడు.

**- తోటపల్లి**

## ఆమె కోసం



**కవిత్వం**

**సంగెవేని రవీంద్ర**

వెల : రూ.50/- పేజీలు: 52

ప్రతులకు : 09987145310

ఎన్నో వైవిధ్యాలతో, కవితలు... వ్యాసాలు... రాస్తున్న రవీంద్ర, ముఖ్యంగా ముంబయిలోని సామాన్య మానవ జీవితాలని ఇంత చక్కగా అక్షర రూపంలో అందరికీ తెలియజేస్తున్న కవి, మరీ ముఖ్యంగా తెలుగు కవి ఈ రవి ఒక్కరే... నాకు తెలిసినంత వరకు...

**- తురగా జయశ్యామల**

## వరిమళ్ళ వసంతం



**కవితా సంపుటి**

**వురిమళ్ళసునంద**

వెల : రూ.100/- పేజీలు: 112

ప్రతులకు : 9494773969,9441815722

నిరాశ నుండి ఆశను, ఒంటరి తనాన్నుండి సమిష్టి చైతన్యాన్నీ, అవిశ్వాసాన్నుండి ఆత్మవిశ్వాసాన్నీ సాధించాలన్న తపన ఈ సంపుటిలోని చాలా కవితల్లో కనిపిస్తుంది. అది ఈ కవయిత్రిలోని ప్రధాన ప్రేరణ అనిపిస్తుంది.

**- డా॥ అద్దేపల్లి రామమోహనరావు**

## శూన్యం నుండి...



**ముంబై తెలుగు ప్రముఖుల**

**స్ఫూర్తిదాయక విజయ గాథలు**

**సంగెవేని రవీంద్ర**

వెల : రూ.150/- పేజీలు: 86

ప్రతులకు : 09987145310

నేను చరిత్రకారుడ్ని కాదు. పరిశోధకుడ్ని అంతకన్నా కాదు. కానీ నా కర్మభూమి ముంబయిలో నా సమకాలీన తెలుగువారి పాత్రను రేపటి తరాలకు అందించాలని నా పరిమితుల్లో ఈ చిన్ని ప్రయత్నాన్ని మొదలుపెట్టాను. నేడు ముంబయి పరిసర ప్రాంతాలో వివిధ రంగాల్లో విజేతలైన వారి చరిత్రను మీ ముందు ఉంచాలన్నదే నా తాపత్రయం.

**- సంగెవేని రవీంద్ర**

# స్వీకారం

## మౌనవేదన

**కవిత్వం**

**విడదల సాంబశివరావు**

**వెల : రూ.100/- పేజీలు: 93**

**ప్రతులకు : 9866400059**




'మౌనవేదన'లోని కవితలన్నీ ఈనాటి సమాజంలోని మానవతా విధ్వంసాన్ని గురించి చెప్పేవే. మనిషి బాధ్యతను గుర్తుచేసేవే. కవి ఆవేదనకు ప్రతి రూపాలే. సరళంగానే చెప్పినా, తీవ్రంగా మనసును తాకేవే.

**- డా॥ అద్దేపల్లి రామమోహనరావు**

## స్పెల్ మాస్టర్

**ఇంగ్లీష్ స్పెల్లింగ్ మేడ్ ఈజీ**

**బొల్లిముంత వెంకటరమణారావు**

**వెల : రూ.60/- పేజీలు: 56**

**ప్రతులకు : 8106713351**




కాగితం మీద మీ ఆలోచనలను వ్రాయాలనుకొన్నప్పుడు ఎలాంటి పదదోషాలు దొర్లకుండా వ్రాయడానికి ఈ పుస్తకంలో ఉదాహరణలుగా కొన్ని పదాల మెళకువలను పొందపరచడం జరిగింది. ఈ పుస్తకంలో ఆంగ్ల పదాల గురించి ప్రాథమిక వివరాలను, పద నిర్మాణ పద్ధతులను సులువుగా వివరించడం జరిగింది.

**- బొల్లిముంత వెంకట రమణారావు**

## చేనేత వెత

**డా॥ పిట్టా సత్యనారాయణ**

**వెల : రూ.100/- పేజీలు: 46**

**ప్రతులకు : 9849812054**




అలనాడు మహోజ్జ్వలంగా వెలుగొందిన 'నేత వృత్తి' నేడు కొడిగట్టిన దీపంలా కొట్టుమిట్టాడుతున్న వైఖరిని చక్కగా చూపించారు. యంత్రభూతాల కోరల్లో చిక్కిశల్యమైన చేనేత వృత్తుల దయనీయ పరిస్థితిని కళ్ళకు కట్టినట్లు వర్ణించారు.

**- నల్ల యాదగిరి**

**డా॥ బోయ జంగయ్య ఆత్మకథ**

## అవసరం

**ఆకారపు పాండురంగ ప్రజాసింగం**

**వెల : రూ.70/- పేజీలు: 105**

**ప్రతులకు : 9912565856**




డా॥ బోయ జంగయ్య గారి ఏ పుస్తకమైన, ఏ రచనా ప్రక్రియ అయినా గట్టిగింజలే. ఆలోచింప చేసేవే గనుక విద్యార్థులకు పాఠ్యాంశాలు అయ్యాయి. అవార్డులు తెచ్చాయి. బి.ఎ. చదివి పీజీ లేకుండా పీహెచ్‌డి పట్టా పొందిన ప్రజల కవి డా॥బోయ జంగయ్యగారి ఆత్మకథ తొలిభాగం ఇది. దళిత బహుజన రాజ్యాధికార ఉద్యమానికి ఇది 'అవసరం'.

**- ఆకారపు పాండురంగ ప్రజాసింగం**

## సొనకాలువల అపూర్వ పురాగాధ

**డా॥ లెనిన్ ధనిశెట్టి**

**వెల : రూ.20/- పేజీలు: 33**

**ప్రతులకు : 9866061350**




ప్రపంచంలో ఏడు వింతల్ని తలదన్నే సొనకాలువల అరుదైన పర్యావరణ అద్భుతం తాలూకూ పూర్వపురా ప్రాకృత గాథను రెండు వందల వేల సంవత్సరాల నుండీ ప్రస్తుత వరకూ సాదరంగా పరిచయం చేస్తుందీ పుసక్తం...

**- అనంతుడు ఫౌండేషన్**

## ఎగరాల్సిన సమయం

**బాలసుధాకర్ మౌళి**

**వెల : రూ.80/- పేజీలు: 159**

**ప్రతులకు : 9676493680**




డెబ్భై కవితలున్న ఈ కవితా సంపుటి చదివాక - గుండెల్నిండుగా కొత్త గాలి పీల్చుకున్నట్టు - ఒక ధైర్యపు వచనమేదో మనల్ని తాకుతున్నట్టు - ఒక జ్వాలగా మన ముందు ఒకడు నడచి వెడుతుంటే వాడి వెనక మనం నడున్నన్నట్టు - ఎంత ఉద్వేగభరితమయిన కవిత - ఎంత మృదువైన కవిత్వం - ఎంత స్వయంచాలిత కవిత్వం-

**- శివారెడ్డి**

## కర్నూల్లో 'నా కవిత్వం - నా అనుభవం'

కవి నిరంతర సృజన శీలుడని, మానవీయ భావనల అభివ్యక్తికి అత్యంత ఆత్మీయమైన మాధ్యమం కవిత్వమని, కవులు నిరంతర అధ్యయనంతో ముందుకెళ్ళాలని ప్రముఖ కవి, సాహితీ విమర్శకులు, సాహిత్య అకాడమీ సలహామండలి సభ్యులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సాహిత్య అకాడమి–సాహితీ స్రవంతి జిల్లా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కర్నూలు నగరంలో **నా కవిత్వం–నా అనుభవం** అనే సాహిత్య కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా ప్రముఖ కవి జి.వెంకటకృష్ణ వ్యవహరించారు. రాచపాళెం మాట్లాడుతూ కళ్ళుంటే చూసి, వాక్కుంటే వ్రాసీ అని మహాకవి శ్రీశ్రీ అన్నాడని ఎవరూ చూడలేనివి కవి చూస్తాడని, ఎవరూ రాయలేనివి కవి రాస్తాడని కవిత్వం మనిషి సృజనాత్మకతకు సంబంధించినదని అన్నారు. కవి వెంకటకృష్ణ మాట్లాడుతూ హృదయ స్పందనే కవిత్వమని, మదిని మదించి కవిత్వాన్ని కవులు అల్లుకుపోతారని అన్నాడు. తెలుగు భాషా సాహిత్యాల అభివృద్ధికి కవులు నిరంతరం కృషి చేస్తున్నారని ఇది తెలుగుజాతి గొప్పతనమని అన్నారు. అనంతరం ఎంపిక చేసిన ఐదుమంది కవులు తమ కవితలను సభలో చదివి వారి కవిత్వ అనుభవాలను వివరించారు. కర్నూలుకు చెందిన టి. వెంకటేష్ దుఃఖ వాంగ్మూలం, జంధ్యాల రఘుబాబు అక్షర నిర్దేశం, నంద్యాలకు చెందిన డా. కళామురళి వొంటిరినైనా, డా. అనందరావు స్థిర చరత్వం, ఆదోనికి చెందిన కెంగార మోహన్




**కర్నూల్‌లో సాహిత్య అకాడమీ, సాహితీ స్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన నా కవిత్వం - నా అనుభవం సభలో ప్రసంగిస్తున్న డా॥రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి. చిత్రంలో కథా రచయిత వెంకటకృష్ణ**

అక్షర విన్యాసం కవితలపై లోతైన చర్చ విశ్లేషణ కవులు చేశారు. ఐదుమంది కవులు తమ కవిత్వ అనుభవాలను సభలో పంచుకున్నారు.

ఈ కార్యక్రమంలో కవి ఆలిండియా రేడియో కర్నూలు వ్యాఖ్యాత డా.వి. పోతన్న, ప్రముఖ కవి కాశీభట్ల వేణుగోపాల్ రచయితలు, సవ్వప్పగారి ఈరన్న, డా.యం. హరికిషన్, ప్రముఖ కథారచయిత, పాత్రికేయులు ఇనాయతుల్లా సాహితీ స్రవంతి నాయకులు ఆవుల బసప్ప, రఘురాం, ప్రేమ్‌కుమార్, కథారచయిత్రి యం. నాగమణి ప్రభుతులు పాల్గొన్నారు.

---

## 'వాణ్ణి జయించాలి' ఆవిష్కరణ



**కాకినాడలో జరిగిన 'వాణి జయించాలి' ఆవిష్కరణ సభలో ప్రసంగిస్తున్న డా॥అద్దేపల్లి రామమోహనరావు. చిత్రంలో ఐ.వి.ఆర్ మూర్తి, డా॥జొస్యుల క్రిష్ణబాబు, అడపా రామక్రిష్ణ, గనారా తదితరులు.**

సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో అక్టోబర్ 26న కాకినాడ, గాంధీభవన్‌లో అడపా రామకృష్ణ వ్రాసిన దీర్ఘ కవిత 'వాణ్ణి జయించాలి' ఆవిష్కరణ సభ జరిగింది. అధ్యక్షులు, ఆవిష్కర్త డా॥ అద్దేపల్లి రామమోహనరావు మాట్లాడుతూ, 'వాడు' అనేది అవినీతి వ్యవస్థకు సంకేతంగా కవి ప్రయోగించాడనీ, దీన్ని జయించాలి అనేది కవి అభిప్రాయమనీ, ఈ దీర్ఘకవిత అంతా ఇప్పుడు జరుగుతున్న అన్ని విధాలైన అవినీతినీ, ప్రవాహరూపంగా ఆవేశంతో ఈ కవి, వ్యక్తం చేశారనీ చెప్పారు. విశ్రాంత అధ్యాపకులు, డా.జోస్యుల కృష్ణబాబు దీర్ఘకవితలోని అన్ని విషయాలను, సోదాహరణంగా విశ్లేషిస్తూ ప్రసంగించారు. ఈ దీర్ఘ కవిత పాఠకులలో ఈ వ్యవస్థను ఓడించాలనే ఆలోచనను అందరిలోనూ తప్పక కలిగిస్తుందని చెప్పారు. పి.అనంతరావు మాట్లాడుతూ కార్మికులకూ, కార్పొరేటు యజమానులకు మధ్య జరిగే అవినీతి రాజకీయాల్ని వివరించి, దీర్ఘకవితకు అన్వయిస్తూ మాట్లాడారు. ఎ.వి.ఆర్.మూర్తి, దీర్ఘ కవిత లక్షణాల్ని వివరిస్తూ, అడపా రామకృష్ణ ప్రధానంగా కథా నవలా రచయిత అనీ, దీర్ఘకవితను కూడా బాగా రాయగలడని, ఈ పుస్తకం నిరూపిస్తుందనీ అన్నారు. అడపా రామకృష్ణ తన స్పందన వెలువరించి, దీర్ఘకవిత రచనలోని తన లక్ష్యాన్ని వివరించాడు. సభా ప్రారంభంలో గరికిపాటి మాష్టారు వ్రాసిన, విద్య గురించిన పాటని మేడిశెట్టి శ్రీరాములు సుమధురంగా గానం చేయగా, గనారా వందన సమర్పణతో సభ ముగిసింది.

# 'నీవు మాకు ఆదర్శం' పుస్తకావిష్కరణ




ఈ ప్రపంచాన్ని శాసించగలిగే శక్తి సాహిత్యవేత్తలకు ఉందని, వారే ఈ ప్రపంచాన్ని శాసించగలరని ప్రముఖ సాహితీవేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె.శివారెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో బాగ్‌లింగంపల్లిలో గల ఆర్టీసీ కళాభవన్‌లో నవంబర్ 23న స్వార్థ భారతి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ రచించిన 'నీవు మాకు ఆదర్శం' పుస్తక ఆవిష్కరణ జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ రచయిత హృదయానికి ప్రతీక ఈ పుస్తకమని అభివర్ణించారు. కలపటం కవిత్వ లక్షణమని, విడగొట్టటం రాజకీయమని ఆయన వ్యాఖ్యానించారు. గౌరవ అతిథి హోంశాఖా మంత్రి నాయిని నరసింహారెడ్డి మాట్లాడుతూ.. హృదయాలను కదిలించే శక్తి సాహిత్యానికి ఉందని, మన సమాజంలోని చెడుని పారదోలి మంచిని పెంపొందించేది సాహిత్యమన్నారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కె.రామస్వామి మాట్లాడుతూ సాహిత్యం అంటే మనిషిని ఆలోచింపచేసేదని, ఆనందిపంచేసేదని, ఆవేశం రగిలించేదని, అవసరమైతే పిడికిలి బిగింపచేసేదని, ఆ లక్షణాలన్నీ ఈ పుస్తకానికి ఉన్నాయని అన్నారు. సభాధ్యక్షులు, స్వార్థ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు మోహన్‌రావ్ మాట్లాడుతూ చంద్రకుమార్ మంచి న్యాయమూర్తి అని, ఆయన కలం నుండి వెలువడిన ఈ పుస్తకం సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం ప్రముఖులకు సేవాపురస్కారాల్ని అందజేశారు. ఆవిష్కరణ కార్యక్రమానికి ముందు కవి బిక్కి కృష్ణ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఛాన్సలర్ కొలకలూరి ఇనాక్, ఎ.పి. శాసన మండలి అధ్యక్షులు డాక్టర్ ఎ.చక్రపాణి, మేడసాని మోహన్, జస్టిస్ సి.ప్రవీణ్ కుమార్, జస్టిస్ వెంకటేశ్వరరెడ్డి, మోహన్ కందా, ముంబాయ్ ఇన్ కంటాక్స్ జాయింట్ కమిషనర్ జీవన్ లాల్, ఆంధ్రప్రభ ఎడిటర్ వైఎస్ ఆర్ శర్మ, నేటినిజం ఎడిటర్ బైస దేవదాస్, ప్రముఖ కవులు పాల్గొన్నారు.



**చిత్తూరు జిల్లా పలమనేరులో నవంబర్ 16న 'కథతో కొంత సమయం' - చర్చా కార్యక్రమంలో పాల్గొన్న రచయితలు.**

# డైరీ



అరసం జిల్లాశాఖ ఆధ్వర్యంలో గుంటూరులో జరిగిన అమరజీవి కొండేపూడి శ్రీనివాసరావు సాహితీ సత్కారసభలో కొండేపూడి జయరావ్ నుండి సత్కారం స్వీకరిస్తున్న కథా నవలా రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి. వేదికపై అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, కథా రచయిత మంచికంటి వెంకటేశ్వరరెడ్డి, కథా సంచిక రచయిత వల్లూరి శివప్రసాద్‌లు.



అరసం జిల్లాశాఖ ఆధ్వర్యంలో గుంటూరులోజరిగిన ఆవిష్కరణ సభలో పెనుగొండ లక్ష్మీనారాయణ వ్యాససంపుటి 'విదిత' ఆవిష్కరిస్తున్న చందు సుబ్బారావు. వేదికపై డా॥ కనపర్తి స్వర్ణలత, రచయిత ఉప్పల అప్పలరాజు, కథా నాటక రచయిత వల్లూరు శివప్రసాద్.




అక్టోబరు 30న కరీంనగర్‌లో ఆచార్య కదారు వీరారెడ్డి రాసిన "కాలం అడుగులు" పుస్తకావిష్కరణలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు డా॥కె.రమణాచారిని సత్కరిస్తున్న కె. అనంతరెడ్డి, కె.వీరారెడ్డి, జిల్లా కలెక్టరు ఎం. వీరబ్రహ్మయ్య, నేటినిజం సంపాదకులు బైస దేవదాస్, గంద్ర లక్ష్మణరావు.



అక్టోబరు 29న త్యాగరాయగాన సభలో పి.కృష్ణమూర్తి అనువాదకథలు "ప్రతిధ్వని" పుస్తకాన్ని ఆవిష్కరించిన జ్ఞానపీఠ అవార్డు గ్రహిత డా॥సి. నారాయణరెడ్డి, వేదికపై డా॥ దీక్షితులు, డా॥ ఓలేటి పార్వతీశం, సుద్దాల అశోక్‌తేజ, బైస దేవదాస్, పి.కృష్ణమూర్తి, ఎల్వీ సుబ్రహ్మణ్యం.



అక్టోబరు 21న శ్రీత్యాగరాయ గానసభలో "తెలుగు కవిత్వంలో అమ్మ" అంశంపై ప్రధాన ప్రసంగం చేసిన ద్వా.నా.శాస్త్రిని సత్కరిస్తున్న వంశీరామరాజు, 'నేటినిజం' సంపాదకులు బైస దేవదాసు, 'మూసి' సంపాదకులు డా॥ సాగి కమలాకర శర్మ, డా॥ కళా వేంకట దీక్షితులు, శ్రీమతి తెన్నేటి సుధ.



అక్టోబరు 25న నాంపల్లిలోని తెలుగు విశ్వ విద్యాలయంలో వట్టికోట ఆళ్వారుస్వామి శతజయంతి ఉత్సవాలను ప్రారంభిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా॥కె.వి.రమణాచారి, వేదికపై గంటా జలంధర్‌రెడ్డి, వట్టికోట శ్రీనివాసులు, పరాంకుశం వేణుగోపాల్ స్వామి, కపిలవాయి లింగమూర్తి, దిలీప్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, బైస దేవదాసు.



నవల స్వీయ అనుభవాల సారమని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో నవంబర్ 23న సున్నా నరేష్ రచించిన "అపరిచితం" నవలపై మిత్రుల విశ్లేషణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనసులో కలిగిన స్పందనల సమాహారామే ఈ నవల అన్నారు. ఈ నవల ప్రతులతోపాటు పరిమితులు కూడా విశ్లేషించారు. సామాజిక కార్యకర్త దేవి, కవి మోహర్ తదితరులు కూడా నవలపై మాట్లాడారు.



ఖమ్మం పట్టణంలోని బోడేపూడి విజ్ఞాన కేంద్రంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో నవంబర్ 16న జరిగిన సాహిత్య అధ్యయన వేదిక సభ. చిత్రంలో కపిల రాంకుమార్, కన్నెగంటి వెంకటయ్య, సంపటం దుర్గాప్రసాద్, రౌతు రవి, వురిమళ్ళ సునంద.



విజయనగరం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో నవంబర్ 23న గురజాడ కేంద్ర గ్రంథాలయంలో జరిగిన గంటేడ గౌరునాయుడు కవితా సంపుటి 'ఎగిరిపోతున్న పిట్టల కోసం' ఆవిష్కరణ. చిత్రంలో చీకటి దివాకర్, అట్టాడ అప్పల్నాయుడు, గంటేడ గౌరునాయుడు.



గుంటూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో అక్టోబర్ 21న శ్రీమతి షేక్. బషీదున్నిసా బేగం రచించిన "ముఖచిత్రాలు" కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న కవయిత్రి డా॥ చిల్లర భవానీదేవి, చిత్రంలో డా॥పి.వి.సుబ్బారావు, డా॥రామడుగు వెంకటేశ్వరశర్మ, నదిపత్రిక సంపాదకులు జలదంకి ప్రభాకర్, కోసూరి రవికుమార్ ఎస్.ఎం.సుభాని తదితరులున్నారు.



అక్టోబరు 24న శ్రీ త్యాగరాయ గానసభలో కేతవరపు రాజ్యశ్రీ రచన "నా లండన్ యాత్ర" పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న 'నేటినిజం' సంపాదకులు బైస దేవదాసు. వేదికపై శోభా పేరిందేవి, అభినందన భవానీ, త్రినాథరావు, డా॥పోతుకూచి, సుధామ, దుర్గ.



అక్టోబర్ 26న నెల్లూరు, ఐ.యం.ఏ హాలులో పాతూరి. మాణిక్యమ్మ రాష్ట్రస్థాయి స్మారక, సాహిత్య అవార్డును డా॥ చింత కింది శ్రీనివాసరావు 'కథాసంపుటి' 'దాలప్ప తీర్థం'కు ఇవ్వబడింది. ఈ అవార్డు ఉత్సవంలో ప్రముఖ రచయితలు విహారి, చంద్రశేఖర ఆజాద్, పెళ్ళకూరు జయప్రదగారు, కోసూరి రత్నం, అవార్డు ప్రదాత పాతూరి అన్నపూర్ణ పాల్గొన్నారు.

## స్పందన

**ఎడిటర్ గారికి,**

1948లో రావూరి భరద్వాజ 'జ్యోతి' పత్రికకు రాసిన 'అలవాటైన ప్రాణం' అనే కథకు కోర్టువారు అయిదు వందల జరిమానా విధించారు అని సాహిత్య ప్రస్థానం నవంబర్ సంచికలో (2014) వ్రాశారు. భరద్వాజ వ్రాసిన 'అలవాటైన ప్రాణం' కథ 'జ్యోతి' పత్రికలో ప్రచురించబడలేదు. ఆలపాటి రవీంద్రనాథ్ ఆధ్వర్యంలోనే నిర్వహించబడిన 'రేరాణి' అనే అత్యధిక పాఠకులు గల శృంగార పత్రికలో ప్రచురించబడింది. ఆరునెలల జైలు శిక్షకు బదులుగా రవీంద్రనాథ్ చెల్లించిన జరిమానా సొమ్మును భరద్వాజ మరియు ఆయన మనుమడు రామోజీ 1994లోనో 1995లోనో ఆ అయిదు వందలకు మరో రూ.58/- చేర్చి కొత్త వస్త్రాలతో, తాంబూలంతో మిఠాయితో సమర్పించుకొన్నారు. అశ్వినీకుమార్ వ్రాసిన ఈ వ్యాసంలో భరద్వాజ అయిదు వందలు తిరిగి ఇచ్చారని వ్రాశారు కానీ ఏ సంవత్సరంలో తిరిగి ఇచ్చారో చెప్పనందువల్ల ఇంచుమించు 45 సంవత్సరాల తర్వాత అదే మొత్తం ఇచ్చారన్న సంగతి పాఠకులకు అర్థం కాదు. దీనిని బట్టి ఆలపాటి రవీంద్రనాథ్ ఔదార్యం పాఠకులకు తెలిసే అవకాశం లేదు...

**- బొగ్గుల శ్రీనివాస్**
**(రావూరి భరద్వాజ సమగ్ర సాహిత్య పరిశోధకులు)**
**9246551144**

---

నవంబర్ ప్రస్థానం సంచికలో మమ్మల్నెంతో ఆకట్టుకున్న వ్యాసం, వజ్రాయుధం-సోమసుందర్ కవితోద్యమం చదివి, యింత గొప్ప ఉద్యమ సాహితీ కారుడు మన మధ్యే వున్నాడని తెలిసి, వారి పుట్టినరోజు వేడుక, సాహితీ వేదికగా చేసుకుంటున్నారని గుర్తు చేసే వ్యాసం ప్రచురించడం ప్రస్థానం పత్రికకు కృతజ్ఞతలు చెప్పాలి. ఆ వ్యాస రచయిత అడవి రామకృష్ణ గారికి మేమెంతో ఋణపడి వున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం.

**- శ్రీనివాస్, బెంగుళూరు.**

---

## డైరీ

### సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో జానపద కళారూపాలపై చర్చా కార్యక్రమం

సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో నవంబర్ 9న జానపదకళలపై కాకినాడలో చర్చా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గద్దే పచ్చాలరావు మాట్లాడుతూ జనపదకళల తత్వాన్నీ, భారతీయ సంస్కృతిని కాపాడ్డంలో జనపదకళ రూపాల ప్రాధాన్యాన్నీ సోదాహరణంగా వివరించారు. ముఖ్యంగా మానవ సంబంధాల్ని పటిష్టపరచడంలో జానపద రూపాలన్నీ ఎలా ప్రచురితమైనాయో చెప్పారు. తూర్పుగోదావరిలో ప్రసిద్ధమైన తప్పెటగుళ్ళు, భజనలు, బుర్రకథలు మొదలైన రూపాల విశిష్టతను పేర్కొన్నారు. అద్దేపల్లి ప్రభు ముందుగా ప్రసంగ వేదికను వివరిస్తూ జానపద గేయాల పరిమాణాన్ని, ఆ పాటల మౌఖికతలోని ప్రాధాన్యాన్ని సోదాహరణంగా చెప్పి పచ్చాలరావు చేస్తున్న కృషిని పరిచయం చేశారు. అధ్యక్షత వహించిన డా॥ వుయ్యపు హనుమంతరావు, తానెరిగిన తూర్పుగోదావరి జిల్లా జానపద కళాకారుల ప్రదర్శన విశేషాల్ని సోదాహరణంగా వివరించారు. తర్వాత 'తెల్లారితే....' అనే అంశంపై కవితాగోష్టిలో, ఇందిర, గడలశివప్రసాద్, జనార్దన్ శిరీష, పాలపర్తి ధనరాజ్ వుయ్యక్ళ హనమంతరావు, తురగా కృష్ణమోహన్ మొదలైన కవులు కవితలు వినిపించారు. మేడిశెట్టి శ్రీరాములు పాడిన జానపద గేయంతో సభ ముగిసింది.

---

### ఉమ్మడి శెట్టి సాహితీ అవార్డు విజ్ఞప్తి,

ప్రతిష్ఠాత్మక రజతోత్సవ సంస్థ "ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు-2014 కోసం కవులనుండి, కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు అవార్డు వ్యవస్థాపకులు డా॥రాధేయ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ అవార్డు పరిశీలన కోసం 2014 సం॥లో ప్రచురింపబడిన కవితా సంపుటాలను మాత్రమే పంపాలి. ఎంపికైన ఉత్తమ కవితా సంపుటికి, మూడువేల రూపాయలు నగదు, షీల్డుతో కవికి సత్కారం ఉంటుంది. 31-1-2015 తేదీలోగా 4 ప్రతులు - డా॥ రాధేయ, కవితా నిలయం, 13-1-606-1, షిర్డినగరత్, రెవిన్యూ కలానీ, అనంతపురం-515001 అనే చిరునామాకు పంపాలి.

### బిక్కి కృష్ణకు రంజని కుందుర్తి అవార్డు



రంజని, తెలుగు సాహితీ సమితి, ఏ.జి.ఆఫీసు, హైదరాబాద్ 2014 సంవత్సరానికి 'నేటి నిజం' దినపత్రిక సౌజన్యంతో నిర్వహించిన 'రంజని కుందుర్తి' పురస్కారానికి బిక్కి కృష్ణ కవిత 'వాడితో చెప్పండి' అత్యుత్తమ కవితగా ఎన్నికైనట్లు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని 10టి.వి. ఛానల్‌లో బిక్కి కృష్ణ ప్రోగ్రామ్ విభాగంలో పనిచేస్తున్నారు.

### సవరణ

సాహిత్య ప్రస్థానం నవంబర్ సంచికలో వి.సూర్యారావు కవితలోని కొన్ని వాక్యాలు - 'చీకట్లని వెలుగుని.../' నుండి 'సర్వశోధన అవుతుంది.' వరకు అదే సంచికలో ప్రచురించిన జి.శ్రీరామ్మూర్తిగారి కవితలో కలిశాయి. ఈ పొరపాటుకు చింతిస్తున్నాం.

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**

# గురజాడ అప్పారావు



జననం : **21.09.1861** – మరణం : **30.11.1915**

**గురజాడ శత వర్ధంతి సంవత్సరం**

SHAITYA PRASTHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.H/SD/415/13-15
Date of Positng : 30.11.2014 ▪ Date of Publication: 25.11.2014


# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు




వెల: రూ. 20/-




వెల : రూ.200/-




వెల : రూ.50/-




వెల : రూ.125/-




వెల : రూ.50/-




వెల : రూ.125/-




వెల : రూ.175/-




వెల : రూ.120/-




వెల : రూ.120/-




వెల : రూ.120/-




సాహిత్య ప్రస్థానం




## సంవత్సర చందా కేవలం- రూ.120/- మాత్రమే

**తెలుగు సాహిత్య కృషిని ప్రోత్సహించండి! తెలుగు భాషా వికాసానికి మీ వంతు సహకరించండి!**

వివరాలకు: సాహిత్య ప్రస్థానం, ప్లాట్ నెం.21/1, యం.హెచ్. భవన్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర,
ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్- 500 020, ఫోన్: 040-27668861, సెల్: 9490099059
Email- ssprasthanam@gmail.com

www.prasthanam.com
ప్రస్థానం వెబ్‌సైట్‌ను
తప్పక చూడండి!

ప్రత్యేక తగ్గింపు
5 సంవత్సరాల చందా : రూ. 600 - 100 : 500/- మాత్రమే
10 సంవత్సరాల చందా రూ. 1200 - 200 : 1000/- మాత్రమే
అంతేకాదు విలువైన పాత ప్రస్థానం సంచికలు ఉచితం
ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు అదనం


**If Un delivered please return to :** Prasthanam, C/o M.H.Bhavan, Plot No. 21/1, Azamabad
Near RTC Kalyanamandapam, Hyderabad - 500 020 (A.P), Ph: 040-27660013, Cell: 9490099059